26-7Pg1exHMNWJQEVRS.qxd:26-7Pg1exHMNWJQEVRS.qxd 01/01/01 10:39 AM Page 1

మొజాయిక్ గత వారం ఫోకస్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 175 పేజీలు: 12 వెల: 6.50

డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగం విజయవంతం 9లో

రెండు దేశాల మధ్య రాజుకుంటున్న శివాలయాల వివాదం

# నేను సైతం దత్తత



శుక్రవారం సచివాలయంలో పి4 లోగోను ఆవిష్కరిస్తున్న సిఎం నారా చంద్రబాబునాయుడు

## సిఎం చంద్రబాబు కీలక నిర్ణయం


### పి4లోగోను ఆవిష్కరించిన సిఎం

### పేదరిక నిర్మూలనకు అందరూ కలిసి రావాలి

### ఇప్పటివరకు 5,74,811 కుటుంబాల గుర్తింపు

**విజయవాడ, జూలై 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సంకల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను కూడా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు శుక్రవారం సచివాలయంలో జీరో పావర్టీ పీ4పై జరిగిన సమీక్షలో అధికారులకు స్పష్టం చేశారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములు అవుతారని చెప్పారు. అందరిలో చైతన్యం నింపేలా మరింత మంది సంపన్నులు మార్గదర్శులుగా ముందుకు వచ్చేలా తన నిర్ణయం దోహద పడుతుందని అన్నారు. పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోందని, పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. దీనిని విజయవంతం చేసేందుకు అత్యుత్తమ విధానాలను అన్ని చోట్లా అమలు చేసి చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారందరినీ ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని నిర్దేశించారు. ప్రవాసాంధ్రులను కూడా భాగస్వామం చేసేందుకు ఏపీ ఎన్నార్టీ సొసైటీ సాయం తీసుకోవాలని చెప్పారు. అలాగే కార్పొరేట్ సంస్థలు దీనికి కలిసి వచ్చేలా చూడటంతో పాటు వారితో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికే చెందిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని సూచించారు. ఒకవేళ స్థానికంగా మార్గ దర్శులు లేకపోతే అప్పుడు స్థానికేతరులను అనుసంధానం చేయా లని నిర్దేశించారు. పీ4 కార్యక్రమంలో భాగస్వామి అయ్యేందుకు రాష్ట్ర స్థాయిలో దాతలు ముందుకు వస్తే వారిచ్చే నిధుల కోసం కామన్ ఫండ్ ఏర్పాటు చేయాలని, దాని ద్వారా బంగారు కుటుంబాలకు సాయం అందించవచ్చని సీఎం స్పష్టం చేశారు. సమావేశంలో సీఎం చంద్రబాబు పీ4లోగోను ఆవిష్కరించారు.పీ4 లోగో ముద్రించిన బ్యాడ్జీని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పియూష్‌కుమార్ సీఎం చొక్కాకు పిన్‌చేసారు.

**ఆగస్టు10లోగా పీ4 ప్రాధాన్యతల సర్వే:** బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను ఆగస్ట్10లోగా పూర్తి చేయాలి. మార్గదర్శులు అందించే ఆర్థిక, ఆర్థికేతర సాయం >>2



# మాల్దీవులకు రూ.4850 కోట్ల సాయం

### రెండుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి కృషి

### కీలకరంగాల్లో పరస్పర సహకారానికి ఇరుదేశాల అంగీకారం

### మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జుతో భేటీ తర్వాత ప్రధాని మోడీ

**మాలె(మాల్దీవులు) జూలై 25:** ఇరుగుపొరుగుదేశాలకే తొలిప్రాధాన్యం కింద మాల్దీవుల దేశానికి ప్రముఖ స్థానం ఉందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బ్రిటన్ పర్యటనను ముగించుకుని శుక్రవారం మాల్దీవులు చేరుకున్న ప్రధాని దేశ అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయదేశమని అన్నారు. ఈ ద్వీపకల్ప దేశానికి లైన్ ఆఫ్ క్రెడిట్‌కింద రూ.4850 కోట్ల ఆర్థికసాయం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. వాణిజ్య, రక్షణ, మౌలిక వసతులు తదితర రంగాల్లో పరస్పర సహకారానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు ప్రధాని అన్నారు. భారత్‌మాల్దీవులమధ్య స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబందించిన చర్చలు ప్రారంభం అయ్యాయన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం ఖరారుకు ఇరుదేశాలుకృషిచేస్తున్నాయనిచెప్పారు. భారత్ అనుసరించే పొరుగుకే ప్రాధాన్యం మహాసాగర్ విధానాల్లో మాల్దీవులకే ఎక్కువ ప్రాధాన్యం ఉందన్నారు. రక్షణ సామర్థ్యాలనున బలోపేతంచేసుకోడానికి ద్వీపదేశానికి భారత్ నిరంతరం మద్దతిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాల్దీవులకు వెళ్లారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆ దేశంలో అడుగుపెట్టారు. ఆయనకు ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, విదేశాంగ, రక్షణ, ఆర్థిక, హోంశాఖ మంత్రులు విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికారు. >>2

# ముందస్తు చర్యలు చేపట్టాలి



### హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** భారీ వర్షాలకు వరద ముంపు ప్రమా దాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత ఆదేశించారు. ప్రమాద హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత వాతావరణ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, సిబ్బందితో ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. వాయుగుండం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాలను తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, జార్ఖండ్ వైపుగా ఇది కదలే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. కోస్తాంధ్రలో ఆదివారం వరకు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవచ్చని చెబుతున్నా >>2

# వాయుగుండంగా అల్పపీడనం

### శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, మన్యం, విశాఖ, కృష్ణా జిల్లాలకు ఎల్లో అలెర్ట్

### ఉత్తర కోస్తా పోర్టులకు మూడో నెంబర్, దక్షిణ కోస్తా పోర్టులకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వర్షాల జోరు తగ్గడం లేదు. కృష్ణా,గోదావరి నదులకు భారీగా ఎగువ నుంచి వరద నీరు చేరుతుంది. విజయవాడలో ప్రకాశం బ్యారేజీ కొనసాగుతున్న వరద 25 గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేసిన అధికారులు. ఇన్ ఫ్లో 20,748 క్యూసెక్కులు అవుట్ ఫ్లో 18,125 క్యూసెక్కులు ఇబ్రహీంపట్నం రాయపూడి మధ్య లాంచీల ప్రయాణం తాత్కాలికంగా నిలిపివేసారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరికి అంతకంతకు వరద నీరు వచ్చిచేరుతుంది.

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారినట్లు భారత వాతావరణ విభాగం పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో 4 రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, మన్యం, విశాఖ, >>2

# ఆల్కహాల్ దుర్వినియోగంపై ఉక్కుపాదం

### ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా

### పకడ్బందీగా ఎథనాల్ రవాణా పర్యవేక్షణ



**విజయవాడ,జూలై 25,ప్రభాత వార్తప్రతినిధి:** పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఎక్స్ట్రా న్యూట్రల్‌ఆల్కహాల్ (ఇ ఎన్‌ఎ), రెక్టిఫైడ్ స్పిరిట్ (ఆర్ఎస్), >>2



శుక్రవారం అమరావతి నిర్మాణ పనులపై అధికారులనుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

### మూడేళ్లలో అమరావతి నిర్మాణం

### గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న సింగపూర్ సంబంధాలు: మంత్రి నారాయణ

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని నిర్మాణంపై కొంతమంది పనిగట్టుకుని చేసే దుష్ప్రచారాలు నమ్మవద్దని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.ప్రజలకు,అమరావతి రైతులకు ఇచ్చిన మాటప్రకారం మూడేళ్లలో ఖచ్చితంగా నూటికి నూరు శాతం రాజధాని పనులు పూర్తిచేసి తీరుతామన్నారు.అమరావతిలో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు మంత్రి. సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి నేలపాడులోని నాన్ గెజిటెడ్ అధికారులు,గెజిటెడ్ అధికారులు టైప్ 1,టైప్ 2,గ్రూప్ డి ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు.అక్కడ పనులు జరుగుతున్న >>2

# హాస్టళ్ల నిర్వహణకు సహకారమందించాలి

### బిసి సంక్షేమ మంత్రి ఎస్.సవిత



**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్ లో వెనుకబడిన తరగతుల హాస్టళ్లను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.దీనిలో భాగంగా దాతలు, ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద లబ్ధి పొంది ఉన్నత స్థితిలో ఉన్న విద్యార్థుల సాయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబునాయుడు పీ4 మోడల్‌కు శ్రీకారం చుట్టారన్నారు. సామాజిక బాధ్యత కింద ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న10 శాతం మంది ధనికులు, 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ >>2

# పలువురు ఐపిఎస్‌ల బదలీ

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పలువురు ఐపిఎస్ అధికారుల బదిలీ, నియామకాలు జరిగాయి.ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేసారు.ఈ ఉత్తర్వులను అనుసరించి విపత్తునిర్వహణ, అగ్నిమాపకశాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ బదిలీ అయ్యారు. ఆయనను రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌గా నియమించారు.అగ్నిమాపకశాఖ డైరెక్టర్ వెంకటరమణకు డీజీగా అదనపు బాధ్యతలు చెపట్టారు. వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ శ్రీధర్‌రావును సీఐడీ ఎస్పీగా నియమించారు.ఒక్కటి రెండు రోజుల్లో మరికొంత మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేసే అవకాశం ఉందంటున్నారు.ఎస్పీ క్యాడర్‌లో లూప్‌లైన్లో ఉన్న వారిని జిల్లాలకు మార్చే అవకాశం ఉందంటున్నారు.

# గోవిందుని ఆలయంలో 'మహాద్వారం' రగడ

### తరచూ ఉద్యోగులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం , నిబంధనల మేరకు గేట్ తెరవలేని సిబ్బంది





**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వేంకటేశ్వర స్వామిని ఎంతో భక్తితో విశ్వాసంతో సామాన్య భక్తులు నుండి ప్రముఖుల వరకు దర్శనం చేసుకుని ఆలయం వెలుపలకు ప్రశాంతమనస్సుతో రావడం పరిపాటి. మనస్సంతా గోవిందనామంతోనే పరితపిస్తుంటుంది. అలాంటిది కొందరు ప్రజాప్రతినిధులు మొక్కుబడిగా దేవదేవుడిని దర్శనం చేసుకున్నామా, తమ పలుకుబడి ఉపయోగించి ఆర్భాటంగా ఆలయ ఉద్యోగులపై పెత్తనం చలాయించామా? అనే రీతిలో వ్యవహరిస్తుండటం భక్తిభావాన్ని దెబ్బ తీసేలా మారింది. ఇలాంటి ఘటనలు వరుసగా తరచూ చోటుచేసుకొంటుండటంతో క్యూలైన్లో ఉన్న భక్తులేగాక ఎంతో భక్తిభావంతో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు కూడా ఒకింత ఆవేదన వ్యక్తం చేస్తుండటం ఇప్పుడు రచ్చచర్చగా మారింది. సాధారణంగా ప్రముఖులు తమతోబాటు వచ్చే విఐపిలను వెంకన్న దర్శనానికి వెంటబెట్టుకుని వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నుండి ఆలయంలోనికి వస్తుంటారు. ఉదయం వేళ విఐపి బ్రేక్ దర్శనంలో ప్రజాప్రతినిదులు,వారి సిఫార్సు లేఖలపై వచ్చేభక్తులు, రాజ్యాంగ పరిధిలోని ప్రముఖులు వస్తుంటారు. వీరంతా ఆలయంలో మహద్వారం నుండి ధ్వజస్తంభం దాటుకుని బంగారువాకిలిమీదుగా ఆనంద నిలయంలోనికి చేరుకుంటారు. మొదటిగడప కులశేఖరపడి వరకు వెళ్ళి మరీ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దగ్గరగా నిలబడి దర్శనం చేసుకుని ఆశీస్సులందుకుంటారు. వీరంతా తిరిగి ఆలయంలోపల నుండి వెలుపలకు రావడానికి మార్గం ఉంది. ఈ మార్గంలోనే వెలుపలకు రావాలి. అయితే కొందరు ప్రజాప్రతినిధులు తమ పలుకుబడి ఏంటో చూపాలనే తపనతో వెలుపల గడప నుండి మహద్వారం గేట్ మీదుగా బయటకు రావడానికి సుముఖత చూపుతుంటారు. అయితే తిరుమల ఆలయంలో మహద్వారం గేట్ అత్యంత భద్రతతో కూడుకున్నది. ఈ గేట్‌నుండి వెలుపలకు ఆలయంలోపల విధులు నిర్వహించే అర్చకులు,టిటిడి పాలకమండలి ఛైర్మన్, ఇఒ,అదనపు ఇఒ,జెఇఒ, సివిఎస్ఒ, ఆలయ ఏవిఎస్ఒ ,ప్రధాన అర్చకులు ,అర్చకులకు మాత్రమే వెసలుబాటు ఉంది. ఇంకా ఆలయంలోపల భక్తుల రద్దీ ఎక్కువైన సమయంలో భక్తులు సులభంగా వెలుపలకు రావడానికి మహద్వారం గేట్‌లను తెరచి పంపుతుంటారు. ఆ సమయంలో కూడా భక్తులు ఎవరూ ఈ గేట్‌లో లోపలకు వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత అక్కడి సిబ్బందిపై ఉంటుంది. అలాంటిది ఇటీవల కాలంలో తరచూ కొందరు ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు తమ ప్రాపకం కోసం మహద్వారం గేట్‌నుండి వెలుపలకు రావడానికి అక్కడి సిబ్బందితో గోడవకు దిగుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గేట్‌తెరవలేమని, వెలుపలకెళ్ళే మార్గం నుండి వెళ్ళాలని మర్యాదపూర్వకంగా సూచించినా అందుకు తిరస్కరించి దూషణల పర్వం, బెదిరింపు చేయడం జరుగుతోంది. బుధవారం ఉదయం అధికారపార్టీకి చెందిన వెంకటగిరి ఎమ్మెల్యే కె.రామకృష్ణ తన అనుచరులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయం నుండి వెలుపలకు వచ్చేందుకు మహద్వారం ముందు గేట్‌తీయాలని కోరాడు. అందుకు అక్కడి సిబ్బంది నిరాకరించడంతో ఆగ్రహం వెలిబుచ్చారు. ఇటీవలే జిడినెల్లూరు ఎమ్మెల్యే థామస్, గతంలో కర్నాటకకు చెందిన ఓ టిటిడి బోర్డు సభ్యుడు కూడా ఇదే రీతిలో టిటిడి ఉద్యోగులపై విరుచుకుపడ్డారు. తరచూ ఆలయం మహద్వారం ముందు గేట్ టిటిడి ఉద్యోగులకు అభద్రతను చేకూరుస్తోంది. టిటిడి ఉన్నతాధికారులు, విజిలెన్స్ ఉన్నతాధికారులు ఈ సున్నితమైన విషయంపై స్పష్టమైన ఆదేశాలిస్తే అటు ప్రజాప్రతినిధులు ఇటు ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవనేది టిటిడి వర్గాల వాదన.

# విమానం గాల్లో ఉండగానే మహిళ ప్రసవం

**ముంబయి,జూలై 25:** విమానం ఏకంగా 35 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. సరిగ్గా అప్పుడే ఓ గర్భిణికి పురిటినొప్పులు మొదలయ్యాయి. ఫ్లైట్ సిబ్బంది అవసరమైన చర్యలు చేపడుతుండగానే ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం మస్కట్ నుంచి ముంబై కి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. థాయ్‌లాండ్‌కు చెందిన ఓ 29ఏళ్ల మహిళ మస్కట్ నుంచి ముంబైకి బయదేరిన విమానం ఎక్కింది. విమానం ఏకంగా 35 వేల అడుగుల ఎత్తులో వెళ్తుండగా గర్భిణి అయిన ఆ థాయ్ మహిళకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దాంతో విమాన సిబ్బంది అప్రమత్తమయ్యారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న ఓ నర్సు సాయంతో ప్రసవం చేయించారు. తల్లీబిడ్డ గోప్యతను కాపాడేందుకు ప్రయాణికులను సీట్లు మారుస్తుండగానే ప్రసవం జరిగింది.



# ధన్‌ఖడ్‌కు ప్రతిపక్షాల వీడ్కోలు విందు..

### స్పందించని కేంద్రం!

**న్యూఢిల్లీ, జులై25:** ఉపరాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ రాజీనామా చేసి జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. ఆయనకు అధికారికంగా వీడ్కోలు పలుకుదామని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. దాంతో విపక్షాలే ఆయనకు వీడ్కోలు విందు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ కార్యక్రమానికి ఆయన్ను ఆహ్వానించినట్లు సమాచారం. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్లు ధన్‌ఖడ్ పేర్కొన్నప్పటికీ విపక్షాలు మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. కేంద్ర హోంశాఖ కూడా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం అటు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఆయనకు వీడ్కోలు పలకాలని ఇప్పటికే కాంగ్రెస్ కోరిందని, కానీ కేంద్రం మాత్రం మౌనం వహించిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ధన్‌ఖడ్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అయితే కేంద్రం దీనిపై స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జెపి నడ్డా కూడా ఈ విషయంపై ఏం మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్రం అనురిస్తోన్న ఈ తీరు కూడా విపక్షాల అనుమానాలకు మరింత ఆజ్యంపోస్తోంది. ఇక విపక్షాల ఆహ్వానాన్ని ధన్‌ఖడ్ అంగీకరించకపోవచ్చని తెలుస్తోంది.




శుక్రవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో బీహార్ ఓటర్ల సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఎంపీల నిరసనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

>> వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత నేలపాడులో మీడియాతో మాటాడుతూ గత ప్రభుత్వం అమరావతిపై కక్షతో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసింది.ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసింది.అమరావతి విషయంలో తీసుకున్న నిర్ణయాలతో వాటిని సరిదిద్దేందుకు ఏడాది పట్టింది...పాత టెండర్లు రద్దు చేయలేదు.కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేదు. న్యాయపరమైన సమస్యలు రాకుండా ఉండేందుకు కమిటీలు వేసి అన్నీ పరిష్కరించాల్సి వచ్చింది. ఆ తర్వాత గతంలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్టత విషయంలో ఐఐటీ చెన్నై,ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో కమిటీలు వేసాం. ఎట్టకేలకు అన్ని నివేదికల ఆధారంగా తిరిగి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించామన్నారు. .ప్రస్తుతం అమరావతిలో సుమారు పదివేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అవసరమైన యంత్రాలు కూడా ఇప్పటికే పనుల్లో ఉన్నాయి.నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కోసం మొత్తం 21 టవర్లలో 1995 ఫ్లాట్లు నిర్మిస్తున్నాం.వీటిలో 9 టవర్ల నిర్మాణం పూర్తయింది. మిగతా టవర్ల నిర్మాణం డిసెంబర్ నెలాఖరుకు పూర్తవుతుంది.ఇక గెజిటెడ్ ఆఫీసర్ల కోసం మొత్తం 14 టవర్లలో 1140 ఫ్లాట్లు నిర్మిస్తున్నాం.వీటిలో 11 టవర్ల నిర్మాణం పూర్తయింది. మరో 5 టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతుంది. భవనాల నిర్మాణాలతో పాటు రోడ్లు,తాగునీరు,డ్రైనేజి నిర్మాణాలు కూడా సమాంతరంగా జరుగుతున్నాయి..మొత్తం 4000 ఫ్లాట్ల నిర్మాణంతో ఒక టౌన్ షిప్ తయారుకానుంది..

కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా ఇక్కడ నివాసం ఉండే వారికోసం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఎస్ ఆర్ ఎం,విట్ యూనివర్సిటీలు అమరావతిలో మెడికల్ కాలేజీలు నెలకొల్పుతున్నాయి.ముందుగా ఈ రెండు యూనివర్సిటీలు 50 చొప్పున పడకలతో రెండు హాస్పిటల్స్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి తీసుకురానున్నాయి.ఈ రెండు యూనివర్సిటీలు రెండు సీబీఎస్ఈ స్కూల్స్ వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఏర్పాటుచేయనున్నాయి.

**రైతుల ప్లాట్లలో త్వరలో అభివృద్ధి పనులు:** రాజధానికి భూములిచ్చిన రైతులకు తిరిగిచ్చిన ప్లాట్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. వర్షాల వల్ల కొంచెం ఇబ్బంది ఉందని....ఆయా పనులకు ఇప్పటికే టెండర్లు కూడా పూర్తి చేసామని అన్నారు. 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు,1500 కిలోమీటర్ల మేర లేఅవుట్ రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి...కొండవీటి వాగు, పాలవాగు,గ్రావిటీ కెనాల్ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ అన్నారు. 2014-19 మధ్య సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం..ఆ దేశ ప్రధాని,ఇతర అధికారులతో చర్చించి కమిటీలు వేసి అమరావతి అభివృద్ధి కోసం ముందుకెళ్లాం...రాజధానిలో 1450 ఎకరాలు భూమిని స్విస్ ఛాలెంజ్ విధానంలో 42:58 నిష్పత్తిలో కేటాయించాం..దీనివల్ల అమరావతికి పెద్ద కంపెనీలు,బ్యాంకులు వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చేవి.అయితే గత వైసీపీ ప్రభుత్వం సింగపూర్ అధికారులపై కేసులు పెట్టారు. అక్కడికి వెళ్లి మరీ వారిని వేధించారు...దీంతో సింగపూర్ ప్రభుత్వానికి ఏపీ సర్కార్‌కు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సింగపూర్ పర్యటనలో ఏపీ ప్రభుత్వంపై ఉన్న ముద్ర పోగొట్టుకునేలా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయన్నారు.

# హాస్టళ్ల నిర్వహణకు సహకారమందించాలి

>> 4 కార్యక్రమం రూపొందించారన్నారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేరుతో ఎంతో సదుద్దేశంతో రూపొందించిన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి సహకారమందించాలని ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం విద్యార్థులకు మంత్రి సవిత పిలుపునిచ్చారు. 2016-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం కింద లబ్ధి పొందిన ఎందరో విద్యార్థులు నేడు అత్యున్నత స్థానాల్లో ఉండడం ఎంతో ఆనందకరమన్నారు. ఇలా ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా ఉన్నత స్థానాలల్లో ఉన్న వారు తమకు తోచిన రీతిలో వెనుకబడిన తరగతుల హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సాయమందించడానికి ముందుకు రావాలని కోరారు.

ప్రభుత్వపరంగా బీసీ హాస్టళ్ల మెరుగుకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి సవిత తెలిపారు. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోందన్నారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశామన్నారు. తల్లికి వందనం పథకం ఇంట్లో ఎందరు విద్యార్థులు ఉంటే అందరికీ రూ.13 వేల చొప్పున్న అందజేశామన్నారు. బీసీ హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఇన్వర్టర్లు, ఆర్వో ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలా బీసీ బిడ్డలకు నాణ్యమైన భోజనం పాటు భద్రతతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. అదే సమయంలో సామాజిక సేవపై ఆసక్తి కలిగే దాతల సాయంతో పేద విద్యార్థులకు స్వల్ప కాలంలో మెరుగైన సౌకర్యాలు అందించగలుగుతామన్నారు. పీ4 విధానంలో ప్రజల భాగస్వామ్యంతో హాస్టళ్ల నిర్వహణ మరింత సులభంగా మారుతుందని మంత్రి తెలిపారు.

**ఈ మెయిళ్లతో సంప్రదింపులు:** కార్పొరేట్ కు ధీటుగా బీసీ హాస్టళ్లలో విద్య అందించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం విద్యార్థులు తమకు తోచినరీతిలో బీసీ హాస్టళ్లకు అండగా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ మేరకు వారందరికీ ఈ మెయిళ్ల ద్వారా సంప్రదించినట్లు మంత్రి వెల్లడించారు. ఏదైనా హాస్టల్ ను దత్తత తీసుకోవొచ్చునన్నారు. ఒకరిద్దరు విద్యార్థులను దత్తత తీసుకుని, వారి ఉన్నత విద్యకు తోడ్పాటు అందించాలని సూచించారు. తమ స్థాయికి తగిన రీతిలో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మించడం, మరమ్మతులు చేయడం, తాగునీటి కల్పనకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడం వంటి పనులకు ఆర్థిక సాయమందించొచ్చునన్నారు. విద్యుత్ సదుపాయం కోసం సోలార్ విద్యుత్ ప్యానెళ్లు కూడా ఏర్పాటు చేయొచ్చునన్నారు. సామాజిక సేవ పట్ల ఆసక్తి కలిగి, పేద బీసీ విద్యార్థులకు అండగా నిలవాలనుకున్నవారు మెయిల్ కు గాని, 6300876401, 7989344521 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం విద్యార్థులకు మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# ఆల్కహాల్ దుర్వినియోగంపై ఉక్కుపాదం

>> ఎథనాల్ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా నేతృత్వంలో కఠిన చర్యలు ప్రారంభించింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిస్టిల్లరీల అధికారులతో ప్రత్యేక హైబ్రీడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ కమీషనరేట్ నుండి నేతృత్వం వహించారు. పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం ఉత్పత్తి అవుతున్న ఆల్కహాల్ పక్క దారి పట్టకుండా అన్ని డిస్టిల్లరీల వద్ద కఠిన నిఘా పర్యవేక్షణను అమలు చేయాలని జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. డిస్టిల్లరీల ప్రాంగణాల్లో పూర్తిస్థాయి భద్రత, నిఘా చర్యలు ఉండాలనీ, సీసీటీవీ కెమెరాలు నిరంతరంగా పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. ఎటువంటి "షాడో ఏరియాలు ఉండకూడదని,బయటకు వెళ్లే ఉద్యోగులను భద్రతా సిబ్బంది పూర్తిగా తనిఖీలు చేయాలనీ సూచించారు. ఈఎన్ఏ నాణ్యత నిర్ధారణ కోసం నియమిత నమూనా సేకరణ చేయాలనీ, పరిశ్రమల కోసం పంపే ఎథనాల్ డెనేచర్ ప్రక్రియను అధికారులు స్వయంగా పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. అలాగే ఆల్కహాల్ తీసుకునే పరిశ్రమల యూనిట్లను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయం, మౌలిక సదుపాయాల్లో మెరుగుదల, వ్యవస్థలో ఉన్న లోపాలను తొలగించే చర్యలను ప్రభుత్వ పరంగా చేపడతామన్నారు ఏపీ చర్యలకు దేశవ్యాప్తంగా స్పందన లభిస్తుంది. ఇటీవల జరిగిన పాలకొల్లు నకిలీ మద్యం కేసు నేపథ్యంలో ఈ చర్యలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇందులో 36 మంది అరెస్టు కాగా, 2,200 లీటర్లకు పైగా మళ్లించిన స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్లు, ప్యాకేజింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పరిశ్రమల వినియోగం పేరుతో పొందిన స్పిరిట్‌ను కల్తీ మద్యం తయారీకి దారి మళ్లించిన ఘటనలు బయటపడ్డాయి. ముఖ్యంగా తెలంగాణా లోని ఒక ఫార్మా సంస్థ కోవిడ్ సమయంలో పొందిన అనుమతులను దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ముంబయిలోని సరఫరాదారుల నుంచి ఖాళీ బాటిళ్లు, బ్రాండెడ్ లేబుల్స్, క్యాప్స్ లాంటి వస్తువులు తెచ్చుకోవడం ద్వారా ఈ నెట్‌వర్క్ అంతర్రాష్ట్ర స్థాయిలో విస్తరించి ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఇతర రాష్ట్రాలు సైతం ఏపీను ఆదర్శంగా తీసుకుంటూ సలహాల కోసం సంప్రదిస్తున్నాయి. పరిశ్రమల ఆల్కహాల్ వినియోగంపై సామర్థ్యవంతమైన నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ఏర్పాట్లు ఒక మోడల్‌గా నిలిచాయి. ఫలితంగా ముకేష్ కుమార్ మీనా నేతృత్వంలో పరిశ్రమల ఆల్కహాల్ నియంత్రణ పరంగా ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలవనుంది. పరిశ్రమల ఆల్కహాల్‌పై రాష్ట్రాలకు హక్కులున్నాయి సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది.జీఎస్టీ తర్వాత పరిశ్రమల ఆల్కహాల్‌పై నియంత్రణ, పన్ను విధింపు, శిక్ష విధించే హక్కులు తమకే ఉన్నాయని కేంద్రం భావించింది. అయితే 2024లో ఉత్తరప్రదేశ్ వర్సెస్ లలితా ప్రసాద్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో అందుకు భిన్నమైన స్పష్టత నిచ్చింది. తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పులో పరిశ్రమలు ఇతర అవసరాల వినియోగానికి అవసరమైన ఆల్కహాల్ సరఫరా, నియంత్రణపై రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉంటుందని స్పష్టం చేసింది.

# నేను సైతం దత్తత

>> పై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. ప్రతీ మార్గదర్శికి అధికారులు నమ్మకాన్ని కలి గించాలి. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బంగారు కుటుం బాలు, మార్గదర్శుల వివరాలు సరిగ్గా నమోదు చేసినప్పుడే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. పీ4 నిర్వాహకులు, బంగారు కుటుంబాలకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించాల్సి అని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు.

ఆగస్ట్ 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని మరోసారి అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా, 57,503 మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని మొత్తం లక్ష్యం నెరవేరాలంటే మరో 2 లక్షల మంది మార్గదర్శుల అవసరం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని..విశాఖపట్నం జిల్లా ఈ విషయంలో చివరిన ఉందని వెల్లడించారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆటోమేటెడ్ మెసేజ్ రూపంలో సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియా, ఇతర ప్లాట్ ఫామ్‌ల ద్వారా పీ4 కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తలపెట్టిన డిజిటల్ ప్రమోషన్ కార్యకలాపాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**మూడు విధానాల్లో జీరో పావర్టీ పీ4 అమలు :** మూడు విధానాల్లో జీరో పావర్టీ పీ4ను అమలు జరుగుతోంది. బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకోవడం, వారికి ఆర్థికేతర సాయాన్ని అందించటం మొదటి విధానం. దీనికి కాలపరిమితి అంటూ ఏమీ ఉండదు. రెండో విధానంలో "ఫండ్ ఏ నీడ్ష్, దీని కింద ఎవరికైతే ఆర్థిక అవసరాలు ఉంటాయో వారికి నగదు సాయం అందించేలా కార్యాచరణ రూపొందించారు. అయితే దీనికి కాలపరిమితి ఉంటుంది. మూడో విధానంలో గ్రామాలను, మండలాలను దత్తత తీసుకోవడం...ఒక ప్రాంతంలో, ఒక ఊరిలో కమ్యూనిటీ అవసరాలు తీర్చడం, అక్కడ వివిధ అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేలా తీర్చిదిద్దారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి ఈ మూడో విధానం అమలు చేయాలని నిర్ణయించారు. మరోవైపు...పీ4కి భాగస్వాములుగా వ్యవహరిస్తున్న కేపీఎంజీ, మిలాప్, తమ్మడ, భవ్య, భార్గో, ప్రాజెక్ట్ డీప్ సంస్థలు మరింత కీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఒక బంగారు కుటుంబానికి అవసరమైతే ఒకరికి మించి మార్గదర్శులు సాయం అందించేలా చూడాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వాయుగుండంగా అల్పపీడనం

>> కృష్ణా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. అదే విధంగా ఉత్తర కోస్తా పోర్టులకు మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక, దక్షిణ కోస్తా పోర్టులకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాబోయే 48 గంటల్లో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, కోస్తాంధ్రలో మోస్తరు వర్షాలు కురిసే ఆస్కారం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.అదే విధంగా తీరం వెంబడి 4555 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. శుక్రవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముందని అధికారులు వివరించారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. శనివారం ఉత్తరాంధ్రలో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వానలు పడతాయని వాతావరణ విభాగం అంచనా వేసింది. అల్పపీడనం ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, పల్నాడు, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయంకి వరద కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలంలో 1,11,651 క్యూసెక్కులు చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 1,40,773 క్యూసెక్కులు. రెండు స్పిల్‌వే గేట్ల ద్వారా 54,130 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31,328 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203.42 టీఎంసీలుగా కొనసాగుతోంది. వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డు: మరోవైపు వర్షానికి రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో సకాలంలో వైద్యం అందక అల్లూరి జిల్లాలో ఓ గిరిజనుడు మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ జె.కొత్తూరు గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై ఉన్న రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో గ్రామం నుంచి బయటకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

# ముందస్తు చర్యలు చేపట్టాలి

>> రు.సముద్రం అలజడిగా ఉంటుందని, తీరం వెంబడి గంటకు 4060 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తీరాల్లో అలలు 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తులో ఎగసిపడే అవకాశం ఉందని చెబుతున్నారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాద హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకుసూచించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయంతో గండ్లు గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాల న్నారు. ఏపీ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి మంత్రి స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ 112, 1070, 1800 425 0101 నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు.

# మాల్దీవులకు రూ.4850 కోట్ల సాయం

>> 'ఇండియా ఔట్' నినాదంతో రెండు దేశాల మధ్య సంబంధాలు ఒడిదొడుకులకు గురైన నేపథ్యంలో తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులు అధ్యక్షుడుగా మహ్మద్ ముయిజ్జు ఎన్నికైన మొదట్లో చైనా అనుకూల విధానాలు అవలంబిస్తూ.. 'ఇండియా ఔట్' నినాదాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మాల్దీవులకు భారత్ అందిస్తున్న సైనిక సాయాన్ని వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే విడతల వారీగా గత మే నాటికి మాల్దీవుల్లోని భారత్ సైన్యం వెనక్కి వచ్చేసింది. అంతేకాకుండా భారత్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రాజెక్టులను కూడా నిలిపివేయాలని మాల్దీవులు నిర్ణయించింది. ముయిజ్జు 'చైనా ఫస్ట్' విధానాన్ని అనుసరించారు. తర్వాత తన నిర్ణయాల ప్రభావం ముయిజ్జుకు త్వరగానే అర్థమైంది. దాంతో మనతో సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి మొగ్గు చూపారు. గత యేడాది మన దేశ పర్యటనకు వచ్చిన ఆయనమోడీని మాల్దీవులకు ఆహ్వానించారు. దీనికి ముందు బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించారు. రెండు దేశాల మధ్య గురువారం చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) లాంఛనప్రాయంగా కుదిరింది. ఈ ఎఫ్‌టిఎకు అధికారికంగా 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా)' నామకరణం చేశారు. దీనిపై మోడీ స్పందిస్తూ.. 'భారత్, బ్రిటన్ సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక రోజు. యేళ్ల తరబడి చేసిన శ్రమ ఫలితంగా ఇరు దేశాల మధ్య సెటా కుదిరింది' అని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు బ్రిటన్‌కు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదని స్పష్టం చేశారు.

# పునర్విభజనపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్,తెలంగాణలో నియోజక వర్గాల పునర్విభజనపై దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం నియోజక వర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని పిటీషనర్ కోరారు. జమ్మూరాశ్మీర్‌లో పునర్విభజన చేసే సమంయలో ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది.

2028లో మొదటి సనగణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. కేంద్ర పాలిక ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని సర్వోన్నతన్యాయస్థానం వ్యాఖ్యానించింది.జమ్మూకాశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటీషనర్ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. జమ్మూకాశ్మీర్ కోసం జారీ చేసిన నిజెజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం, ఏకపక్షం,వివిక్ష కాదని స్పష్టం చేస్తూ పురుషోత్తంరెడ్డి పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.




తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్న వారితో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

# మార్షల్ ఆర్ట్స్ పోటీలతో క్రీడా స్ఫూర్తి

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** మార్షల్ ఆర్ట్స్ పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతకు మార్గనిర్దేశం చేస్తాయని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నేటి నుండి 27 వరకు 3 రోజుల పాటు జరగనున్న 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్ 2025 పోటీలను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,తైక్వాండో వంటి పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతకు అనుకూల దిశలో మార్గనిర్దేశం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అన్ని విధాల మద్దతు ఇస్తుంది" అని తెలిపారు.కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# మద్యం కేసులో కెపిఎంజి ప్రతినిథులకు సిట్ నోటీసులు

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ ప్రతినిథులకు సిట్ అధికారులు గురువారం నోటీసులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం ఇండెండ్,ఎకౌంటింగ్,ఆడిటింగ్‌పై సలహాలు,సూచనల కోసం ఏపీఎస్‌బీసీవ్ కేపీఎంజీని కన్సల్టెన్సీగా నియమించుకుంది. వైసీపీ మద్యం ముఠా ఆదేశాల మేరకు,ముడుపులు చెల్లించిన సరఫరా కంపెనీలు, డిస్టరీలకే అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా నిబంధనలు మార్చేసిని ఏపీఎస్‌బీసీఎల్ అంతా చట్టప్రకారమే చేశామనే భావన కల్పించేందుకు కేపీఎంజీ నివేదికను అడ్డం పెట్టుకుంది. ఆ సంస్థ 2019 చివరోల పలు సిఫార్సులు చేయగా...వాటిల్లో దోపిడీకి అనుకూలంగా ఉన్న మద్యం డిస్టలరీలు,సరఫరాదారులకు పీడీ ఖాతా నుంచి గ్రీన్ ఛానల్‌లో చెల్లించాలన్న సిఫార్సును మాత్రమే ఏపీఎస్‌బీసీఎల అమలు చేసింది. మద్యం కుంభకోణానికి బీజం ఇక్కడే పడింది.2019 నవంబరు 4నకేపీఎంజీ సంస్థ ప్రతినిధి సందీప్ పైడి ఏపీఎస్‌బీసీఎల్‌కు నివేదిక అందచేయగా...2019 డిసెంబరు 8న మరో నివేదిక ఇచ్చినట్లు ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు పత్రాన్ని తెరపైకి తెచ్చారు. అందులోని సిఫార్సులు అంతకుముందు ఇచ్చిన నివేదిక లోని వాటికి భిన్నంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఆ రెండో నివేదిక అనుమానాస్పదంగా ఉందని సిట్ వెల్లడించింది. మరోవైపు కేపీఎంజీ నివేదిక లోని సిఫార్సులను పరిశీలించి సూచనలు చేసేందుకు నలుగురు అధికారులతో బేవరేజెస్ కార్పొరేషన్ కమిటీని నియమించింది. ఆ కమిటీ అనుమానాస్పదంగా ఉన్న రెండో నివేదికనే పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో అప్పట్లో అసలు ఏం జరిగింది అనేది తేల్చేందుకు సిట్ అధికారులు...కేపీఎంజీ ప్రతినిధి సందీప్ పైడితో పాటు మరికొందరికి నోటీసులిచ్చినట్లు సమాచారం.

# పార్లమెంట్ సమావేశాలకు సహకరిస్తాం

## స్పీకర్ అఖిలపక్ష సమావేశంలో విపక్ష ఎంపిలు

**న్యూఢిల్లీ,జూలై 25:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాకు ప్రత్యేక నిశిత సవరణ (సర్) చేపట్టడం, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించడం వంటి అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. ఆయా అంశాలపై చర్చకు విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పట్టుబడుతున్నాయి. వాయిదా తీర్మానాలపై చర్చించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో సభలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. వారి ఆందోళనలతో గత నాలుగు రోజులుగా సభా కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. ఉభయసభలు ప్రారంభమైన నిమిషాల్లోనే వాయిదా పడుతున్నాయి. దీంతో సభలో నిరసనలకు బ్రేక్ వేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా శుక్రవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు సహకరించాలని ప్రతిపక్ష నాయకులను స్పీకర్ కోరినట్లు తెలిసింది. దీంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని ప్రతిపక్ష ఎంపీలు చెప్పినట్లు సమాచారం. దీంతో సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలూ సజావుగా సాగనున్నాయని సమాచారం. జూలై 28 నుంచి ఆపరేషన్ సింధూర్‌పై పార్లమెంట్‌లో చర్చ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారతీయ సైనిక దళాలు పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్‌లో ఉన్న 9 ఉగ్రస్థావరాలను ఆ ఆపరేషన్ సమయంలో నేలమట్టం చేశారు. అయితే పార్లమెంట్‌లో ఆ అంశంపై చర్చించేందుకు కేంద్రం డేట్ ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. జూలై 28వ తేదీన దీనిపై చర్చ చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఇందు కోసం లోక్‌సభ, రాజ్యసభలో 16 గంటల పాటు చర్చించేందుకు సమయాన్ని కేటాయించింది.

# ఒబిసిల చరిత్రను చెరిపేసిన బిజెపి

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, జులై 25:** భారత ఉత్పాదక శక్తికి ఒబిసిలు ప్రతీకలని కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. అలాంటి వారికి అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన బాగిదారి న్యాయ మహా సమ్మేళనం కార్యక్రమంలో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి, ఆరెస్సెస్‌పై విమర్శలు గుప్పించారు. ఒబిసిల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని దుయ్యబట్టారు. '2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే ఒబిసిల ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేకపోయాయనని అనిపిస్తోంది. ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారు. ఒబిసిల చరిత్ర ఎక్కడుంది. బిజెపి, ఆరెస్సెస్ ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయి' అని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. 'ఒబిసిలు ఉత్పాదకశక్తికి ప్రతీకలు. కానీ వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ ఇండియాలో ఒబిసిలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది? కుల గణన కూడా ఎప్పుడో చేయాల్సింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మేం తప్పకుండా కులగణన పూర్తి చేస్తాం అని కాంగ్రెస్ ఎంపి తెలిపారు. ఈ సందర్భంగా భాషా వివాదంపైనా రాహుల్ స్పందించారు. 'అభివృద్ధిలో విద్యే ప్రాధాన్యం. ఇంగ్లిష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయి. బిజెపి నేతలు మాత్రం ఇంగ్లీష్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమే. దీనితో పాటు ఆంగ్ల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## వారం - వర్జ్యం

26-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
విదియ రా.10.46
ఆశ్లేష మ.3.57
వర్జ్యం : తె.4.12-5.50
దు.తె.5.47-7.27
శుభసమయం : సా.6.45-7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి నుండి ఆస్తి, వస్తులాభాలు పొందుతారు. అతిథుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా ఉండును. ఇంటా బయటా ప్రోత్సాహ కరంగా వుండును.

**మిథునం:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా వుండటం మంచిది.

**కర్కాటకం :** ప్రత్యర్థులు మిత్రులుగా మారి సాయం అందిస్తారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి సన్మానాలు పొందుతారు.

**సింహం:** ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**కన్య :** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుతుంది.

**తుల :** అనుకోని అవకాశాలు పొందుతారు. సంతానం నాకు అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. వస్తులాభం.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక, కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు. ప్రయాణాలు.

**కుంభం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది.

**మీనం :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. అకారణంగా వివాదాలు ఏర్పడవచ్చు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

3rd VJA .qxd:26-07Pg3exHMNWJQEK.qxd 01/01/01 10:12 AM Page 1



# రాష్ట్రంలోని 9,098 ఆలయాలు రూ.772 కోట్లతో పునర్నిర్మాణం: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**శ్రీకాకుళం, జూలై, 25 (ప్రభాతవార్త ప్రతినిధి) :** రాష్ట్రంలో ఆలయాల పునర్నిర్మాణం చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లాకు వచ్చిన ఆయన ముందుగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని, శ్రీకూర్మంలో ఉన్న శ్రీకూర్మనాథ స్వామి వారిని దర్శించి అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రంలోని 9,098 ఆలయాలకు రూ.772 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. 5,523 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు పది వేల రూపాయలు చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.66.27 కోట్లు ఖర్చు అవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.శ్రీకాకుళం జిల్లాతో పాటు నియోజక వర్గంలో ధూప దీప నైవేద్యాల కోసం కొత్తగా ఐదు ఇచ్చినట్లు చెప్పారు. పునర్నిర్మాణం కింద మూడు ఆలయాలు ఉన్నాయని, వీటికి 5 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు. ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో పునర్నిర్మాణానికి ఇప్పటికే కోటి 96 లక్షలు ఇచ్చి ప్రారంభినట్లు చెప్పారు. 20 కొత్త పనులకు రూ.12.75 కోట్లు మంజూరు చేయడమైనదని, ధూప దీప నైవేద్యాలకు 157 ఆలయాల్లో 10 వేలు చొప్పున ఇస్తామని తెలిపారు.

శ్రీకాకుళం నియోజకవర్గం లో వృద్ధాప్య ఫించన్లు 16వేల 151, వితంతు, వికలాంగ, చేనేత, మత్స్య కార, గీత కార్మికులు, అభయ హస్తం, ఒంటరి మహిళా, తదితరమైనవి కలిపి 33,703 పంపిణీ చేసినట్లు వివరించారు. శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో కొన్ని పునర్నిర్మాణ పనులు చేయాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి వచ్చినపుడు పుష్కరిణి ఖాళీ చేయించి భక్తులకు వెసులుబాటు కల్పించాలనే ఆదేశాల మేరకు పుష్కరిణిని ఖాళీ చేసినట్లు చెప్పారు.

శ్రీకూర్మం ఆలయం విషయమై ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరక్టర్‌తో పునర్నిర్మాణంపై మాట్లాడామని, వారం పది రోజుల్లో వచ్చి పరిశీలిస్తామని చెప్పినట్లు చెప్పారు. అరసవల్లి, శ్రీకూర్మనాధుని ఆలయాలను భావితరాలకు అందించేందుకు ఇప్పటికే తగు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం పండుగను రాష్ట్ర పండుగగా ఇప్పటికే నిర్వహించడమైనదని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం ఈ యేడాది ప్రారంభమైనదన్నారు.

రెండు ఆలయాల పునర్నిర్మాణం విషయమై జిల్లాలో ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులతో చర్చించి తగు చర్యలు చేపడతామన్నారు.

## తిరుపతి-షిర్డీ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, జూలై 25,ప్రభాతవార్త** యాత్రికుల సౌకర్యార్థం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి-షిర్డీ-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపారు. తిరుపతి నుంచి సాయినగర్ షిర్డీ వెళ్లే నెంబర్ 07637ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ఆగస్టు 3నుంచి సెప్టెంబరు 28వరకు ప్రతి ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10.45గంటలకు సాయినగర్ షిర్డీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయినగర్ షిర్డీ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07638ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4నుంచి సెప్టెంబరు 29వరకు ప్రతి సోమవారం సాయంత్రం 7.35గంటలకు సాయినగర్ షిర్డీ నుంచి బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి 1.30(బుధవారం తెల్లవారుజామున) తిరుపతి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో రేణిగుంట,గూడూరు,నెల్లూరు,ఒంగోలు,చీరాల, తెనాలి,గుంటూరు,సత్తెనపల్లి,పిడుగురాళ్ల,నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ,సికింద్రాబాద్, లింగంపల్లి,వికారాబాద్,జహీరాబాద్,బీదర్,భల్కి ,ఉద్గీర్,లాతూర్,పర్లీ,గంగాఖేర్,పర్భని,సేలు,జాల్నా,ఔరంగాబాద్,నాగర్‌సోల్,మన్మాడ్,కోపర్‌గావ్ స్టేషన్లలో నిలుస్తాయి.

## ప్రజల తలరాతలను మార్చే నాయకుడు చంద్రబాబు

### - తిరుపతి సుపరిపాలనలో మంత్రి నిమ్మల



**తిరుపతి,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల తలరాతలు మార్చే నాయకుడు ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అయితే ప్రాణాలు తీసే వ్యక్తి జగన్‌అని ఆయన విమర్శించారు. నాయకుడు అంటే అన్ని విధాలుగా ఆదుకుని ప్రజలకు కష్టమొచ్చినా రక్షించేలా ఉండాలిగానీ జగన్‌లో ఇబ్బందులు పెట్టి చంపే విధంగా ఉండకూడదని ఆయన ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో నేడు ఏ నియోజకవర్గం, ఏ పట్టణం, గ్రామానికి వెళ్ళి ఏ గడపతొక్కినా ప్రజలు పరిపాలన బాగుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గంలో శుక్రవారం ఉదయం ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మతో కలసి మంత్రి రామానాయుడు చింతలచేను వద్ద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలతో మమేకమై వారినుండి సమస్యలు తెలుసుకున్నారు. ఈ రాష్ట్రప్రభుత్వం నుండి ఏమి ఆశిస్తున్నారు, ఎంతవరకు లబ్ధిపొందారు, మంచి జరిగిందని సమాధానాలు రాబట్టారు. ప్రజలందరూ అనేక పథకాలతో లబ్ధిపొంది ఆనందంగా ఉన్నామని తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసిపిపాలన అంతా కక్షలు,కేసులు ,వేధింపులతో జరిగిపోయిందన్నారు. మాకు ఆనందం కలిగితే నవ్వుకోలేని పరిస్థితి, కష్టం వస్తే కన్నీళ్ళు పెట్టుకోవడానికి కూడా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అటువంటి పాలననుండి విముక్తి కలిగిందన్నారు. అనేక పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వెళ్ళిపోయాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఫెన్షన్లు, ఇళ్ళపట్టాలు, ఉపాధి అవకాశాలు, మహిళలకు ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చుతున్నామన్నారు.

ఏడాదిలో సుపరిపాలన ప్రభుత్వం చేసిన మంచిపనులను ఆయన ఇంటింటికి ప్రజలకు వివరించారు. ప్రజలందరూ కూడా సంవత్సరం పాలనపై ఆశీర్వాదాలందిస్తున్నారన్నారు. తిరుపతికి కూడా పరిశ్రమలు వస్తున్నాయన్నారు.నరసింహయాదవ్, పుష్పావతియాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, ఆర్‌సి మునికృష్ణ, విజయకుమార్, వట్టికుంట చిన్నబాబు, కంకణాల రజినీకాంత్‌నాయుడు, మన్నెం శ్రీనివాసులు, బుల్లెట్‌రమణ, దంపూరి భాస్కర్‌యాదవ్, సదాశివం, ఊకా విజయకుమార్ బివి కీర్తి ,పాఠకం వెంకటేశ్, హేమంత్‌రాయల్, పాల్గొన్నారు.

# టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు గదులు ఇవ్వరు!

### - రూ.300 ఆన్‌లైన్ టిక్కెట్‌ల వారికీ ఇదే సమస్య

**తిరుమల,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు ...ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు పలు రకాల దర్శన టిక్కెట్లు,టోకెన్లుతో వస్తున్న భక్తులకు పూర్తిగా గదులు ఇవ్వడం నిలుపుదలచేశారు. ఆయా భక్తులు సమయానికి కొండకు చేరుకుని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో వెళ్ళి దేవదేవుడ్ని దర్శనం చేసుకోవాలని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ సముదాయాల్లో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఉచిత సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన భక్తులు ముందుగానే తిరుమలకు చేరుకుని సిఫార్సులేఖలపై గదులు పొందేవారు. ఇలా వస్తున్న వారి సంఖ్య పెరగడంతో గదుల కొరత తీవ్రంగా ఉంది. అంతేగాక ఈ టైమ్‌స్లాట్ భక్తులు టోకెన్‌పై నిర్దేశించిన రోజు ఆ సమయానికి మాత్రమే కొండకు చేరుకోవాలి. టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు తిరుమలలో సిఫార్సులేఖలపై గదులు కేటాయింపు పూర్తిగా రద్దుచేశారు. ఇక ఆన్‌లైన్‌లో 300 రూపాయలు టిక్కెట్లు (మూడునెలల ముందుగానే)బుక్‌చేసుకుని తిరుమలకు చేరుకునే భక్తులకు కూడా ప్రత్యేకంగా గదులు కేటాయించరు. ఈ విధానాన్ని టిటిడి పూర్తిగా రద్దుచేసింది. సుదూర ప్రాంతాల భక్తులకు మాత్రమే సిఫార్సులపై గదులు ఇచ్చేందుకు వసతికల్పన విభాగం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. ఆఫ్‌లైన్‌లో రోజువారీగా 20వేల వరకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీఅవుతున్నాయి. ఆన్‌లైన్‌లో 300 రూపాయలు టిక్కెట్లు 25వేల వరకు విడుదల చేసినా ఈ ఆన్‌లైన్ భక్తులు అధికంగా తమిళనాడు, కర్నాటక,తెలుగురాష్ట్రాల నుండి ఆయారోజుల్లో తిరుమలకు చేరుకుని నేరుగా ఇష్టదైవమ్ దర్శనం చేసుకుని తిరుగుప్రయాణమవుతూన్నారు. వీలైనంత వరకు దర్శన టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులు తిరుపతిలోనూ వసతి పొంది దర్శన సమయానికి రెండు గంటల ముందు తిరుమలకు చేరుకోవాలని టిటిడి సూచన. తిరుమలలో ప్రస్తుతం 7.200వరకు గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 2వేల వరకు గదులు ఆన్‌లైన్‌లోనే కేటాయిస్తారు. మిగిలిన గదుల్లో సామాన్యభక్తులకు 1,500వరకు గదులు కేటాయింపు జరుగుతుంది. ఇక పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో అతిదిగృహాలు. విశ్రాంతి గృహాలను రాజ్యాంగపరిధిలోని న్యాయమూర్తులు, మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు, బ్యూరోక్రాట్స్ అధికారులు ఇలా సిఫార్సులేఖలపై గదులు కేటాయింపు జరుగుతుంది. ఎంబిసి ప్రాంతంలో టిటిడి ఉద్యోగులు,వారి సిఫార్సులేఖలు, బోర్డు సభ్యుల సిఫార్సులేఖలకు గదులు కేటాయింపు జరుగుతుంది. ఇప్పటికే తిరుమలలో ఉన్న గదులు కేటాయింపులో సిఫార్సులేఖల తలనొప్పులు టిటిడి అధికారులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఎస్‌ఎస్‌డి టైమ్‌స్లాట్ భక్తులకు పూర్తిగా గదులు కేటాయించడానికి లేదు. 10,500 రూపాయలు దర్శన టిక్కెట్ కొనుగోలుచేస్తున్న శ్రీవాణి భక్తులకు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో 100రూపాయలు, వెయ్యిరూపాయలు అద్దె గదులను కేటాయిస్తున్నారు.

## స్కూలు నుండి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిన నలుగురు విద్యార్థులు

### - తిరుమలలో పిల్లల ఆచూకీ కనుగొన్న పోలీసులు



**అనంతపురం, జూలై 25, (ప్రభాతవార్త బ్యూరో)** స్థానిక ఒకటవ రోడ్ లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివే నలుగురు విద్యార్థులు పారిపోయి మళ్లీ తిరుమలలో పోలీసులు దొరకడంతో సస్పెన్స్ వీడింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. బాగా చదువుకోవాలని టీచర్లు చెప్పడంతో పారిపోయి తిరుమలలో ఉన్న నలుగురు విద్యార్థులను శుక్రవారం అనంతపురం మూడవ పట్టణ పోలీసులు పట్టుకొని అనంతపురం తీసుకొస్తున్నారు.. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వాని పట్టుకోవడంతో అందరిలో ఆందోళన విడింది..కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన నలుగురు విద్యార్థులు స్థానిక ఒకటో రోడ్డులోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతూ మూడవ రోడ్డులోని బి.సి హాస్టల్ లో ఉంటున్నారు.బాగా చదువుకోవాలని లేదంటే చర్యలు తీసుకుంటామని స్కూలు టీచర్లు సూచించడంతో నలుగురు ఏకమై గురువారం సాయంత్రం చెప్పాపెట్టకుండా స్కూలు నుండీ వెళ్లిపోయారు.

ఆ నలుగురు పిల్లల మిస్సింగ్ పై అనంతపురం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో మూడవ పట్టణ సి.ఐ శాంతిలాల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రంగంలోకి రెండు ప్రత్యేక బృందాలను పంపి బెంగుళూరు, తిరుపతి నగరాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. టెక్నాలజీ సహాయంతో తిరుమలలో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సహాకారంతో సదరు నలుగురు విద్యార్థులను మూడవ పట్టణ పోలీసులు సురక్షితంగా హ్యాండోవర్ చేసుకుని అనంతపురం తీసుకొస్తున్నారు.

## ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి హైకోర్టులో చుక్కెదురు

### ఓఎంసి కేసులో రివిజన్ పిటిషన్ డిస్మిస్

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం రేపిన ఓబుళాపురం మైనింగ్ కేసులో ఎపికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఓబుళాపురం గనుల కేసులో నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని ఆమె దాఖ లు చేసిన రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం నాడు డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఆమె పేరును నిందితుల జాబితాలో వుండాల్సిందేనని సిబి ఐ దాఖలు చేసిన పిటిషన్‌తో హైకోర్టు ఏకీభవించింది. దీంతో ఓబుళాపురం మైనింగ్ కేసులో ఆమె కోర్టు విచారణను చవిచూడాల్సి వుంటుందని ప బ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాడియా మీడియాకు తెలిపారు. ఉమ్మడి ఎపి హయాంలో ఓఎంసి కేసుగా పేరొందిన ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాలకు సంబంధించి అప్పట్లో గనుల శాఖ కార్యదర్శిగా వు న్న సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మిపై సిబిఐ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో ఓఎంసి ఎండిగా వున్న గాలి జనార్ధన్ రెడ్డితో పా టు ఆయన సోదరుడు శ్రీనివాస్ రెడ్డి నాటి గనుల శాఖ డైరక్టర్ రాజగోపాల్ సహా మరికొందరిని దోషులుగా సిబిఐ కోర్టు రెండు నెలల క్రితం తీర్పు చెప్పడం విదితమే. ఈ కేసుకు సంబంధించి 2011లో గాలి జనార్ధన్ రెడ్డి సహా నిందితులందరు రెండేళ్లకు పైగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వుండగా వీరితో పాటు శ్రీలక్ష్మి కూడా ఏడాది పాటు జైలు జీవితం గడిపారు. ఈ కేసులో ఆమె బెయిలుపై వున్నారు. అయితే ఓఎంసి కేసులో శ్రీ లక్ష్మిని నిందితుల జాబితా నుంచి తొలగిస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేయగా దీనిని సిబిఐ తప్పుపట్టింది. ఇదే సమయంలో శ్రీలక్ష్మి కూడా తన పే రును ఓఎంసి నిందితుల జాబితా నుంచి తొలగించాలని హైకోర్టును కోరారు. ఆమె పేరును తొలగించేందుకు వీల్లేదని హైకోర్టులో సిబిఐ ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేసింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై శుక్రవారం ఉదయం హైకోర్టులో విచారణ జరిగింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన రి విజన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో సిబిఐ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ కేసులో శ్రీలక్ష్మి అక్రమాలకు పాల్పడ్డార నడానికి పక్కా ఆధారాలు వున్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఇదే కేసులో నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డితో పాటు ఐఎఎస్ అ ధికారి కృపానందంలకు ఊరట కలిగించినట్లు తనకు మినహాయింపు ఇవ్వాలని శ్రీలక్ష్మి కోరడం సరికాదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు లో సిబిఐ తరపున ప బ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాడియా తన వాదనలు వినిపించారు.



## మిసైల్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలులోని టెస్టింగ్ రేంజ్‌లో డీఆర్‌డీఓ డ్రోన్ ద్వారా మిసైల్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మన దేశ రక్షణ పర్యావరణ వ్యవస్థ వృద్ధికి దోహదపడటం ఆంధ్రప్రదేశ్ కు గర్వంగా ఉందని చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌ఓఏఆర్)లో విఏవిలాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి (యుఎల్‌పిజీఎమ్- వి3 ) పరీక్ష విజయవంతం చేసిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు అభినందనలు తెలిపారు. మన దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని చంద్రబాబు అభివర్ణించారు. గెలిశిబిలీజు3 విజయం ఆత్మనిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చంద్రబాబు అన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ట్వీట్ కు ప్రతిస్పందనగా చంద్రబాబు ఈ సందేశమిచ్చారు. భారత రక్షణ రంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ) మరో విజయాన్ని అందుకుంది. డ్రోన్ ద్వారా ప్రిసిషన్ గైడెడ్ మిసైల్‌వీ3ని (యూఎల్‌పీజీఎమ్) విజయవంతంగా ప్రయోగించింది. కర్నూల్‌లోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ ప్రయోగంలో డీఆర్‌డీఓతో పాటు రక్షణ రంగానికి చెందిన పలు సంస్థలు పాల్గొన్నాయి.

## రాష్ట్ర పర్యాటకానికి ప్రతిష్టాత్మక ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డు

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పర్యాటకాన్ని ప్రతిష్టాత్మక ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డు వరించిందని ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట తెలిపారు. ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వినూత్న విధానాలు, కొత్త పాలసీలు, విప్లవాత్మక సంస్కరణలు ఈ అవార్డును సాధించి పెట్టాయని వివరించారు. ఈ అవార్డు రావడం రాష్ట్ర పర్యాటక రంగ ప్రతిష్టను మరింత పెంచిందన్నారు. 10వ ఇంటర్నేషనల్ టూరిజం కాన్ క్లేవ్ అండ్ ట్రావెల్ అవార్డ్ (ఐటీసీటీఏ) ఈ పురస్కారాన్ని ప్రకటించిందని, జులై 26న న్యూఢిల్లీలోని లె మెరిడియన్ లో సాయంత్రం 7 గంటలకు ఈ అవార్డు అందించనున్నట్లు ఐసీఎం గ్రూప్ ఎండీ, ఛైర్మన్ అజయ్ గుప్తా మరియు ఐటీసీటీఏ జ్యూరీ సభ్యులు తెలిపారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి కాట ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటక పరిశ్రమ అభివృద్ధికి చేస్తున్న కృషికి నిదర్శనంగా అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆమ్రపాలి అన్నారు. ఢిల్లీలో అవార్డు అందుకోవడానికి తాను వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిని మరింత అభివృద్ధి చేసి పర్యాటకాంధ్రప్రదేశ్ కు బాటలు వేస్తామన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేసి అభివృద్ధిలో భాగస్వాములైన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడుకు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీకి, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ కు, పర్యాటక శాఖ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు చెబుతూ వారి కృషిని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాటకు ఐటీసీటీఏ సంస్థ శుభాకాంక్షలు తెలిపింది.

# తిరుమల సమాచారం

## శ్రావణమాసం అష్టలక్ష్మీవైభోగవ్రతం



**తిరుపతి,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** సిరులొసంగే మహాలక్ష్మిదేవిని వేడుకుంటూ శ్రావణ మాసం తొలి శుక్రవారం టిటిడి, హిందూ ధర్మ ప్రచారపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో అష్టలక్ష్మీవైభోగవ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఈ వ్రతంలో 600మంది మహిళలు పాల్గొన్నారు. సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో జరిపించిన వైభోగవ్రతంలో విశ్వహిందూపరిషత్ రాష్ట్రఉపాధ్యక్షురాలు మురళమ్మ, వసుంధర, ప్రసన్నలక్ష్మి, గీతాంజలి,చంద్రమౌళి ,రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పా పద్మనాభం,వాసు,మురళి పాల్గొని ఎంతో వేడుకగా వేదమంత్రాల నడుమ ఈ వ్రతం నిర్వహింపజేశారు. మహిళలకు పసుపుదారాలు, గాజులు,పూలు,కుంకుమ ప్రసాదం వితరణ చేశారు.

## 28న టిటిడి సద్గమయ

**తిరుమల,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం,హిందూ ధర్మప్రచారపరిషత్ సంయుక్తంగా 28వతేదీ సోమవారం టిటిడి పాఠశాలల్లో సద్గమయ కార్యక్రమం చేపడుతున్నారు. టిటిడి పాఠశాలల్లోని విద్యార్థులకు మానవీయ,నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. తిరుపతిలోని ఎస్‌జిఎస్ ఉన్నతపాఠశాల,ఎస్వీ ఉన్నతపాఠశాల, కోదండరామస్వామి ఉన్నతపాఠశాల, ఎస్వీ ఓరియంటల్ ఉన్నతపాఠశాల, పద్మావతి బాలికల ఉన్నతపాఠశాల, ఎస్‌కెఎస్ ఉన్నతపాఠశాల, తిరుమలలోని ఎస్వీ ఉన్నతపాఠశాలలో 8,9,10తరగతుల విద్యార్థులకు ఎంపికచేయబడిన శిక్షకులచే శిక్షణ ఇవ్వనున్నారు. రోజుకు గంటసమయం నాలుగురోజులపాటు సద్గమయ శిక్షణ ఉంటుంది.

## టిటిడి ట్రస్ట్‌లకు ఇద్దరు దాతలు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,జూలై 25ప్రభాత వార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులు ఆకలిఅనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన ఎల్‌వి లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ పిసి రాయల్ గురువారం 10లక్షలు చెక్కును. అలాగే బెంగుళూరుకు చెందిన సుకుమార్ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు చెక్కులను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. పిసిరాయల్ తన పుట్టినరోజు సందర్భంగా ఈ విరాళాన్ని అందించారు.

## వెంకన్న దర్శనంతో మనసు సంతోషం: ప్రముఖులు



**తిరుమల,జూలై 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, స్వామివారిని దర్శించుకోవడంతో మనసు సంతోషంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో డిఆర్‌డిఓ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, మహారాష్ట్రమంత్రి పంకజ్‌ముండే,సినీనటుడు సత్యంరాజేశ్ ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన వీరంతా ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలు బహుకరించారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పదవులకోసం కాదు ప్రజలకోసం పోరాడే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

### - ఎమ్మెల్యే పై ప్రశంసల వర్షం కురిపించిన మంత్రి

**నెల్లూరు రూరల్, జూలై 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మొట్టమొదటిగా పూర్తిచేసిన నియోజక వర్గం నెల్లూరు రూరల్ నియోజకవర్గం నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువ నాయకుడు నారా లోకేష్‌కి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అంటే చాలా ఇష్టం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, ఐపిఆర్ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్, వడ్డి పాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, 85 లక్షల రూపాయల వ్యయం తో పలు అభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, ఐ పి.ఆర్. శాఖా మంత్రి కొలుసు పార్థసారధి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్‌లు శంకుస్థాపన చేసారు.


VIJAYAWADA MUNICIPAL CORPORATION

'E' Procurement Notice No.17/VMC/CDB/2025-26, Dt.25-07-2025

Roads, Drain, Culvert, Water supply, Lights, repairs (Total 137 works)-Est. Amount Rs.2811.82 Lakhs

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without aasigning any reasons there of

Further details and any corrigendum can be seen@ www.tender. apeprocurement.gov.in.

S/d-

For COMMISSIONER

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY

Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE

NIT No. 65/MAU61-ADMN0IS(INIS)/3/2025-IS, Dated: 24-07-2025

Name of Work: "Supply of Backup Internet Leased Lines (ILL's) for APCRDA Project Office (01 no's) & associated PEB Structure Offices (04 no's) @ Amaravati for the period of 3 years". The bid can be downloaded on AP e-procurement portal from 26.07.2025 to 04.08.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 04.08.2025 up to 15.00 Hrs, Technical bid opening 04.08.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in .

Sd/-Commissioner, APCRDA, Vijayawada

టాటా మెమోరియల్ సెంటర్

అడ్వాన్స్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రీసెర్చ్ మరియు ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్ (ACTREC)

సెక్టార్-22, ఖర్గేహర్, నవ ముంబై 410210

భారత ప్రభుత్వ, అణుశక్తి విభాగం యొక్క గ్రాంట్-ఇన్-ఎయిడ్ సంస్థ

స్థానాలు అందుబాటులో

ప్రకటన నం: ACTREC/ADVT/A-11/A-12/2025 22/07/2025

అధీకృత అథారిటీచే అనుమతింపబడిన ఈ క్రింది ఉద్యోగాలకు ACTREC దరఖాస్తులు కోరుతోంది.

| క్ర.సం. | ఉద్యోగం యొక్క పేరు |
|---|---|
| 1 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (ప్యాథోలజీ) (1-UR) |
| 2 | కన్సల్టెంట్ 'D' (ప్యాథోలజీ) (2-UR) |
| 3 | సైంటిఫిక్ ఆఫీసర్ 'E' (ట్రాన్స్‌ప్లాంట్ ఇమ్యూనోలజీ మరియు ఇమ్యూనొజెనిటిక్స్ ల్యాబొరేటరీ (1-UR) |
| 4 | సైంటిఫిక్ ఆఫీసర్ 'C' (సెంటర్ ఫర్ క్యాన్సర్ ఎపిడిమియోలజీ) (1-OBC) |
| 5 | సైంటిఫిక్ ఆఫీసర్ 'C' (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నెట్‌వర్కింగ్) (1-OBC) |
| 6 | సైంటిఫిక్ అసిస్టెంట్ 'B' (న్యూక్లియర్ మెడిసిన్) (1-UR, 1-SC, 1-OBC) |
| 7 | సైంటిఫిక్ అసిస్టెంట్ 'B' (క్యాన్సర్ సైటోజెనిటిక్ ల్యాబ్) (1-OBC) |
| 8 | సైంటిఫిక్ అసిస్టెంట్ 'B' (యానిమల్ సైన్సెస్) (1-UR) |
| 9 | కో-ఆర్డినేటర్ 'B' (మెడికల్ పర్చేస్/స్టోర్స్) (1-OBC) |
| 10 | కో-ఆర్డినేటర్ 'B' (మెడికల్ అడ్మినిస్ట్రేషన్) (1-SC) |
| 11 | టెక్నీషియన్ 'A' (CRI ల్యాబ్స్) (4-UR) |

దరఖాస్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 22/07/2025 నుండి 22/08/2025కు అందుబాటు చేయబడింది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 22/08/2025 సా.05.30 గం. వరకు (ఇండియన్ స్టాండర్డ్ టైమ్)
మరిన్ని ఎక్కువ వివరాలకు మా వెబ్‌సైట్ https://actrec.gov.in దయచేసి వీక్షించండి.
ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు చేయటం తప్పనిసరి.
ఏవైనా చేర్పు లేదా సవరణ ఈ ప్రకటనకు సంబంధించినవి ఏవైనా పై వెబ్‌సైట్‌పై అప్‌లోడెడ్ చేయబడును.

CBC 48160/12/0001/2526 చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ACTREC

వార్త

ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటి వాడు,
అలల వంటి సమస్యలకు వెనుతిరిగి పోడు.

-టి. ఎడిసన్


# ఉభయ తారక ఒప్పందం

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలన్న భారత్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్యంలో ఆటంకాలన్నిటినీసర్దుకుంటూ, సరిచేసుకుంటూ సౌహార్ద్ర సంబంధాలతో భారత్ ముందడుగు వేస్తోంది. తాజాగా ప్రధాని నరేంద్రమోడీ భారత్ యునైటెడ్ కింగ్‌డమ్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని సుగమం చేసే దిశగా స్వయంగా రంగంలోకి దిగారు. దాంతో సుంకాల రహిత స్వేచ్ఛా వాణిజ్యానికి ఆ దేశంలో అంకురార్పణ చేశారు. ఇన్నాళ్లు ఇచ్చిపుచ్చుకునే ధోరణికి కొన్ని దేశాలు విభిన్నపోకడలను అనుసరించాయి. భారత ప్రధాని సౌహార్ద్రతకు ఎక్కువ ప్రాముఖ్యమిస్తూ భారత్ బ్రిటన్‌ల మధ్య చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకంగా చెప్పుకోదగినది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేసుకోవాలన్నది వారి సంకల్పం. ఐరోపా యూనియన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత బ్రిటన్ భారత్‌తో కుదుర్చుకున్న ఏకైక అతిపెద్ద అత్యంత కీలక వాణిజ్య ఒప్పందంగా బ్రిటన్ ప్రధాని స్టార్మర్ పేర్కొనగా, అభివృద్ధి వాద యుగంలో తొలివికాస వాణిజ్య ఒప్పందంగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ ఎఫ్‌టిఎను 'సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం'గా ఉభయ దేశాల ప్రధానులు పేర్కొనడం విశేషం. భారత్ ఎగుమతులకు సుంకం తగ్గడం ఒక ఎత్తయితే భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు బ్రిటన్ స్వాగతించడం ఒక ఎత్తు. ఇలా 'ఫ్రీ ట్రేడ్ డీల్' కారణంగా ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు ఏర్పడడం విశేషం. భారతీయ రైతులకు ఎంఎస్‌ఎంఈలకు ప్రయోజనం చేకూరుతుంది. వాణిజ్య బంధాలు బలోపేతమౌతాయి. ఈ ద్వైపాక్షిక ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ ధృవీకరించాక వాణిజ్యం మొదలవుతుంది. అయితే దాదాపు ఆ ప్రక్రియకు ఏడాది కాలం పట్టుందని అంచానా. ఇది ప్రారంభమైన తర్వాత నాలుగైదేళ్లలో12వేల కోట్ల డాలర్ల వాణిజ్యానికి ప్రణాళికలు రూపకల్పన చేసుకుంటారు. బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ అధికారంలో ఉండగా భారత్ బ్రిటన్‌లు ఒకరి వికాసం కోసం మరొకరు చేతులు కలపాలనే ప్రతిపాదనలకు అంకురార్పణ జరిగింది. ప్రస్తుతం లేబర్ పార్టీ అధికారంలో ఉంది. బ్రిటన్ కొద్దికాలంగా ఆర్థికంగా బలహీనమవుతూ వస్తోంది. ఎవరు అధికారంలో ఉన్నా ఆర్థిక పరిస్థితులేమీ మెరుగుపడలేదు. ఈ నేపథ్యంలో 'ఎఫ్‌టిఎ' ఒప్పందాన్ని పెద్దగా ఎవరూ అభ్యంతరపెట్టలేదు. ఎన్నికల హామీలో కూడా చేర్చాయి. భారత్‌కు అండదండలు పుష్కలంగా అందించేందుకు బ్రిటన్ అక్కున చేర్చుకుంటామని భారత్‌లు ఒకరిపై ఒకరు విశ్వాసం కల్పించుకున్న తర్వాతనే 'ఒప్పందం'పై ఇరు వర్గాలు అడుగు ముందుకేశాయి. ఉభయదేశాల మధ్యజరిగే వాణిజ్య ఒప్పందంలో ఫార్మా వంటి రంగాల భవిష్యత్‌పై కొన్ని సందేహాలున్నాయి. వాటి విషయం ఎఫ్‌టిఎ ఆచరణలోకి వచ్చినప్పుడుమాత్రమే ఆయా అంశాల్లో మిగిలి ఉన్న 'కొర్రీ'లపై పరిష్కారం జరగగలదని తెలుస్తోంది. భారత్ నుంచి బ్రిటన్‌కు వెళ్లే 99 శాతం ఎగుమతులపై సుంకాలు బాగా తగ్గిపోతాయి. బ్రిటన్‌నుంచి మనకు వచ్చే దిగుమతులు కూడా 15శాతంనుంచిమూడు శాతానికి తగ్గిపోతాయి. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు వలన భారత్ రైతాంగం సంతోషపడే రోజులు కనుచూపు మేరలోనే ఉన్నాయి. ఇవన్నీ అమల్లోకి వస్తే ఉభయదేశాల్లోనూ ఉపాధిఅవకాశాలు పెరుగుతాయి. ఇరుదేశాలపరస్పర ప్రయోజనాలు చేకూరే ఈ ఒప్పందాన్ని ఉభయ దేశాల ప్రధానుల సమక్షంలో భావోద్వేగాలమధ్య వాణిజ్యమంత్రులు అధికారులు 'ఎఫ్‌టిఎ'పై సంతకాలు చేశారు. యూకె నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే 90శాతం ఉత్పత్తులపై దశలవారీగాసుంకాల తగ్గింపునకు ఆమోదించారు. ఒప్పందం అమలులోకి రాగానే 64శాతం సుంకాల కోత ఉంటుంది. ఐ.టి ఆర్థిక, వృత్తిపరమైన ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్, విద్యాసేవల సంబంధితమై సుంకాలు తగ్గుతాయి. తాత్కాలిక ప్రాతిపదికపై యూకెకు వెళ్లే భారతీయ కార్మికులకు, వారి యాజమాన్యానికి, సామాజిక భద్రత సహకారాలకు మూడేళ్ల కాలం మినహాయింపు ఉంటుంది. ఆటోమేటిక్ రంగంలో సుంకాలను టారిఫ్ రేటు కోటా వ్యవస్థ కింద 100 శాతంనుంచి పది శాతానికి తగ్గుతాయి. కానీ విదేశీ దిగుమతులు మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని నష్ట పరుస్తాయనే విమర్శల మధ్య ఊగిసలాడుతోంది. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపులో భాగంగానే భారత్, యూకెల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం కూడా సానుకూలపడే పరిస్థితి ఉంది. ఇకపై భారతీయులకువిదేశీ మద్యం చౌకధరకు దొరికే వీలుంది. రానున్న మూడేళ్లలో బ్రిటన్‌కు భారతీయ వ్యవసాయ ఎగుమతుల్లో 20 శాతం వృద్ధి చూస్తాం. భారతీయ వస్త్రాలు, పాదరక్షలు, వజ్రవైడూర్యాలు, ఆభరణాలు సముద్ర ఆహార ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులకు యూకెలో ఎలాంటి సుంకాలు లేకుండా విక్రయించుకోవచ్చు. భారత్, బ్రిటన్ భాగస్వామ్యంలో"విజన్ 2035'లక్ష్యంగా సాగుతున్నందున వీలైనంతమేరకుప్రయోజనాలు పరస్పరం అనుభవించే వీలుంది. భారతవిమానయాన సంస్థలలో రూ.58వేల కోట్లఒప్పందం చేసుకున్నారు. బ్రిటన్‌కు చెందిన 26 సంస్థలు ఒప్పందాలలో భాగస్వాములయ్యాయి. ఈఒప్పందంతో భారత్‌కు విమానాలు ఇంజన్లు దక్కుతాయి. అనేక బ్రిటన్ సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. ప్రపంచ దేశాల మధ్య శాంతిని నెలకొల్పే విషయంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయన్న ఆశాభావం ప్రధానిమోడీనుంచి వ్యక్తమయింది. పహల్గాం ఉగ్రవాదం విషయంలో బ్రిటన్ వైఖరి భారత్‌ను సంతోషపరిచింది. అనంతరంనాలుగేళ్లుగా సాగినప్రతిపాదనలు ఇంతవేగిరంగా స్వేచ్ఛావాణిజ్యఒప్పందాలకు ఉభయదేశాలు వడివడిగా ముందుకొచ్చాయి.



కష్టాలను తప్పించుకునే వారికంటే, వాటిని అధిగమించే వారే విజయం సాధించగలరు.

మహాత్మా గాంధీ



నువ్వెంత కష్టపడి పని చేస్తున్నావో చెప్పొద్దు. ఏం పని పూర్తయిందో చెప్పు.

బెర్నార్డ్ షా

# సంక్షోభంలో యువజనం!

**దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేథాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒక స్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక, నిరుత్సాహంగా అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు.**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గుర్చి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. ఈ మూడింటిలోనూ సాఫల్యం చెందితేనే పరిపూర్ణత లభిస్తుంది, అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతాం. ఇది వ్యక్తులకైనా, సంస్థలకైనా, ప్రభుత్వాలకైనా వర్తిస్తుంది. దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు నిరాశానిస్పృహలతో నీరసించిపోతున్నారనేది పెద్దలకు తెలియంది కాదు. వారిలో నూతనోత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి కార్యోన్ముఖులను చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గుర్చి కూడా పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆ వైపు అడుగులు పడడం లేదు. రాజకీయ నాయకులు ఎప్పుడూ రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తే రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్తు గురించి మదనపడతారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతో శాస్త్రసాంకేతిక రంగాలు పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేథాసంపత్తిని సంతరించుకొని శక్తియుక్తులు, ప్రతిభాసామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలకమైనదని నేతలు వక్కాణిస్తుంటారు. నవభారత నిర్మాణానికి ఉద్యమించి దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేయాల్సిన పవిత్ర బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందని పెద్దలు పదేపదే సెలవిస్తుంటారు. కాగితాలపై కళా విన్యాసంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని పల్లెపల్లెల్లో ప్రతి బస్తీలోనూ స్థితిగతులను చక్కదిద్ది ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా యువజనులందరినీ కలిపి ఐక్యంతో కృషిచేస్తే దేశానికి ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమవుతుందని పాలకులందరికి తెలిసిందే. ఇందుకోసం అనేక పథకాలు కూడా ప్రవేశపెట్టారు. కానీ ఆ పథకాల అమల్లో అవినీతికి, అవతవకలు తావులేకుండా చేయలేకపోతున్నారు. మారిన కాలానుగుణంగా పరిస్థితుల దృష్ట్యా ముఖ్యంగా విద్యావిధానంలో మార్పు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిసినా ఆ కోణంలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. చాలా మంది విషయంలో చదివే చదువుకు జీవనోపాధికి సంబంధం లేకుండాపోతున్నది. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎందరో హోంగార్డు, పోలీసు లాంటి ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఏదో ఒకరిద్దరు కాదు. వందలసంఖ్యలో ఈ నియామక పరీక్షలకు హాజరవుతున్నారు. అంతేకాదు ఆ ఉద్యోగాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా సిద్ధపడుతున్నారు. దళారుల చేతుల్లో మోసపోయిన వారెందరో ఉన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక బంగారు కొలువుగా మారిపోయింది. ఆ ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబానికి ఆరోగ్య, ఆర్థిక సెక్యూరిటీ లభిస్తాయనే ఆశలు పెరిగిపోయాయి. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రాల పాలకులు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనలు ఇస్తున్నారు. కొంతమేరకు నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఈ ఉద్యోగాల కోసం గ్రామాల్లో ఉన్న యువత పట్టణాలకు చేరుకొని కోచింగ్ సెంటర్ల బాటపడుతున్నారు. వేలాది రూపాయలు వ్యయం చేస్తున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొన్ని కోచింగ్ సెంటర్లు తమ శక్తి కొలదీ ప్రయత్నాలు చేస్తున్నాయి. పరీక్షలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ కోచింగ్ సెంటర్లకు అంతగా లక్ష్మీప్రసన్నం ఉంటుంది. మరొకపక్క ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా దళారుల ప్రమేయానికిఆస్కారం లేకుండా ఈ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్నా, శతకోటి దారిద్ర్యాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఈ దళారులు ఏదో ఒక రూపంలో

## ఒక్క మాట

ఎక్కడో ఒక చోట చొచ్చుకుపోయేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత గతంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సంబంధించి భారీ కుంభకోణమే జరిగింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగాలే ప్రశ్నపత్రాలు అమ్ముకున్న విషయం వెలుగు చూసింది. ఆ కేసుకు సంబంధించి వందమందికిపైగా అటు ఉద్యోగులను, ఇటు ప్రశ్నపత్రాలను అందుకున్న అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు నడుస్తున్నది. అనేక రాష్ట్రాల్లో ఈ పరీక్షాపత్రాల వ్యాపారం జోరుగానే జరుగుతున్నట్లు గతంలో వెలుగు చూసిన సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే కేవలం ఐదారుశాతం మందికి ఉద్యోగాలు కల్పిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. దేశంలో ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూస్తున్న కోట్లాది మంది యువతీయువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం అనేది సాధ్యమయ్యే పనికాదు. అలా కోరుకోవడం కూడా ఏమాత్రం సమంజసం కాదు. పోనీ స్వయం ఉపాధి పథకాలేమైనా అవకతవకలకు, అవినీతికి దూరంగా నడుస్తున్నాయంటే అదీలేదు. ఉత్తరమో, దక్షిణో లేకుండా ఫైళ్లు కదలని పరిస్థితి. రాజకీయ అండైనా లేక లక్ష్మీప్రసన్నలైనా ఉండాలి. అందుకే యువజన శక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలు ఇస్తూ దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు యువజన సంక్షేమం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, కొన్ని ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేథాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏఆధారం లేక, నిరుత్సాహంగా అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ చేసి మెరికల్లాంటి యువతీయువకులు ఇంతకాలం విదేశాలకు వెళ్లిపోయి తమ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకొని అక్కడే సేవలు అందిస్తున్నారు. అక్కడికి వెళ్లాలనే ఆరాటపడే వారి సంఖ్యకూడా తక్కువేమీకాదు. ఇప్పుడు అక్కడి పరిస్థితులు కూడా అయోమయంగా మారిపోయాయి. అమెరికా దేశ అధ్యక్షుడుగా ట్రంప్ రెండోసారి గెలిచిన తర్వాత స్థానికులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత అంటూ గళమెత్తారు. మొన్న బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ఆయన ఏకంగా భారతీయులను ఉద్యోగాల్లో నియమించుకోవద్దని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎంతో మంది అమెరికా నుండి భారత్‌కు వచ్చారు, వచ్చేస్తున్నారు. అక్రమ వలసదారుల పేరుతో మరెందరినో గొలుసులు వేసి విమానాల్లో ఎక్కించి పంపుతున్నారు. అక్కడ ఉన్నవారికే పరిస్థితి అలా ఉంటే కొత్తగా వెళ్లాలనుకునేవారికి అవకాశాలు దాదాపు మూసుకుపోయినట్లే చెబుతున్నారు. ఇంకొకపక్క ఆస్ట్రేలియాలో కూడా పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. గతవారంలో భారత సంతతికి సంబంధించిన ఒక యువకుడిని హత్యచేయగా, దేశంనుంచి వెళ్లిపోమంటూ పోస్టర్లు వేస్తున్నారు. ఇక ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్ తదితర దేశాల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పక్కర్లలేదు. యుద్ధాలతో అవి అతలాకుతలం అవుతున్నాయి. ఉద్యోగాల సంగతి దేవుడెరుగు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులను సైతం స్వదేశాలకు తరలించారు. మరొకపక్క ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసంచేసే కార్యక్రమాలు దేశంలో నిరాటంకంగా జరుగుతున్నాయి. పాలకులకు ఈ విషయాలన్నీ తెలియనివి కావు. ఇదంతా లేత మనసులపై చెరగని ముద్ర వేస్తున్నది. సమాజంపై ప్రేమ అభిమానం ఉన్న యువకులే పగ, ద్వేషంతో రగలిపోతున్నారు. మరికొందరు నిస్సహాయస్థితిలో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు కళ్లుతెరవాలి. యువతీయువకుల్లో ఆత్మ విశ్వాసం పెంచాలి. ఇందుకు ముఖ్యంగా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలి. కనీసం యువతీయువకుల సంక్షేమం కార్యక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో త్రికరణశుద్ధిగా అవినీతికి అవకాశం లేకుండా వ్యవహరించగలిగితే కొంత మేరకైనా లక్ష్యం సాధించే అవకాశాలు ఉంటాయి. ●

# నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించేవారెవరు?

డి. అశోక్

పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు ప్రతి రోజూ పరితపిస్తూ ఉంటారు. స్కూల్ బస్సులు, ఆటోలు, వ్యాన్లకు వేల రూపాయలు వెచ్చించి తమ బిడ్డలను దూర ప్రాంతాల స్కూళ్లకు పంపించే తల్లిదండ్రులు, వాళ్లు సురక్షితంగా తిరిగివస్తారన్న నమ్మకంతోనే ఆ నిర్ణయంతీసుకుంటారు. కానీ ఆ నమ్మకాన్ని కొన్ని నిస్సహాయ పరిస్థితులు భగ్నం చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు దీనికి నిదర్శనంగా మారాయి. తనిఖీల్లో భయానక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. స్కూల్ బస్సులు నడిపే 14 మంది డ్రైవర్లు, విద్యార్థులను తరలించే 26 మంది ఆటో డ్రైవర్లు మద్యం సేవించిన స్థితిలో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. ఓ డ్రైవర్ రక్తంలో ఆల్కహాల్ స్థాయి నిబంధనల కంటే 13 రెట్లు అధికంగా ఉండటం, అతడు ఇలా వాహనం నడపడం నాకు కొత్త కాదు అని నిర్లక్ష్యంగా చెప్పడం గమనార్హం. ఈ సంఘటనలు పిల్లల ప్రాణాలను ఏ స్థాయిలో ప్రమాదంలోకి నెట్టుతున్నాయో స్పష్టంగా చూపిస్తున్నాయి. డ్రైవర్‌లు తాగిన మత్తులో వాహనాలు నడపడం కేవలం వ్యక్తిగత బాధ్యతాలోపం కాదు. ఇది యాజమాన్యాల నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్‌ల ఆరోగ్య పరిస్థితిని, మద్యపానం వంటి అలవాట్లను కచ్చితంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పటికీ, చాలా చోట్ల అది జరగడం లేదు. ఓ చిన్న అప్రమత్తత పిల్లల ప్రాణాలపై తీవ్రప్రభావాన్ని చూపుతుంది. 2022లో దేశవ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్‌వల్ల 10వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 4,201మంది ప్రాణాలు కోల్పోయారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత కొన్ని సంవత్సరాల్లో 83వేల డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 18వేలకి చేరిన ఈ కేసులు, పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో తెలుపుతున్నాయి. విశాఖపట్నంలో 2023తో పోల్చితే డ్రంకన్ డ్రైవ్ కేసులు 58 శాతం పెరగడం, ఇతర పట్టణాల్లోనూ ఇలాంటి వృద్ధి నమోదవడం కళ్లెదుట నడిచే ప్రమాద ఘట్టాల వైనాన్ని గుర్తు చేస్తోంది. తాగి వాహనం నడిపిన వ్యక్తులపై ఇప్పటికీ తక్కువ ఫైన్‌లు, కొన్ని రోజులు లైసెన్స్ సస్పెన్షన్ వంటి చర్యలు మాత్రమే తీసుకుంటున్నాం. కానీ అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో ఇటువంటి చర్యలు అత్యంత కఠినంగా ఉంటాయి. మరణాలు కలిగిస్తే 15నుంచి 20ఏళ్లవరకు జైలుశిక్ష విధిస్తారు. అటువంటి శిక్షలు వందల మంది జీవితాలను కాపాడే అవకాశాన్ని ఇస్తాయి. అందుకే భారత్‌లో కూడా శిక్షల తీవ్రతను పెంచేలా కొత్త చట్టాలను తేవాల్సిన అవసరం ఉంది. డ్రంకన్ డ్రైవ్‌ను ఆదాయ వనరుగా చూడడం మానేయాలి. మద్యం వలన ఎన్నో కుటుంబాలు విడిపోతున్నాయి. పిల్లలు అనాథలవుతున్నారు. ఇది సామాజిక సమస్యగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు వారాంతాల్లో మాత్రమే కాకుండా ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలి. హైవేలపై గణనీయంగా శ్వాస విశ్లేషణ పరీక్షలు జరగాలి. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపితే, అతడి లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దుచేయాలి. స్కూల్ యాజమాన్యాలు డ్రైవర్లపై పోలీసు వెరిఫికేషన్ చేయడం తప్పనిసరి చేయాలి. పిల్లల భవిష్యత్తు కంటే విలువైనది మరొకటి లేదు. ప్రతి తాగిన డ్రైవర్ స్కూల్ బస్సు స్టీరింగ్ పట్టుకున్నప్పుడు అది కేవలం చట్ట ఉల్లంఘన కాదు, ఒక కుటుంబంపై జరిగిన దాడి. సమాజంగా మనం మేలుకోవాలి. చట్టాలను కఠినతరం చేయాలి. ●

# నామినేటెడ్ సభ్యుల ఎంపికలో కొత్త ఒరవడి

యేచన్ చంద్రశేఖర్

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 80, క్లాజ్ (1), సబ్ సెక్షన్ (ఎ) ప్రకారం, కళ, సాహిత్యం, సాంకేతిక విజ్ఞానం, సామాజిక సేవా రంగాలలో గణనీయమైన కృషి చేసిన 12 మంది సభ్యులను రాజ్య సభకు నామినేట్ చేసేందుకు రాష్ట్రపతికి అధికారం కల్పించింది. రాష్ట్రపతి, రాజ్యాంగం ద్వారా తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించుకుంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని మంత్రి మండలి సిఫార్సుల మేరకు గతంలో నామినేట్ చేయబడి పదవీ విరమణ చేసిన సభ్యుల స్థానాలను భర్తీ చేయడానికి ఉజ్వల్ నికమ్, సి సదానందన్ మాస్టర్, హర్షవర్ధన్ ష్రింగ్లా, డాక్టర్ మీనాక్షిజైన్‌లను రాజ్యసభకు నామినేట్ చేసినట్లు జూలై 12, 2025 నాడు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు తప్ప నామినేటెడ్ సభ్యులు ఎన్నికైన ఎంపీలు అనుభవించే అన్ని అధికారాలు, హక్కులకు అర్హులు. గత దశాబ్ద కాలంలో, ప్రత్యేకించి రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేసే 12 మంది సభ్యుల విషయంలో, గణనీయమైన మార్పు గోచరిస్తోంది. రాజకీయాలకు దూరంగా విభిన్న దృక్పథాలతో వివిధ రంగాలలో తమ నైపుణ్యాలతో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఎగువ సభలోకి ఆహ్వానించి వారి అనుభవం నుండి ప్రయోజనం పొందడానికి నామినేషన్ పద్ధతి ప్రవేశపెట్టబడింది. ఇటీవలకాలంలో రాష్ట్రపతి ద్వారా రాజ్యసభకు నామినేట్ చేయబడే సభ్యుల ఎంపికలో స్వాగతించదగ్గ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో మాదిరిగా రాజకీయ లబ్ధి కోసమో లేదా సెలెబ్రెటీలు, డబ్బు పరపతి ఉన్న వ్యక్తులనో రాజ్యసభకు నామినేట్ చేసే ఒరవడి కాస్త తగ్గుముఖం పట్టి భారతదేశ సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడంలో వారి కృషికి గుర్తింపు పొందిన వారిని నామినేట్ చేయడంపై ప్రాధాన్యత పెరుగుతోంది. ఇది ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేసిన నలుగురు సభ్యుల విషయంలో స్పష్టంగా వెల్లడవుతోంది. ఈ నలుగురిలో ఉజ్వల్ దేవరావు నికమ్ ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఆయన కీలకమైన క్రిమినల్ కేసులను విచారించడంలోపేరు గడించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన నిర్వహించిన కీలక కేసుల్లో 26/11 ముంబై ఉగ్రవాద దాడి విచారణ ఒకటి. ఈ కేసులో ప్రాణాలతో పట్టుబడ్డ ఏకైక ఉగ్రవాది అజ్మల్ కసాబ్‌కు ఉరిశిక్ష పడేలా వ్యాజ్యం నడిపిన తీరు ఆయన న్యాయవాద వృత్తి నైపుణ్యానికి, నిబద్ధతకు నిదర్శనం. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన ప్రాతినిధ్యం వహించిన కేసులలో 1991 బాంబే బాంబు పేలుళ్ల కేసు, 1993 ముంబై వరుస పేలుళ్ల కేసు2003 గేట్‌వే ఆఫ్ ఇండియా బాంబు దాడులు కేసు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రధాన కేసుల్లో కూడా నికమ్ వాదించారు.



ప్రముఖ గూర్ఖా వ్యక్తులలో ఒకరైన హర్షవర్ధన్ ష్రింగ్లా డార్జిలింగ్ కొండ ప్రాంతానికి చెందినవారు. ఆయన 2020 నుండి 2022 వరకు భారత విదేశాంగ కార్యదర్శిగా పనిచేశారు. 2019-2020లో అమెరికాలో భారత రాయబారిగా కూడా పనిచేసిన ఆయన 2019లో అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన హౌడీ మోడీ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి పనిచేశారు. 2023లో భారతదేశ జి20 అధ్యక్ష పదవికి ఆయన చీఫ్ కోఆర్డినేటర్ కూడా పనిచేశారు. విదేశాంగ విధానం దౌత్యంలో విస్తృత అనుభవం కలిగిన ష్రింగ్లా యునైటెడ్ స్టేట్స్, థాయిలాండ్ రాయబారిగా, బంగ్లాదేశ్‌కు హైకమిషనర్‌గా కూడా పనిచేశారు. కోవిడ్19 మహమ్మారి సమయంలో ష్రింగ్లా భారతదేశ దౌత్య కార్యకలాపాలకు నేతృత్వం వహించడంతో పాటు చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు వంటి సున్నితమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసారు. వ్యూహాత్మక ఆలోచనా ధోరణితో మేధోపరమైన సహకారం అందించగల ఆయన నైపుణ్యం, సంక్లిష్టమైన దౌత్య సవాళ్లను నిర్వహించగల ఆయన సామర్థ్యం పార్లమెంటరీ కార్యకలాపాలను సుసంపన్నం చేస్తాయనడంలో ఎలాంటి సంశయం లేదు. పద్మశ్రీ మీనాక్షిజైన్ ప్రస్తుతం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో (ఐసిఎస్ఆర్) సీనియర్ ఫెలో. భారతదేశంలో సాంస్కృతిక, మతపరమైన పరిణామాలపై విశేష పరిశోధనలు చేసారు. విద్య, సాహిత్యం, చరిత్ర రాజకీయ శాస్త్రంలో ఆమె చేసిన కృషి ముఖ్యంగా విద్యాపరమైన చర్చలను సుసంపన్నం చేసింది. భారతీయ వారసత్వం, మత సంస్కరణలు, ప్రస్తుత రాజకీయ పోకడలపై ఆమె అభిప్రాయాలు, లోతుగా పరిశోధించి జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సమస్యలను పరిష్కరించిన రచనలు పార్లమెంటరీ చర్చలకు విలువైన రచనలుగా పరిగణించబడతాయి. 2014లో భారత ప్రభుత్వంచే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యురాలిగా నామినేట్ చేయబడిన ఆమె సాహిత్యం విద్యా రంగాలలో చేసిన కృషికి 2020లో పద్మశ్రీఅవార్డును అందుకున్నారు. రాజ్య సభ సభ్యురాలిగా ఆమె నామినేషన్ భారతీయ చరిత్ర సంస్కృతి రంగంలో మేధోపరమైన కృషి మరియు పాండిత్యానికి గుర్తింపును ప్రతిబింబిస్తుంది. సదానందన్ మాస్టర్ రాజ్యసభ ఎంట్రీ కేరళ సుదీర్ఘ రాజకీయ హింస, ప్రతీకార హత్యల చరిత్రనుగుర్తు చేస్తుంది. హింస బెదిరింపులు అతని ఉత్సాహాన్ని ఏమాత్రం నిలువరించలేకపోయాయి. కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన సదానందన్ మాస్టర్ తన కళాశాల రోజుల్లో సిపిఎం సభ్యుడిగా చురుకుగా ఉండేవారు. సిపిఎం నాయకులతో విభేదాల కారణంగా ఆర్ఎస్ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులైన ఆయన కొంతమంది స్నేహితులతో కలిసి, సిపిఎం బలమైన కోట అయిన మట్టన్నూర్‌లో ఆర్ఎస్ఎస్ యూనిట్‌ను ఏర్పాటు చేయగా ఆయనను కన్నూర్‌లోని ఆర్ఎస్ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్‌గా నియమించారు. జనవరి 25, 1994న, 12 మంది సిపిఎం కార్యకర్తలు, ఆయన ప్రయాణిస్తున్న కారు నుండి బయటకు లాగి, రెండు కాళ్లను తెగనరికారు. అయితే, ఎన్నికైన నామినేట్ చేయబడిన సభ్యుల కూర్పుతో రాజ్యసభ ప్రధాన నిర్మాణం భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో కీలకమైన అంశంగా పరిగణించబడుతుంది. ●

# ప్రజావాక్కు



### కుబేర తరహా కుంభకోణమా?

ఈ మధ్యనే వచ్చిన 'కుబేర' చిత్రంలో బిచ్చగాళ్లను మోసగించినట్టు చూపితే, ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు కేంద్రంగా నిరుపేదలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి బ్యాంకు నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన తీరు చూస్తుంటే చాలా దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. యాక్సిస్ బ్యాంకు కేంద్రంగా చోటు చేసుకున్న ఈ కుంభకోణంలో అమాయకులైన దళితులు, గిరిజనులకు రుణాలను ఇప్పిస్తామంటూ కొంత మంది వ్యక్తులు మోసగించి నట్టు ప్రాథమిక సమాచారం. తొలుత 56 మందిని మోసగించి, రూ. 20 కోట్ల నుంచి రూ.30 కోట్లు స్కామ్ చేశారని భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం వందల కోట్లు దాటిందనే పత్రికల కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల్లో లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరగడంపై ఆర్.బి.ఐ. తరచూ ఆందోళన వ్యక్తం చేయడం మినహా కార్యా చరణ లేకపోవడం ప్రమాదకరం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

ఇప్పటి డిజిటల్ యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లలజీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారి ఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరకజడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియోలు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది. అలాగే, సోషల్ మీడియా వల్ల పిల్లల్లో అసహనం, ఒత్తిడి ఏర్పడుతోంది. ఆత్మవిశ్వాసం తగ్గుతుంది కొన్నిసార్లు. డిజిటల్ ప్రపంచానికి పరిమితి ఉండాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అటెండర్ స్థాయి నుండి జిల్లా కలెక్టర్‌స్థాయి వరకు అధికారులకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వంతరఫున గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. గుర్తింపుకార్డులలో ఉద్యోగికి సంబంధించిన పూర్తివివరాలను స్పష్టంగా ఉండే విధంగా చూడాలి. ఐడి నంబరు, పేరు, ఫోన్ నెం. ఉండాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### యూరియా కొరతతో అన్నదాత ఆగమాగం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో యూరియా కొరత వల్ల రైతులు నానా యాతన పడుతూవున్నారు. సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఉదయమే క్యూలైన్‌లో పాసుబుక్కులు పెట్టిన రైతులు వర్షాలతో రాళ్లను పెట్టి నిరీక్షిస్తున్నారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామనిప్రభుత్వం చెబుతున్నప్పటికీక్షేత్రస్థాయిలో మాత్రం అది కనబడటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులువరి, మొక్కజొన్న పంటలను ఎక్కువ మొత్తంలో సాగుచేశారు. యూరియా అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బారులు తీరుతున్నారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటంతో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు సరిపడా యూరియాను సరఫరా చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

### ఉచిత వైద్యం కల్పించాలి

కేంద్రప్రభుత్వం సుమారు ఏడాది క్రితం ఘనంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ కార్డులు తెలంగాణా రాష్ట్రంలో అయితే ఇంతవరకు జారీకాలేదు. మీ సేవ వారికి కూడా ఏ విధమైన సమాచారంలేదు. ఆధార్‌కార్డు ద్వారా కె.వై.సి. తీసుకుంటే హాస్పిటల్ వాళ్లు దానిని వైద్యానికి ఒప్పుకుంటారని అంటున్నారు. ఇంతవరకు ఆ పత్రాలను చూపించి వైద్యం చేయించుకున్న వాళ్లెవరు తారసపడలేదు. మరొక విషయ మేమంటే ఈ ఆరోగ్య పథకం ఎమర్జెన్సీలో హాస్పిటల్‌లో చేర్చుకున్న వారికే వర్తింస్తుందట. అవుట్ పేషంట్లకు ఈ పథకం పనికిరాదట. ఆపైన ఈ5లక్షల పథకం ఏడాదికి భార్యా భర్తలకు కలిపి ఉంటుందట. కేవలం ఆధార్ కార్డు ద్వారా 70 ఏళ్లుదాటిన వారందరికి ఏఅడ్డంకులు లేకుండాసూచించిన వైద్య శాలల్లో ఉచిత వైద్యం కల్పిస్తే ఏ గందరగోళం ఉండదు కదా!

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### కల్తీ విత్తనాలను అరికట్టాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఫర్టిలైజర్ యాజమాన్యసంస్థలు రైతులకు అందించే విత్తనాలపైదృష్టిసారించి నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులు మోసపోకుండా చూడాలి. అదేవిధంగా అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీకి ప్రభుత్వమే అందించే ప్రయత్నం చేయాలి.

-ఎం.సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

విజయవాడ వార్త

## వార్షిక కౌలు సంబంధిత అర్జీలు పరిష్కరించేందుకు కృషి : జిఆర్ఎం నోడల్ అధికారి జయశ్రీ

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సిఆర్డిఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఇటీవల రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయిన 11వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించిన సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంతవాసులు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(బిఆర్బి) నోడల్ అధికారి పి.జయశ్రీ గారికి అందజేశారు. వార్షిక కౌలుకు సంబంధించి రైతులు అందజేసిన అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని నోడల్ అధికారి గారు అర్జీదారులకు తెలియజేశారు. ఆధార్ బేస్డ్ క్రెడిట్ విధానంలో వార్షిక కౌలు నగదు..సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని, అదేవిధంగా సాంకేతిక సమస్యల కారణంగా రైతులకు నగదు జమ కానట్లయితే రానున్న 15 రోజులలో కౌలు నగదు జమయ్యేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సిఆర్డిఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియజేసిన ఫిర్యాదులలో పలు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని, సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని నోడల్ అధికారి గారు సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీవెన్స్ డేలో 54 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఇవి:1.అమరావతిలో భూమి వ్యవహారాలు = 52 2. డెవలప్మెంట్ ప్రమోషన్ = 1 3. ఇన్‌ఫ్రా1 = 1 గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి. సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి. పద్మావతి, జి. రవీందర్, జి. భీమారావు, ఏ.జి. చిన్నికృష్ణ, సిఆర్డిఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగ రావు రామకృష్ణన్, సామాజిక సంక్షేమ విభాగ దీదీదీవీ బి. శ్రీనివాసరావు, డెవలప్మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్. మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ఇంద్ర టవర్స్ వార్షికోత్సవ వేడుకలు

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** శ్రీ చైతన్య (ఇంద్ర టవర్స్) కళాశాల వార్షికోత్సవం కానూరు మన కల్యాణ మండపం లో ఘనంగా జరిగింది. శ్రీచైతన్య విద్యా సంస్థల కార్యనిర్వాహక ఏ జి ఎం శ్రీ మద్దినేని మురళీ కృష్ణ జ్యోతి ప్రజ్వలనం గావించారు. గత సం++రం నీట్ లో ఉత్తీర్ణులై మెడికల్ సీట్లు పొందిన విద్యార్థులకు మరియు వివిధ స్పోర్ట్స్ లలో పతకాలు సాధించిన




విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ టి సురేష్ బాబు మెడికోలను అభినందించారు. విజేత విద్యార్థుల తల్లిదండ్రులు, పురప్రముఖులు ఈ కార్యక్రమములో పాల్గొన్నందుకు తమ సంతోషాన్ని వ్యక్త పరిచారు. అనంతరం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టు కున్నాయి. శ్రీ చైతన్య తన విద్యా విజయాలను కొనసాగిస్తూ, మరెన్నో మైలు రాళ్లను నెలకొల్పుతుందని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన. శ్రీచైతన్య విద్యా సంస్థల కార్యనిర్వాహక ఏ జి ఎం మద్దినేని మురళీ కృష్ణ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏ జి ఎం పి రామకృష్ణ, డీన్ బి రవీంద్ర పర్యవేక్షించారు.

## గురుకుల పాఠశాల,కళాశాలలో 2025-26 విద్యార్థుల మిగుల సీట్ల భర్తీ

**ఎ కొండూరు, జులై 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం ఇంటర్ ఫస్ట్ ఇయర్ (ఎంపిసి/బైపిసి) 5వ తరగతిలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగులు సీట్ల భర్తీ కొరకు పాఠశాల / కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కె.సిద్దయ్య శుక్రవారం మీడియాకు తెలిపారు.

## డ్వాక్రా మహిళలకు 80శాతం రాయితీతో డ్రోన్‌లు



**వత్సవాయి, జులై 25, ప్రభాతవార్త :** ఏపిలో డ్వాక్రా మహిళలకు 80శాతం రాయితీతో డ్రోన్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించనున్నాయి. ఈ ఏడాది 440 మంది మహిళలకు డ్రోన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ ధర రూ.10లక్షలుపై రూ.8లక్షలు రాయితీ లభిస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో 88 మంది లబ్దిదారులను సెర్ప్ అధికారులు గుర్తించారు. మిగిలిన వారిని ఈ నెలఖరులోగా ఎంపిక చేయనున్నారు. త్వరలోనే లబ్దిదారులకు డ్రోన్లు అందిస్తారు.

## పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, జులై 25, ప్రభాతవార్త :** శాతవాహన కళాశాలలోని నాలుగు పోలింగ్ స్టేషన్లలో ఒకటి కర్నాటి రామ్మోహనరావు స్కూల్లో, మూడు పోలింగ్ స్టేషన్లు ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు ఏఈఆర్ఓలు, సెంట్రల్ తహసీల్దార్ ప్రతిపాదించగా సెంట్రల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అయిన కమీషనర్ పరిశీలించారు. శుక్రవారం తన పర్యటనలో భాగంగా ఆయన ఈట్ స్ట్రీట్, వేముల శ్యామలాదేవి రోడ్డు, కర్నాటి రామ్మోహన్ స్కూలు వీధి, విశాలాంధ్ర రోడ్, బిఆర్టిఎస్ రోడ్, సికె రెడ్డి రోడ్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈట్ స్ట్రీట్‌లో నిరంతరం డీ సిల్టింగ్ పనులను చేస్తుండాలని పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండకూడదని, ఒకసారి వాడి



పడేసే ప్లాస్టిక్‌ను ఖచ్చితంగా నిషేధించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఖచ్చితంగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని, విజయవాడ నగరం ప్లాస్టిక్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత నగరంగా, పర్యావరణహిత నగరంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ఖచ్చితంగా అమలు జరగాలని పేర్కొన్నారు కర్నాటి రామ్మోహనరావు స్కూలు రోడ్డులో అక్కడ కాంపౌండ్ వాల్ సరిగ్గా లేదని ఇంజనీరింగ్ అధికారులు ఆ గోడను పునరుద్దరించాలని, ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులను ఆదేశించారు. విశాలాంధ్ర రోడ్డు పర్యటించి, నగర సుందరీకరణలో భాగంగా డివైడర్లలో గ్రీనరీని పెంచాలని, రంగు వెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏఈఆర్వోలు, పర్యవేక్షణ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్య కుమారి, సెంట్రల్ డిప్యూటీ తహసీల్దారు సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి టిటిడి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ

**-12 సంవత్సరాలకు ఒకసారి చేయనున్న వైనం**
**-ఈ నెల 31న పూర్ణాహుతి**
**-31న మహా అన్నప్రసాద వితరణ**
**సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు**

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** టిటిడికి అనుబంధంగా ఉన్న విజయవాడ, పున్నమితోట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో అష్టబంధన జీర్ణోద్ధారణ మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 26 నుండి 31 వరకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. శుక్రవారం పున్నమితోట లోని టిటిడి దేవాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగమ శాస్త్ర నిబంధనల మేరకు శాస్త్రో_క్తంగా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి అష్టబంధన మహా సంప్రోక్షణ చేపట్టడం ఆచారంగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని జులై 26వ తేదీ శనివారం ఉదయం 8.30 నుండి 10.30 వరకు ఆచార్యవరణం, వాస్తుశాంతి, అకల్మష హోమం, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు మృత్సంగ్రహణము, అంకురార్పణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. అందులో భాగంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 9 నుండి 12 గంటల వరకు అగ్ని మథనం, పంచాగ్ని ప్రణయనం, అగ్ని ప్రతిష్ట, సాయంత్రం 6.30కు బింబాత్ కుంబే కళాపకర్షణ, ఉపచార సమర్పణం, ఉక్త హోమాలు చేపడతామన్నారు. జులై 28న సోమవారం ఉదయం 9 గంటలకు నవగ్రహారాధన, నవగ్రహమఖం, ప్రధాన హోమాలు, సాయంత్రం 6.30కు ఉక్త హోమాలు, కుంభారాధనలు, అభి మంత్రణంలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. జులై 29 ఉదయం 9 గంటలకు సర్వ శాంతి హోమాలు, సాయంత్రం 6.30కు సర్వ దోషాపశమనార్థం సహస్రాహుతి హోమాలు చేపడతామన్నారు. జులై 30వ తేదీ ఉదయం 9 గంటల నుండి అష్టబంధన ద్రవ్యారాధనం, మహా శాంతి హోమాలు, ఉష్ణ బంధనం, సాయంత్రం 4 గంటలకు విశేష మహాశాంతి తిరుమంజనం, ధాద్యాధివాసం, సర్వదైవత్యహోమం, రాత్రి 7 గంటల నుండి 9



గంటల వరకు దోష ప్రాయశ్చిత్త హోమం చేపడతామన్నారు. ఆలయ ప్రధానార్చకులు మురళి, శశికిరణ్‌లు మాట్లాడుతూ జులై 31వ తేదీ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు మహా పూర్ణాహుతి, ఆలయ ప్రవేశం, అనంతరం చిత్త నక్షత్ర యుక్త గురువారం తులా లగ్న శుభముహూర్తాన ఉదయం 11.25 గంటల నుండి 12.24 గంటల వరకు కళావాహనం, ప్రథమ కాలార్చనం, మహా సంప్రోక్షణ, అక్షతారోహణ, బ్రహ్మ ఘోష, ఆచార్య రుత్విక్ బహుమానం, కుంభాత్ బింబ సమారోహణం, యజమాన ఆశీర్వాదం తదితర కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమావేశంలో పాల్గొన్న భక్తులు కూడ కోరారు. కార్యక్రమంలో భక్తులు పడవల ఏడుకొండలు, విజయకుమార్, వేణు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, రెడ్డి, శ్రీనివాస్, తులసీ రాజశ్వేరి, శాంతిశ్రీ, కిట్టు, నారాయణరావు, ఆలయం అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్యూ లో ఘనంగా నారా రోహిత్ జన్మదిన వేడుకలు

**గుంటూరు, జులై25, ప్రభాతవార్త ప్రతినిధి :** సినీ హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలను రోహిత్ అభిమాన సంఘం మరియు టిఎన్ఎస్ఎఫ్








టిఎన్టియుసిల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముందుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటుచేసిన భారీ కేక్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నిర్మాత మరియు ఎన్టీఆర్ శతజయంతి లిటరేచర్ సావునీర్ కమిటీ కన్వీనర్ అట్లూరి నారాయణరావు గారు చేతులమీదుగా కేక్ కట్ చేయడం జరిగింది అలాగే అనంతరం వర్సిటీ ఎదురుగా గల జె.ఎం.జె ఉజ్వల హోమ్స్ లో బాలికలకు ఒకరోజు భోజనం సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే వసతి గృహంలో ఉండే విద్యార్థులకు ఆపిల్ మరియు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది అదేవిధంగా జాతీయ రహదారి పక్కన ఉన్న అనాథ వృద్ధులకు కూడా దుప్పట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా అట్లూరి నారాయణరావు గారు మాట్లాడుతూ హీరో రోహిత్ భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలు నటించి ప్రేక్షకులను మెప్పించాలని ఎక్కువ మంది ప్రేమ అనురాగాలు పొందాలని సామాజిక మరియు సందేశాలతో సినిమాలలో అందరి మన్ననలు పొందుతారని పొందాలని ఆశించారు అదేవిధంగా నూతక్ లో ఉన్నటువంటి మాతృ ఛాయా ఆర్గనైజేషన్ ఆర్ఎస్ఎస్ వారిచే నడపబడుతున్న అనాథ విద్యార్థులకు కూడా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రోహిత్ అభిమాన సంఘం అధ్యక్షుడు ఆరే గోపి టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ కుమార్ టిఎన్టియుసి అధ్యక్షుడు విష్ణు ప్రసాద్ ఆచార్య ఏం సుబ్బారావు డాక్టర్ ఎం. వెంకటరమణ హోం నిర్వాహకులు సిస్టర్ రోస్ లిన, కౌన్సిలర్ ఎం రూప విద్యార్థి నాయకులు, హరీష్ ,యశ్వంత్, మోహన్ సింహాద్రి, సుజిత్, ఉదయ్, అనిల్, పూర్ణ, ఉపేంద్ర, సాయి, శిరీష్, భాను ప్రకాష్ , హర్ష, పీజే రాజు తదితరులు పాల్గొన్నారు

## ఫ్రైడే డ్రై డేని ఖచ్చితంగా పాటించాలి : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, జులై 25, ప్రభాతవార్త:** దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కోసం ఫ్రైడే డ్రై డే నిర్వహణతో ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పూర్ణానందపేటలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజలు వారి ఇళ్లల్లో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని వారికి అవగాహన కల్పిస్తూ దోమల పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించడం వల్ల ప్రజలు దోమకాటు వల్ల అనారోగ్యం పాలవకుండా ఉండవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా సైడ్ డ్రైన్‌లలో పూడికలు తీయడం, ఎల్ ఆయల్స్ స్ప్రే చేయడం కల్వర్ట్‌ల వద్ద ఫాగింగ్ చేయడం వంటి యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి దోమలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు. తదుపరి గులాబీతోటలో ఉన్న అన్న క్యాంటీన్‌ను



పరిశీలించి, ప్రతి రోజు నోడల్ ఆఫీసర్లు ఖచ్చితంగా తమ తమ అన్న క్యాంటీన్లను పరిశీలించి ఎటువంటి లోపం లేకుండా మరమ్మత్తులు లేకుండా ఎప్పటికప్పుడు అప్రత్తంగా ఉంటూ చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బయోలజిస్ట్ కామేశ్వరరావు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్స్, మలేరియా వర్కర్లు పాల్గొన్నారు.

## సిపి రాజశేఖరబాబును మర్యాద పూర్వకంగా కలిసిన టాస్క్‌ఫోర్స్ నూతన ఎసిపి లతాకుమారి

**విజయవాడ క్రైం, జులై 25, ప్రభాతవార్త:** టాస్క్‌ఫోర్స్ నూతన ఎసిపిగా కె.లతాకుమారి భాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిపి రాజశేఖరబాబును



మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీలలో భాగంగా మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎసిపిగా పనిచేస్తున్న లతా కుమారిని ఎన్టీఆర్ పోలీస్ కమీషరేట్ టాస్క్‌ఫోర్స్ ఎసిపిగా బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె సిపి రాజశేఖరబాబును కలిసారు.

**మహిళా పోలీస్‌స్టేషన్ ఎసిపిగా దైవప్రసాద్**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీలలో భాగంగా కర్నూలు రీజినల్ ఆఫీస్, సిఐడిలో డిఎస్‌పిగా పనిచేస్తున్న టి.దైవప్రసాద్ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ లోని మహిళా పోలీస్‌స్టేషన్‌కు ఎసిపిగా బదిలీ అయ్యారు. శుక్రవారం మహిళా పోలీస్‌స్టేషన్‌లో భాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతరం సిపి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు మొక్కను అందించారు.

## ఈనాం భూముల సమస్యలు పరిష్కరించండి : టిడి జనార్ధన్

**వత్సవాయి, జులై 25, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా రైతులను వేదిస్తున్న ఈనామ్ భూముల సమస్యల పరిష్కారానికి సంబంధించి గ్రూప్



ఆఫ్ మినిష్టర్స్ అధ్యక్షుడు అనగాని సత్యప్రసాద్‌ను తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, రాజకీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ మర్యాదపూర్వకంగా కలిసి ఈనాం భూముల సమస్యపై చర్చించారు. ఆ క్రమంలో సానుకూలంగా స్పందించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకున్నాం ! త్వరలోనే దీనికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

**తిరువూరు, జులై 25, ప్రభాతవార్త :** గత మూడు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు నగర పంచాయతీ కమీషనర్ మనోజ తెలిపారు. ఇంటిలో వాడిన చెత్తను ఖాళీ



ప్రదేశాల్లో పడేస్తే వర్షాల్లో దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలకు గురై సీజనల్ వ్యాదులు వ్యాపిస్తాయని, ఖాళీ ప్రదేశాల యజమానులు తప్పనిసరిగా స్థలంలోని పిచ్చి మొక్కలు తొలగించి ప్రజా ఆరోగ్యానికి సహకరించాలని అన్నారు. అట్లు చేయని ఎడల మున్సిపల్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఏపి తెలంగాణల్లో మొదటిసారి లెన్నూక్ ఎక్స్12 ప్రో ఆవిష్కారం

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** ప్రపంచ ఐవిఎఫ్ దితనోత్సవాన విజయవాడలోని ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో అత్యాధునిక ఏఐ ఆధారిత సిమెమన్ ఎనలైజర్, లెన్నూక్ ఎక్స్ 12 ప్రోను పరిచయం చేస్తూ, సంస్థ సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో తన నూతన దిశను ప్రకటించింది. ఈ ఆవిష్కరణతో ఏపి తెలంగాణల్లో అన్ని కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేసిన తొలి ఐవిఎఫ్ చెయిన్‌గా నిలిచింది. ఈ సందర భంగా



ఫెర్టి9 సహాయంతో గర్భధారణ, బిడ్డలను పొందిన జంటలు వేడుకల్లో పాల్గొని తమ ఆనందం వ్యక్తం చేశారు. ఏపి తెలంగాణల్లో పురుషుల వంధ్యత్వం పై కీలక అంశాలను గుర్తించి ఆధునిక సాంకేతికతతో తాము పలు పరిష్కారాలు అందిస్తామని ఫెర్టి9 ఫెర్టిలిటి స్పెషలిస్ట్ డా సుమ, డా జ్యోతి తెలిపారు.

## ఏపిలో దాల్మియా సిమెంట్స్‌విస్తరణ వేగవంతం

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో తమ కరా ్మగారంలో 3.6 మిలియన్ టన్నుల క్లింకర్ సామర్థ్యాన్ని, 6మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తిని విస్తరిస్తున్నట్లు దేశంలో నాల్గవ సిమెంట్ ఉత్పత్తిదారు దాల్మియా భారత్ లిమిటెడ్ ఎండి పునీత్ దాల్మియా తెలిపారు. దీంతో ఏపి పారిశ్రామికంగా మరింత ఆర్థిక పురోగతి సాధిస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతతో, శక్తి సామర్థ్యంతో 5వేల ఉద్యోగాలను కల్పిస్తుందన్నారు. ఈ విస్తరణ ఎఫ్‌వై28 నాటికి 75 మిలియన్ టన్నుల సిమెంట్ సామర్థ్యాన్ని సాధించడం లక్ష్యమన్నారు.

## ప్రధాని మోదీ పర్యటన భారత్ యుకె ఎఫ్‌టిఏ మేకిన్‌ఇండియాకు కొత్తశకం

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** ప్రధాని మోదీ రెండు రోజుల అధికార పర్యటన సందర్భంగా భారత్ యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడానికి టివిఎస్ మోటార్స్ కంపెనీ స్వాగతించినట్లు సంస్థ ఎండి సుదర్శన్ వేణు ప్రకటించారు. ఈ మైలురాయి ఒప్పందం 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 60 బిలియన్ డాలర్ల నుండి 120 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేస్తుందన్నారు. టివిఎస్ మోటార్ కంపెనీకి, ఐకానిక్ బ్రిటీష్ బ్రాండ్‌ను వ్యూహాత్మకంగా కొనుగోలు చేసిన తర్వాత యుకెలో నార్టన్ మోటార్‌సైకిల్స్ కొత్త శ్రేణిని ప్రారంభించే తరుణంలో ఈ ఒప్పందం వస్తుందన్నారు.

## ముగ్గురు యువకుల ప్రాణాలను కాపాడిన చీరాల రూరల్ పోలీసులు

**బాపట్ల, జులై25, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లాలోని వాడరేవు, రామాపురం బీచ్ లకు యాత్రికులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో యాత్రికుల రక్షణ కొరకు పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వాడరేవు సముద్ర తీరంలో ముగ్గురు యువకులు అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోతుండగా డ్రోన్ సహాయంతో వారిని గుర్తించిన చీరాల రూరల్ ఎస్.ఐ చంద్రశేఖర్ వెంటనే ఆ ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్ళను అప్రమత్తం చేసి యువకుల ప్రాణాలను కాపాడారు. వివరాలలోకి వెళితే జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పీ మోయిన్ సూచనల మేరకు యాత్రికుల భద్రత నిమిత్తము స్థానిక పోలీసులు, గజ ఈతగాళ్ళను వాడరేవు, రామాపురం సముద్రతీరాల వెంబడి పోలీస్ అధికారులు నియమించారు. శుక్రవారం మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో అంకాలమ్మ తల్లి కొలుపుల సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 1000 మంది యాత్రికులు వాడరేవు సముద్ర తీరంలో స్థానాలు ఆచరించడానికి తీరానికిచేరుకున్నారు. వారిలో ముగ్గురు యువకులు సముద్రంలో ఎక్కువ లోతుకు వెళ్లి మునుగుతుండడంతో ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి యువకులు సముద్రంలోకి కొట్టుకుపోతుండగా డ్రోన్ సహాయంతో యువకులను గుర్తించిన చీరాల రూరల్ ఎస్సై చంద్రశేఖర్ వెంటనే విధులలో ఉన్న పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను అప్రమత్తం చెయ్యడంతో వారు వేగంగా స్పందించి తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సముద్రంలోకి ఈదుకుంటూ వెళ్లి కొట్టుకుపోతున్న ముగ్గురు యువకులను కాపాడి ఒడ్డుకు తీసుకొని వచ్చినారు. ఈపురుపాలెం ఎస్సై యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారితో పాటు వచ్చిన గ్రామస్తులకు క్షేమంగా అప్పగించారు. పోలీసులు శరవేగంగా స్పందించి ముగ్గురు యువకుల ప్రాణాలను కాపాడిన తీరు పట్ల యాత్రికులు హర్షం వ్యక్తం చేసినారు. యాత్రికుల రక్షణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్, చీరాల రూరల్ ఎస్.ఐ చంద్రశేఖర్ లకు కృతజ్ఞతలు తెలిపినారు.

## విజయవాడలో జిల్లా గిరిజన భవన్‌కు స్థలం కేటాయించి సత్వరమే నిర్మాణం చేయాలి

**ఎ కొండూరు, జులై 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో గిరిజన భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి గిరిజన భవన్ నిర్మించాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బి గోపిరాజు శుక్రవారం మీడియా సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ జిల్లాలో 1.50 లక్షల మంది గిరిజనులు నివసిస్తున్నారని, గిరిజన్ భవన్ నిర్మాణానికి రూ.1.80 కోటి నిధులు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని గిరిజన భవన్ లేకపోవడంతో



జిల్లా జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీడి విజయవాడ సిటీలో ఖాళీగా ఉన్న స్థలాల కేటాయింపులో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి స్థలం కేటాయించాలని ఈ విషయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ వెంటనే స్పందించి ఈ భవనానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి ఈ సమావేశంలో గోపిరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## శాంసంగ్‌తో కలిసి రేపటి భారతదేశాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తున్న బెంగుళూరు విద్యార్థులు

**విజయవాడ, జులై 25, ప్రభాతవార్త :** శాంసంగ్ సాల్వ్‌ఫర్ టుమారో 14-22 ఏళ్ల యువ మేధావులకు ఒక జాతీయ ఆవిష్కరణ సవాలు ద్వారా, బెంగుళూరులోని క్యాంపస్‌లు భవిష్యత్తు మార్పు కోసం లాంచ్‌ప్యాడ్లుగా మారుతున్నాయని శాంసంగ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఏప్రిల్ 29న ప్రారంభమైన తాజా సీజన్, డిజైన్ థింకింగ్ వర్క్‌షాపులు, ఓపెన్ హోస్ట్ ద్వారా దేశవా ్యప్తంగా విస్తరిస్తుందన్నారు. మొదటి అత్యుత్తమ 4జట్లకు రు.కోటి నజరానా, ప్రోటోటైప్ అభివృద్ధికి మద్దతు అందిస్తోందన్నారు. 3వేల మంది విద్యార్థులకు ఐఐటి ఢిల్లీ ప్రొఫెసర్ల దిశానిర్దేశం, కీలక పెట్టుబడిదారులతో అనుసంధాన అవకాశాలుంటాయన్నారు.

# ఒక్క ఛాన్స్ అన్నోళ్లను నమ్మి ప్రజలు నరకం అనుభవించారు

## సాతులూరు సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల, జులై25, ప్రభాతవార్త:** చంద్రబాబు అనుభవం, అవగాహనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న గట్టి నమ్మకంతో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఉన్నారని, ఒకే ప్రభుత్వం, ఒకే నాయకుడు అధికారంలో ఉంటేప్రజలు ఆర్థికంగా బలపడటంతో



పాటు, రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశంలో బాగంగాగురువారం రాత్రి మండలంలోని సాతులూరు, చందవరం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జోరున వర్షం కురుస్తున్నప్పటికి ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని ప్రత్తిపాటి కొనసాగించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియచేశారు.

**జగన్ తన అవినీతి మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాడు**

ప్రజల సమస్యలు పరిష్కరించి వారికి మేలు చేయాలని చంద్రబాబు తపన పడుతుంటే జగన్ తన అవినీతి మీడియాలో ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఛాన్స్ అని నమ్మి జగన్‌ను గెలిపించినందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అమరావతి,పోలవరం నిర్మాణాలు,రాష్ట్రాభివృద్ధి నిలిచిపోయిందని అన్నారు. ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి,తమ బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రత్తిపాటి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టాన్ని గుర్తించి, అభివృద్ధి కోసం ఆయన పడుతున్న ఆరాటాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని, ఆయనకు అండగా నిలిచి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ప్రత్తిపాటి కోరారు. జగన్ రూ 1000 ఫించన్ ఐదేళ్లకు పెంచితే చంద్రబాబు ఒకేసారి దానిని మరో రూ 1000 పెంచి రూ 4వేలు చేసి ఇచ్చినమాట నిలబెట్టుకున్నాడు ఒక్క సాతులూరు గ్రామంలోనే రూ 47లక్షలు ఫించన్లు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. రూ 1000 ఫించన్ పెంచటానికి జగన్‌కు 5 సంవత్సరాలు పట్టిందని అన్నారు. చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మరో రూ 1000 పెంచి రూ 4వేలు చేసి ఇచ్చినమాట నిలబెట్టుకున్నారని ప్రత్తిపాటి వివరించారు. తల్లికి వందనం సాయం తన నలుగురు బిడ్డలకు ఇచ్చారని సాతులూరు గ్రామంలో ఒక తల్లి చెప్పిందని, ఆమె కళ్లల్లో సంతోషం చూశాక చాలా ఆనందం కలిగిందని అన్నారు. త్వరలోనే అన్నదాతసుఖీభవ కింద రైతులకు రూ 20వేలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందచేయనున్నదని తెలిపారు. ఆగష్టు 15వ తేదినుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలులోకి రానున్నదని, తరువాత నిరుద్యోగ భృతి అందివ్వడంతో ప్రభుత్వ హామీలన్నీ అమలైనట్టేనని ప్రత్తిపాటి తెలిపారు. ఆడబిడ్డ నిధి హామీలు కూడా ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందని, ఆర్థిక సమస్యల వల్ల పి4 ద్వారా అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్‌మోహన్, కందుల రమణ, గట్టినేని రమేష్, ఇనగంటి జగదీష్, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, శోభారాణి, నార్నె కోటయ్యస్వామి, జంపని వసంతరావు, నార్నె శ్రీనివాసరావు, కమ్మ శ్రీనివాసరావు, ఐనవోలు రాధ, బయ్యన శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటి

చిలకలూరిపేట, జులై25, ప్రభాతవార్త: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్‌యార్డ్ కమిటి వైస్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి కోటేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పిల్లి కోటిని సత్కరించి అభినందనలు తెలియచేశారు. పిల్లి కోటి మాట్లాడుతూ తనను యార్డ్ వైస్ చైర్మన్‌గా నియమింపచేసినందుకు మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, వివిధ



హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పాల్గొని పిల్లి కోటికి అభినందనలు తెలియచేశారు.

# విజయలక్ష్మీ జ్యూయలరి 40 వసంతాల పూర్తి కార్యక్రమంలో పాల్గొని అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేటటౌన్, జులై25, ప్రభాతవార్త: పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న విజయలక్ష్మీ జ్యూయలరీ స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం విజయలక్ష్మీ జ్యూయలరీ అధినేత పొట్టి రత్నబాబు ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని శ్రావణమాస మహాసేల్ కౌంటర్‌ను ప్రారంభించారు. రత్నబాబు దంపతులకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్



చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాచుమల్లు బదరీనారాయణ మూర్తి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పెంచిన తండ్రిని చంపిన ముద్దాయికి జీవితఖైదు

**పిడుగురాళ్ల, జూలై 25 ప్రభాతవార్త :** ఆస్థికోసం పెంచిన తండ్రిని హత్య చేసిన ముద్దాయికి జీవిత ఖైదు, రూ. 500 జరిమానా కోర్టు విధించినట్లు ఎస్‌హెచ్‌వో వెంకట్రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన యోహాన్, చిట్టెమ్మ దంపతులకు పిల్లలు లేకపోవడంతో యోహాన్ రెండో తమ్ముడు కుమారుడైన అంబేడ్కర్‌ను చిన్ననాటి నుంచి పెంచుకున్నారు. అంబేడ్కర్ హైదరాబాద్‌లో నివాసముంటూ చెడు వ్యసనాలకు బానిసై గతంలో అరెస్ట్ కాబడి రిమాండ్‌కు వెళ్లారన్నారు. యోహాన్‌కు కాలనీలో సొంత ఇల్లు, దానిపైన అంతస్తుతోపాటు పెంటహైస్ కూడా నిర్మించినట్లు తెలిసిందన్నారు. అయితే అంబేడ్కర్ తనకు ఇల్లు ఇవ్వాలంటూ తనను పెంచిన యోహాను, చిట్టెమ్మ దంపతులతో గొడవ పడడంతో పై అంతస్తును అంబేడ్కర్ భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అయితే ఆస్థి మొత్తం తనకు ఇవ్వాలంటూ గొడవపెట్టుకునే వాడని, ఆ క్రమంలోనే 21 ఫిబ్రవరి 2024న సుమారు ఉదయం 10 గంటల సమయంలో యోహాన్ ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో అంబేడ్కర్ కత్తితో యోహాన్‌ను పొడవడంతో అక్కడికక్కడే యోహాన్ మృతిచెందారన్నారు. దీనిపై అప్పటి ఎస్‌హెచ్‌వో పివి ఆంజనేయులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టుకు చార్జిషీటు దాఖలు చేసినట్లు తెలిపారు. సదరు కేసును విచారించిన పదో అదనపు జడ్జి పి శరత్‌బాబు 302 సెక్షన్‌కు గాను అంబేడ్కర్‌కు జీవిత ఖైదుతోపాటు పదేళ్ల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విదిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌హెచ్ వెంకట్రావు తెలిపారు.

# రూ. 3.69 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## నూతన మున్సిపల్ బిల్డింగ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, జూలై 25 ప్రభాతవార్త:** పిడుగురాళ్ల మున్సిపాలిటీలో రూ. 3.69 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్



కార్యాలయాన్ని శుక్రవారం గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం నాలుగో వార్డులోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. 18వ వార్డు ఐలాండ్ సెంటర్, 15వ వార్డు శ్రీసత్యసాయి మందిరం వద్ద, 21వ వార్డు ఎస్‌టివి ఏటీఎం వద్ద, 24వ వార్డు జమున స్కూల్ రోడ్డు, 28వ వార్డు గుంటూరు బస్టాండ్ వద్ద చింతల వారి బజారు రోడ్డు, 29వ వార్డు మదస్సా రోడ్డు, 27వ వార్డు రజక కాలనీ, 33వ వార్డు ఎస్సీ కాలనీ రోడ్డు, 31వ వార్డు పాతగుంటల, 5వ వార్డు సుందరయ్య కాలనీ రోడ్డు వద్ద నిర్మాణం చేపట్టబోయే రోడ్లకు గాను మొత్తం 3.69 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, గురజాల నియోజకవర్గ పరిశీలకుడు కశ్యం రాజశేఖర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు డాక్టర్ ఉన్నం నాగమల్లేశ్వరరావు, పిడుగురాళ్ల మార్కెట్‌యార్డు చైర్మన్ తురకా వీరస్వామి, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు పిల్లి చెన్నారావు, పెద్దపల్లి సాంబశివరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు పెద్దపల్లి నరేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్, జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎల్ఆర్ వేగవంతం చేయాలి

## తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త:** రీ సర్వేకి సంబంధించిన డిఎల్ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)ను వేగవంతం చేయాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ విఆర్వోలు, గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలో ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొంది. పొన్నూరు మండలంలో వల్లభరావుపాలెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. జనవరి 20వ తేదీన గ్రామంలో రీ సర్వే పనులను ప్రారంభించారు. ఆరు బృందాలుగా ఏర్పడి గ్రామాన్ని 18బ్లాకులుగా విభజించి పనులను ప్రారంభించింది. సుమారు నాలుగైదు నెలలపాటు గ్రామంలోని సిబ్బంది ఉండి పనులను పర్యవేక్షించారు. వల్లభరావుపాలెం గ్రామ పరిధిలో 4240ఎకరాల భూమి ఉంది. 4410మంది ఖాతాదారులు ఉన్నారు. గ్రామంలో పీల్డ్ మీద రీసర్వేకి సంబంధించిన పనులు పూర్తి అయ్యాక విఆర్వో లాగిన్ ద్వారా, సర్వేయర్ లాగిన్ ద్వారా భూములకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయంలో రాత్రనక పగలనక తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ పర్యవేక్షణలో సిబ్బంది ల్యాప్ టాప్‌ల ద్వారా డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిష్టర్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. గతంలో వున్న ఆర్ఎస్ఆర్ స్థానంలో ప్రస్తుతం డిఎల్ఆర్ రాబోతుంది. డిఎల్ఆర్



పూర్తయ్యాక ఎల్‌పిఎంలను తయారు చేసి(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) అందుబాటులో ఉంటారు. సర్వే నెంబర్ల వారీగా ఎల్‌పిఎంలను తయారు చేసి కూటమి ప్రభుత్వం మొత్తం ఆరు టీములు నిర్వహిస్తున్నారు. ఒక్కో టీములో ఒక విఆర్వో, ఇరువురు గ్రామ సర్వేయర్లున్నారు. మొత్తం 18మందితోపాటు సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. ఏది ఏమైనా రీసర్వే పక్కాగా పూర్తి చేయాలనే కసితో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కొత్తదనంతో ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ రాత్రి వేళల్లో కూడా సిబ్బందితో పనిచేయిస్తున్నారు. రీ సర్వే పూర్తి అయితే రైతులకు సంబంధించిన భూ సమస్యలు చాలా వరకు పరిష్కారమయినట్లేనని రెవెన్యూ మేధావులు చెబుతున్నారు.

# తెనాలి జిల్లాగా చేయాలి

## -కాంగ్రెస్ ఇన్‌చార్జి సాంబశివుడు డిమాండ్

**తెనాలి, టౌన్ జులై 25 (ప్రభాతవార్త) :** ప్రభుత్వం నూతన జిల్లాల సర్దుబాటు నూతన జిల్లాల ఏర్పాటువంటి అంశాలు పరిశీలిస్తున్న దృష్ట్యా తెనాలి జిల్లాగా ప్రకటించి జిల్లా కేంద్రాన్ని ఏర్పాటును పరిశీలించాలని, తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ప్రభుత్వాని న్ని డిమాండ్ చేశారు. శుక్రవారం



పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలి జిల్లాగా ఏర్పాటు చేయుటకు కావలసిన అన్ని వసతులు తెనాలికి ఉన్నాయని, భౌగోళికంగా, రాజకీయ పరంగా అన్ని వనరులున్న తెనాలి జిల్లాగా ఏర్పాటు చేసుకోటానికి రాజకీయాలకు అతీతంగా అందరూ సంఘీభావం ప్రకటించాలన్నారు. అంతే కాకుండా తెనాలి నుండి అన్ని ప్రాంతాలకు రోడ్డు, రైల్వే మార్గాల సౌకర్యం ఉందన్నారు. అలాగే విజయవాడ రైల్వే డివిజన్లో విజయవాడ తర్వాత రెండవ పెద్ద రైల్వే జంక్షన్‌తో ఉండటం తెనాలికి కలిసివచ్చే అంశమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగసూర్యశశిధరరావు, ఉపాధ్యక్షుడు గుర్రపు ద్వారక శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్లపూడి బుల్లియ్య, మీడియా కో ఆర్డినేటర్ మాదాల పూర్ణచంద్రరావు, పిల్లి ప్రభాకర్‌రావు, భీమా రమేష్, పి.స్టీవెన్‌బాబు, రాయప్ప, కోటేశ్వరరావు, సుబ్బారావు, కార్తీక్, పూలేరామ్, శంకరరావు, శ్రీను, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

# సొంత నిధులతో కళాకారుడికి మంత్రి నాదెండ్ల ఆర్థిక సహాయం

**తెనాలి, టౌన్ జులై 25 (ప్రభాతవార్త) :** జులై 20వ తేది ఆదివారం, పట్టణంలోని శ్రీ రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన ప్రముఖ హరికథకులు శ్రీనన్నపనేని సాంబశివరావు భాగవతార్ పదవ సంస్మరణ సభ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, తన సొంత నిధులతో ఇరువైమంఇ పేద కళాకారులకి, ఒక్కక్కరికి ఐదు వేల రూపాయలు అందించ



గా అనారోగ్యంతో మంచానికి పరిమితమై నాటి కార్యక్రమానికి రాలేకపోయిన ప్రముఖ వయోలిన్ విధ్వాంసుడు నల్లపాటి కుటుంబ రావుకి, ఇంటికి వెళ్ళి మంత్రి నాదెండ్ల ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని స్వర్గీయ నన్నపనేని సాంబశివరావు కుమారుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు నన్నపనేని రాంబాబు కుటుంబ సభ్యులు, న్యాయ వాది నన్నపనేని వాసంతి, చల్లగాలి శ్రీదేవి, ప్రముఖ హరికథా భాగవతార్ బెజ్జంకి నాగమణి చేతుల మీదుగా అందజేయటం జరిగింది.

# 27న ఫ్లోర్‌బాల్ జిల్లాస్థాయి జట్ల ఎంపిక

**వినుకొండ, జులై25, ప్రభాతవార్త:** ఈ నెల 27న పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాల నందు ఫ్లోర్‌బాల్ అండర్ 14, అండర్ 19 బాల బాలికల జిల్లాస్థాయి జట్ల ఎంపిక చేయడం జరుగుతుందని ఫ్లోర్‌బాల్ పల్నాడు జిల్లా కార్యదర్శి యం. కిషోర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు వచ్చే వారు ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేది ధృవపత్రం తీసుకురావాలని తెలియజేశారు. పూర్తి వివరాలకు సెల్: 8639922978కు సంప్రదించాలని కోరారు.



# ములకలూరులో ఫ్రైడే డ్రైడే

**నూజెండ్ల, జులై25, ప్రభాతవార్త:** మండలంలోని ములకలూరు గ్రామంలో ఫ్రైడే డ్రైడేగా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ



కాలనీలోని ప్రతి ఇంటింటికి తిరిగి మురికి కాలువలు, దోమలు వృద్ధి చెందే ప్రదేశాల్లో అబెట్టు,మలాథిన్ పిచికారి చేశారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పి సుభాని, ఏఎన్‌ఎంలు మహాలక్ష్మి, కుమారి, ఆశా కార్యకర్త మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లి వారి వివాహ వేడుకల్లో డాక్టర్ కోడెల శివరామ్

**ముప్పాళ్ళ (జులై 25ప్రభాతవార్త):** సత్తెనపల్లి నియోజకవర్గం లో ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామ వాస్తవ్యులు చింతపల్లి మరియదాసు, మరియమ్మల కుమారుడు కిషోర్ ఝాన్సీల వివాహానికి



హాజరై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వాసవి కన్యకా పరమేశ్వరి అలంకారం

**సత్తెనపల్లి టౌన్ (జులై 25ప్రభాతవార్త ) :** సత్తెనపల్లి పట్టణంలో ని అమ్మవారు తనను నమ్మిన భక్తులను అనుగ్రహించేటువంటి మాసం శ్రావణ మాసం మొదటి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం లో అమ్మవారికి విశేష కైకర్యం మరియు విశేష అలంకరణ జరిగింది భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు



# 27న అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్, జూలై 25, ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 15సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈ ఆదివారం కిడ్నీ,మూత్ర సంబంధిత వ్యాధులపై సభ నిర్వహించబడుతుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. జూలై 27 ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభకు ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ వి.వెంకట నాయుడు ప్రధానవక్తగా ప్రసంగిస్తారన్నారు .ఆరోగ్యాభిలాషులందరూ ఈ సభకు హాజరు కావాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# శ్రావణ మాసం తొలి శుక్రవారంతో కిటకిట లాడిన దేవాలయాలు

**యడ్లపాడు, జులై 25, ప్రభాతవార్త :** పౌర్ణమి తిది రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు యొక్క జన్మ నక్షత్రం కూడా శ్రవణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా భావిస్తారు. దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం, లక్ష్మీదేవి



ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పెద్దలు తెలుపుతారు. తిధులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసంన ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఇందులోభాగంగానే మండలంలోని పల గ్రామాలలోని అమ్మవార్ల దేవాలయాలలో భక్తులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని శ్రీ పార్వతీ దేవి అమ్మవారికి ఉదయం నుండి భక్తులు భారీగా విచ్చేసి అమ్మవారిని ధర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పాఠశాలలను పరిశీలించిన మండల ప్రత్యేకాధికారి

**యడ్లపాడు, జులై 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగారావుపాలెం, బోయపాలెం, సొలస



గ్రామాలలోని పాఠశాలలను మండల ప్రత్యేకాధికారి ఎ బాలసుబ్రమణ్యం శుక్రవారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. లింగారావుపాలెం గ్రామంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలను, యంపిపి స్కూల్ పరిశీలించారు. విద్యార్ధుల విద్యాప్రమాణాలు బట్టి షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌గా విభజించి బోధించడాన్ని ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. యంపియూపి మెయిన్ సొలస పాఠశాలను సందర్శించారు. విద్యార్ధులు బోధనా విధానాన్ని వారు ఏవిధంగా అర్ధంచేసుకుటుంది అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం బోయపాలెం గ్రామంలోని వేద పాఠశాలను పరిశీలించి తగు సూచనలు అందజేసారు. పాఠశాల అవరణలో ఉన్న పర్దీనియం మొక్కలను తొలగించవలసినదిగా కోరారు. అందుకు మండల ఎన్‌అర్‌జిఎస్ సిబ్బంది సహకారం అందజేస్దామని ఎంపీడివో వి హేమలతాదేవి తెలిపారు. అయనతోపాటు మండల ఎంఇవో ఒన్ నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

# రవికిరణ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది : ఎమ్మెల్యే ఆనందబాబు

**తెనాలి, టౌన్ జులై 25 (ప్రభాతవార్త) :** గత ప్రభుత్వంలో అత్యంత పాశవికంగా హత్యకు గురైన నూతక్కి రవికిరణ్ కుటుంబ సభ్యులకు టిడిపి ప్రభుత్వం అండగా నిలుస్తుందని వేమూరు



నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ ఎస్ఎన్ఆర్ కార్యాలయంలో తేదేపా రాష్ట్ర నాయకులు సుద్దపల్లి నాగరాజు సహకారంతో హత్యకు గురైన రవికిరణ్ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం నక్కా ఆనందబాబు అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హత్య చేయబడ్డ రవికిరణ్ శం ఆనవాళ్ళు ఇప్పటి వరకూ లభ్యమవ్వకపోవడం శోచనీయమన్నారు. చట్టాలను తమ చేతుల్లోకి తీసుకున్న వైసిపి ప్రభుత్వం రౌడీయిజాన్ని ప్రోత్సహించిందన్నారు. తన సొంత నియోజకవర్గమైన మూల్పూరు గ్రామస్తుడు నూతక్కి రవికిరణ్‌పై జరిపిన హత్యకేసుపై పోలీసులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఆనాడు వైసిపి సృష్టించిన మారణహోమానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా తేదేపా రాష్ట్ర నాయకులు మాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు మాట్లాడుతూ ఆనవాళ్ళు కూడా లభించకుండా జరిపిన హత్యోదంతంలో దోషులకు కఠిన శిక్ష అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రవికిరణ్ కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి మోహన్, కొండమూది బోస్, కొలకలూరి కిరణ్, కొక్కిలిగడ్డ సునీల్, ఆనే రవీంద్ర, రావూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగలూరు పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం

**ఈపూరు, జులై25, ప్రభాతవార్త:** మండలంలోని అంగలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి చీఫ్‌విప్,ఎమ్మెల్యే



జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెనలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన పాలకవర్గం సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో పీఏసీఎస్‌లు నిర్వీర్యమయ్యాయన్నారు. కూటమి పాలనలో రైతులకు సకాలంలో సేవలు అందించేందుకు నూతన కమిటీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొంజేటి నాగశ్రీను రాయల్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారం

**వినుకొండ, జులై25, ప్రభాతవార్త:** పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీఫ్‌విప్,ఎమ్మెల్యే



జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,మున్సిపల్ ఛైర్మన్ షకీలా దస్తగిరి,జనసేన నాయకులు నాగశ్రీనురాయల్‌లు హాజరయ్యారు. జీ.వీ నూతన కమిటీ సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా నూతన కమిటీ కృషి చేయాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఛైర్మన్‌గా చిలంకూరి వెంకట కోటేశ్వరరావు,సభ్యులుగా భాగవతుల రవికుమార్,ఖజ్జాయం విజయలక్ష్మి సుబ్బారావు,కొంజేటి లక్ష్మణరావు,రామయ్య,పాలడుగు శ్రీను,దూల్ల సుజాత,లక్ష్మి నాగరాజు,లక్ష్మీబాయి,నారాయణ ఆనందాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు.

# గార్లపాడు గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ

కాకుమాను జులై 25(ప్రభాత వార్త)మండల పరిధి గార్లపాడు గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ప్రత్తిపాడు



నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో చోటుచేసుకుంటున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా తీసుకోవాలని తెలిపారు. త్వరలో ప్రతి వార్డులో "గడప గడపకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజలెదుట చంద్రబాబు పాలనలో జరిగిన మోసాలను తెలియజేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రతి కార్యకర్త ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, మోసం చేసిన పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వైసీపీ కార్యకర్తలు అందరు బాబు షూరిటి మోసం గ్యారంటీ ప్లాప్లేట్ ను ప్రతి గ్రామానికి వెళ్లి 14 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరించి, వైసీపీ ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి పథకాల్లో ఉన్న తేడాలని వివరించాలని బాలసాని.కిరణ్ కుమార్ కార్యకర్తలకు మరియు నాయకులకు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో కాకుమాను మండల పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి రవికుమార్, మాజీ కన్వీనర్ శివరామకృష్ణ, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మండల పరిధిలో గల అన్ని గ్రామాల వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మిలకు శ్రావణ మాస సారె సమర్పణ

**నకరికల్లు, జూలై 25 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎన్జీవో కాలనీలో వేంచేసియున్న అష్టలక్ష్మి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి సారెను భక్తులు సమర్పించారు. ఈ సందర్భంగా శివస్వామిజీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 36 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించడం జరిగిందని వారు తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అమ్మవారి దీవెనలు పుష్కలంగా అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యక్కల సుజాత, వాసవి మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

# అనాథలైన చిన్నారులను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, జులై 25 ప్రభాతవార్త :** అనాథలైన చిన్నారులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం దత్తత తీసుకున్నారు. ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీవైష్ణవి, వెంకటశివరామ్ అనే చిన్నారులకు తల్లిదండ్రులు వెంకట్రావు, లక్ష్మిలు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. నాయనమ్మ వెంకాయమ్మ దగ్గర వారు తల దాచుకొని చదువుకుంటున్నారు. ఆసరాగా ఉన్న నాయనమ్మ వెంకాయమ్మ శుక్రవారం కనుమూశారు. దీంతో చిన్నారులు



ఎవరూ లేని అనాథలుగా మిగిలిపోయారు. వార్డులోని స్థానికులు విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ఆ చిన్నారులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వారి చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని తెలిపారు. భవిష్యత్తులోనూ వారి అవసరాలకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలియజేశారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలి : వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, జులై 25,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలంతా ఏకమై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని



వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జూపూడి, గోళ్ళమూడిపాడు, వెల్లలూరు తదితర గ్రామాల్లో జరిగిన బాబు షూరిటీ....మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను, నెరవేర్చని తీరును ప్రజల్లోకి తీసుకెళ్లారు. చంద్రబాబునాయుడు ఎప్పుడూ ప్రజలను నమ్మించి మోసం చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ హామీలను అమలు చేయకపోవగా, ప్రశ్నించిన నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై కేసులు నమోదు చేసి వేధిస్తున్నారు. అమలు చేసిన ఉచిత గ్యాస్, తల్లికి వందనం కూడా అరకొరగా మాత్రమే అమలు చేశారన్నారు. చాలా మంది అర్హులున్నప్పటికీ వారికి ఎవరికి ఈ పథకాల లబ్ధి చేకూరలేదన్నారు. క్యూఆర్‌కోడ్‌తో కూడిన చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో చంద్రబాబు ప్రజలను వంచనకు గురి చేశారన్నారు. ఈకార్యక్రమంలో ఆకుల వెంకటేశ్వం రావు, చింతలపూడి మురళీకృష్ణ, చిర్ర అక్కిరెడ్డి, మౌలాలి, మరియరాణి, ప్రసాద్, సత్యం, వేల్పూరి వెంకటేశ్వరమ్మ, వేల్పూరి శివశంకర్, కగ్గా వేమారావు, కంకిపాటి ప్రభుదాసు, కంకిపాటి ఆదాం, మోపర్తి విజయరాజు, మోపర్తి నాగబాబు, తిరుపతయ్య, దేవరకొండ గోపి, అంగిరేకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఇంటికి వెళ్లినా..ఏ గడప తట్టినా తల్లుల కళ్లలో ఆనందం : మంత్రి జనార్ధన్‌రెడ్డి

**మాచర్ల, జులై 25 ప్రభాతవార్త:** నేడు ఏ ఇంటికి వెళ్లినా.. ఏ గడప తట్టినా తల్లుల కళ్లల్లో ఆనందం, మొహంలో చిరునవ్వు కనిపిస్తుందని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నేడు కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి సుపరిపాలనలో తొలి అడుగులు కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం పడిందని తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ, ఎస్సీ కుటుంబాల్లో ఇద్దరు కంటే ఎక్కువమంది పిల్లలున్న తల్లుల సంతోషానికి అవధుల్లేవన్నారు. పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారని అవ్వతాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేడు ఒకటో తేదీనే ఇంటి వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది పింఛను అందిస్తున్నారన్నారు. ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు.

రాజకీయ ఉనికి కోసం, కరపత్రికను అడ్డం పెట్టుకుని జగన్ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ, రౌడీలను, గంజాయి స్మగ్లర్లు, భూకబ్జాదారులను ప్రోత్సహిస్తూ రౌడీ పాలన రావాలని కోరుకుంటున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమం, అభివృద్ధి బటన్‌లు నవ్వంగా నొక్కి ఉంటే 151లో 5 ఎగిరిపోయి 11 ఎందుకు మిగిలిందో ఆలోచించుకోవాలని ఎద్దేవా చేశారు. అయిదేళ్లు ప్రజలు, నాయకులను పట్టించుకోని జగన్‌మోహన్‌రెడ్డి ఏడాది దాటకుండానే ఫ్రస్ట్రేషన్‌తో రోడ్లమీదకు వస్తున్నారన్నారు. వైసీపీని ప్రజలు ఛీకొట్టి తిరస్కరిస్తే 164 సీట్లతో కూటమిని ఆశీర్వదిస్తే తాము బాధ్యతతో పాలన చేస్తున్నామన్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదన్నారు. 11 సీట్లు ఇస్తే ప్రజల సొమ్ము జీతాలుగా తీసుకుంటూ అసెంబ్లీకి రాని అసమర్థులని ఎద్దేవా చేశారు.



మాచర్ల నియోజకవర్గం గురించి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో కక్షలు, కార్పణ్యాలకు వైసీపీ ఆజ్యం పోస్తుందన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా అరాచక పాలన సాగింది. సామాన్యంగా మారుమూల ప్రాంతాల్లో సైతం లేని దుర్మార్గాలు ఇక్కడ చోటు చేసుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి నేడు ఎక్కడ ఉన్నాడన్నారు, ఎక్కడికి పారిపోయారు. నాడు అధికారంలో ఉండగా చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. టీడీపీలో ఎంతమంది చంద్రయ్యలు చనిపోయినా, మళ్లీ అంతకుమించి టీడీపీని కాపాడటానికి చంద్రయ్యలు పుట్టుకొస్తారన్నారు. ప్రజలను అరాచకాలతో ఎక్కువకాలం భయపెట్టలేరు. గత 20 ఏళ్లలో మాచర్ల పట్టణంలో కనీసం రోడ్లు కూడా లేవని ప్రజలు వాపోతున్నారు. గతంలో నరకం చూశాం.. రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేడు టీడీపీ కార్యకర్తలకు నాయకులకు కక్ష సాధింపులు చేతకాక కాదు, మా నాయకుడు అడుగుజాడల్లో నడుస్తున్నామనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉండగా బ్రహ్మానందరెడ్డిపై పిన్నెల్లి అనేక అరాచకాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు.

నేడు మిథున్‌రెడ్డి అరెస్టును చూసి పెద్దిరెడ్డి తండ్రిగా కక్ష సాధింపులకు పాల్పడుతున్నారంటున్నారు. నాడు 72 ఏళ్ల వయసులో ఏ పాపం తెలియని ఏ సంబంధంలేని చంద్రబాబునాయుడిని 53 రోజులు జైల్లో పెట్టినప్పుడు మీకు పాపమని తెలియదా? అని ప్రశ్నించారు. సంపూర్ణ మద్య నిషేధం అని చెప్పి ప్రజలను మభ్యపెట్టి, నకిలీ కల్తీ బ్రాండ్లు అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని ఎద్దేవ చేశారు.

# పొన్నూరురూరల్ సర్కిల్‌కు ఇరువురు ఎస్సైలు

**పొన్నూరు, జులై 25,ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోంటోందని పొన్నూరు రూరల్ సిఐ యాదల కోటేశ్వరరావు తెలిపారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.



సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. పొన్నూరు రూరల్ సర్కిల్‌కు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నూతనంగా ఎంపికైన 2024బ్యాచ్‌కు చెందిన ఇరువురు ఎస్సైలను కేటాయించినట్లు చెప్పారు. వీరిలో పొన్నూరు రూరల్‌కు ఎ.లక్ష్మీ, చేబ్రోలుకు కె.ఈశ్వరరావులను కేటాయించినట్లు చెప్పారు. నూతనంగా ఎంపికైన ఇరవురు ఎస్సైలు వారి కేటాయించిన స్టేషన్లలో ఫీల్డ్ వర్క్‌లో పాల్గొంటారన్నారు. వీరు ఐదు నెలల పాటు కొనసాగుతారన్నారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తీసుకొంటామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా, వినియోగం వంటి చట్ట రీత్యా నేరమన్నారు.మరీ ముఖ్యంగా యువత వీటికి అలవాటుపడుతున్నట్లు తమ దృష్టికి వస్తుందన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సిఐ కోటేశ్వరరావు హెచ్చరించారు.

# రైలు పట్టాలు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఫిరంగిపురం, జులై 25 ప్రభాతార్త :** రైలు పట్టాలు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం నరసరావుపేట పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే ఓవర్‌బ్రిడ్జి సమీపంలో ఈ సంఘటన జరిగింది. రైలు పట్టాలు ప్రక్కన మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన సమాచారం స్థానికులకు, పోలీసులకు తెలియరాలేదు. మృతుడు తెలుగురంగు నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని సమాచారం కోసం రైల్వే ఎస్.ఐ. 9440438256 నెంబర్‌ను స ంప్రదించాలని పోలీసులు కోరారు.

# ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి

**ఫిరంగిపురం, జులై 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన నకరికల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి శుక్రవారం సందర్శించారు. ఈ సమయంలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశాలిచ్చారు. అదే విధంగా విద్యార్థుల బోధన పట్ల తగిన శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఎంపిడివో కాశయ్య, డిప్యూటీ ఎంపిడివో ప్రసాద్, కార్యాలయ సిబ్బంది కరిముల్లా, ఉపాధ్యాయులు బికునాయక్, వెంకటేశ్వర్లు, కనకారావు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

# విద్యార్థి కేంద్రీకృత విద్యాబోధన జరగాలి

## -మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

**పొన్నూరు, జులై 25,ప్రభాతవార్త:** తరగతి గదిలో విద్యార్థి కేంద్రీకృత విద్యాబోధన జరగాలని, ఉపాధ్యాయుడే విద్యార్థికి లక్ష్యం నిర్ధేశకుడిగా




వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సూచించారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(స్ప్లోట్) ఆధ్వర్యంలో ఏటి అగ్రహారంలోని జీకెఆర్ హైస్కూల్లో శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయునికి ఉండవలసిన లక్షణాలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయుడు ఎక్కడైనా గుర్తింపు పొందుతారన్నారు. ఉపాధ్యాయులువిద్యార్థులకు నిర్ధేశకులుగా ఉండి వారిని ముందుకు నడిపించాల్సి ఉందన్నారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసే గురువులు విద్యార్థుల మనస్సులో సుస్థిర స్థానాన్ని సంపాదిస్తారన్నారు. విద్యార్థులు గురువులను అనుకరిస్తారన్నారు. అందుకే ఉపాధ్యాయులు క్రమశిక్షణ, చక్కటి భాష ఉపయోగించడం, విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేవిధంగా చూడాలన్నారు. ఎడ్యుకేషనల్ టీచర్ రీసెర్చ్ కౌన్సిలింగ్ సెంటర్ డైరెక్టర్,ప్రొఫెసర్ కె.రామశేషాద్రిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మనో విజ్ఞాన నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. విద్యార్థియొక్క మానసిక స్థితిని గుర్తించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ జనార్ధనరెడ్డి, స్ప్లోట్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, కార్యదర్శి ఎం.రాకేష్, కావూరి గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

# దేచవరం మోడల్ స్కూల్‌లో తనిఖీలు

**ఫిరంగిపురం,జులై 25 ప్రభాతవార్త :** నకరికల్లు మండలంలోని దేచవరం మోడల్‌స్కూల్‌ను శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు. మండల ప్రత్యేక అధికారిణి ఝాన్సీరాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రకళ పాఠశాలను సందర్శించారు. మోడల్‌స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. సెలవుల గురించి ఆరా తీశారు. తరగతి గదులను సందర్శించి చిన్నారుల చదువు గురించి మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తయారీకి వినియోగించే కూరగాయలు, బియ్యం, ఇతర వస్తువుల నాణ్యతను ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో ప్రసాద్, కార్యాలయ సిబ్బంది కనకారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ప్రచారం


**ఫిరంగిపురం,జులై 25 ప్రభాతవార్త :** సిపిఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని చిత్రాలయ సెంటర్‌లో



జిల్లా మహాసభకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. నాయకులు కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, జాన్‌సైదా, చక్రవరం సత్యనారాయణ, అంజిరెడ్డి, నాగేశ్వరరావు, సుబ్బారావు, రాజు పాల్గొని మాట్లాడారు. మహాసభలు వినుకొండలో ఆగస్టు 7,8,9 తేదీలలో జరుగుతాయన్నారు. ఈ సభలకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, మారుతీవరప్రసాద్ హాజరౌతారని తెలిపారు. ప్రజల కోసం పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ అని తెలిపారు.

# శతావధానానికి పృచ్ఛకులుగా సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థులు

**పొన్నూరు, జులై 25,ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో శృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న



25వ శతావధానానికి పట్టణంలోని శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థులు పృచ్ఛకులుగా వెళ్ళారు. త్రిభాషా మహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ 25వ శతావధానంలో పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పబోతున్నారు. సంస్కృత కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఎం.కృష్ణకిషోర్, అగ్నిహోత్రం శ్రీనివాసమారుతి, నిమ్మరాజు శ్రీనివాసమూర్తి, అవధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, దుర్భా కౌండిన్య శాయి, భువనగిరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలలో తనిఖీలు

**సత్తెనపల్లి, జులై 25 ప్రభాతవార్త :** విత్తన దుకాణాలలో తనిఖీలను శుక్రవారం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు తనిఖీలలో పాల్గొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. లాట్ నెంబర్ సరిగా ఉందో లేదో సరి చూసుకోవాలన్నారు. ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు



చేయాలన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కంపెనీ పేరు లేని ప్యాకెట్లలో విత్తనాలు అమ్మకం జరిపితే కొనుగోలు చేయవద్దన్నారు. అట్టి వారి సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# హిందూ మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎండోమెంట్ అధికారుల ధోరణి ఉంది

**అమరావతి, జులై 25 ప్రభాతవార్త :** హిందూ మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎండోమెంట్ అధికారుల ధోరణి ఉందని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరావు అన్నారు. రామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేవలం తూతూమంత్రంగా అక్కడ దేవాలయాన్ని పరిశుభ్రం చేస్తున్నారని తెలిపారు. ఆలయానికి సంబంధించిన షాపులలో చికెన్ ఫ్రైడ్ రైస్ వంటివి, కోడిగుడ్డుకు సంబంధించిన వంటకాలను తయారు చేస్తూ అపచారం చేస్తున్నారన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని చెప్తూనే



అధికారులు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇటువంటి నిర్లక్ష్యాన్ని వీడాలని మండల పార్టీ అధ్యక్షులు మేకల వెంకటేశ్వరరావు కోరారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ సమస్యను పరిష్కరించే వరకు పోరాడుతామని మేకల వెంకటేశ్వరరావు తెలియజేశారు.

# హైవే రోడ్లకు ఇరువైపులా హరిత తోరణం

**మాచర్ల, జులై 25 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండల కేంద్రంలోని హైవే, హైవేను కలిపే లింకు రోడ్లకు ఇరువైపులా హరిత తోరణం-2025 నామకరణంతో దాదాపు 3



కి.మీ. మేరా సుమారు 3 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏపీ రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సందర్భంగా హరిత తోరణం-2025లో భాగంగా హైవే రోడ్లకు ఇరువైపులా మామిడి, నేరేడు, పనస, జువ్వి, మర్రిఇ, రాగి తదితర మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుర్రి శివారెడ్డి, జూలకంటి చిరంజీవిరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, కేశినేని హనిమిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిమ్స్ కాలేజి ఆఫ్ ఫిజియోథెరఫీ సైన్ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం

**గుంటూరు విద్య,జులై 25,ప్రభాతవార్త :** సిమ్స్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరఫీ మరియు ఐఐటి బాంబే-సొసైటీ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సైన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.దీనికి సంబంధించి అవగాహన దస్త్రంపై సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ డాక్టర్ బి.శివ శిరీష,సైన్ సిఈవో పాజీ వర్గీస్ సంతకాలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.శివ శిరీష మాట్లాడుతూ ప్రఖ్యాతి గాంచిన ఐఐటి బాంబే – సైన్‌తో అవగాహన ఒప్పందం కుదరడం చాలా సంతోషకరమైన విషయమన్నారు.దీంతో తమ కాలేజి విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తమన్నారు.విద్యార్థులు ఐఐటి బాంబే కి వెళ్ళి అక్కడ ఉన్నటువంటి రకరకాల హెల్త్ కేర్ స్టార్టప్ కంపెనీలతో కలసి పనిచేస్తూ,రకరకాల అంశాలపై శిక్షణ పొందుతూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.విద్యార్థుల మదిలో స్ఫురించిన ఒక ఆలోచన స్టార్టప్ కంపెనీలతో మేధోమథనం చేసి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.మానసికమైన,శారీరకమైన అననుకూలతలు ఉన్న రోగులకు లేటెస్ట్ టెక్నాలజీ ఉపయోగించి రీహాబిలిటేషన్ థెరఫీ చేసే విధంగా పరిశోధనలు జరుగుతాయని చెప్పారు.ఈ అవగాహన ఒప్పందానికి సిమ్స్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిస్టి కిరణ్ గొట్రు,సైన్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రణీత కోఆర్డినేటర్స్ గా ఉంటారని తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు .భవిష్యత్తులో సిమ్స్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాల మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఎస్సీ కమీషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అభినందన సభను విజయవంతం చేయండి

**గుంటూరు విద్య,జులై 25,ప్రభాతవార్త :** స్థానిక ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఈనెల 27వ తేదన ఎస్సీ కమీషన్ చైర్మన్ కొత్తపల్లి శ్యామ్యూల్ జవహర్ సన్మాన కార్యక్రమం జరగనుందని,కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘ నాయకులు మేడిద బాబురావు,దళిత సంఘాల నాయకులు దళిత ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.మేడిద బాబురావు మాట్లాడుతూ 27వ తేది జరిగే సన్మాన కార్యక్రమాన్ని అందరూ కలసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 59కులాల వారు వారి సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురావడం కోసం అలానే చైర్మన్ సన్మానం జయప్రదం చేయడం కోసం తమవంతు బాధ్యతగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ కమ్యూనిటి కి చెందినవారు తరలి రావాలని పిలుపునిచ్చారు.మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని దళిత సంఘాలు,ఉద్యోగసంఘాలు పాల్గొంటాయని రాజకీయాలకు,కుల,మతాలకు అతీతంగా దళితుల్లోని 59కులాలు సమిష్టిగా కార్యక్రమం జరుపుతున్నామని కావున దళితులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లపు నీలాంబరం,కుక్కమళ్ళ సంజీవరావు, బత్తుల వీరాస్వామి,డాక్టర్ కర్రా హానోక్ బెంజిమెన్,బత్తుల అనిల్,గుడిపూడి రమేష్,చింతల రవికుమార్,డేవిడ్ విలియమ్స్,వినయ్ తదితరులు ఉన్నారు.

# మాచర్లలో రైతు శిక్షణా కేంద్రం

**మాచర్ల, జులై 25 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం జరిగింది. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.అరుణ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం ప్రణామ్‌లో భాగంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ, జీవన ఎరువులను వాడితే నేలకు అనుకూలంగా ఉంటుందని, దీనివల్ల సూక్ష్మ పోషకాలు, మొక్కలకు అందడంతోపాటు నేలలోని భాస్వరం మొక్కలకు చేరి




ఎండు తెగుళ్ల రాకుండా ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి మాట్లాడుతూ రైతులు పత్తి పంటలో బోర్డర్ క్రాప్‌గా జొన్న, మొక్కజొన్న పైరును ఒక వరుసలో నాటుకుంటే రసం పీల్చే పురుగుల బారి నుంచి పత్తి పంటను కాపాడుకోవచ్చన్నారు. మెట్ట పైరును వేసే ముందు పచ్చిరొట్ట పైరును సాగు చేస్తే భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం.మార్కండేయులు, జి.ప్రతాప్‌కుమార్, అంజినాయక్, మాచర్ల మండల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సీపీఐ పల్నాడు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

**మాచర్ల, జులై 25 ప్రభాతవార్త:** ఆగస్టు 7, 8 తేదీల్లో నరసరావుపేటలో జరగనున్న పల్నాడు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కొమెర వీరస్వామి భవన్‌లో శుక్రవారం మహాసభల గోడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. పేద మధ్య తరగతి కుటుంబాల సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా ఉన్నాయన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. సుభిక్ష పాలన కమ్యూనిస్టు పార్టీతోనే సాధ్యమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్న మహాసభలకు కార్మికులు, అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెంటచింతల, మాచర్ల మండల కార్యదరుశ్శులు కేతావత్ రంగనాయకులు, మిద్దెపోగు బాబురావు, బ్రహ్మచారి, బత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**కర్లపాలెం, జులై 25, ప్రభాతవార్త:** సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి



వాటిని ఇప్పుడు నెరవేర్చలేక రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు నిట్ట నిలువునా మోసం చేస్తున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ వైసిపి ఇన్చార్జ్ కోన రఘుపతి ఆరోపించారు కర్లపాలెం మండలం పెరలి, పెద గొల్లపాలెం గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికి నీకు 15000 నీకు 15000 అని విచ్చలవిడిగా ప్రచారం చేసుకుని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని తెలుగుదేశం మంత్రులు వ్యాఖ్యానించటం దౌర్భాగ్యం అన్నారు హామీలు ఇచ్చేటప్పుడు తెలియదా అసలు వీటిని అమలు చేయగలమా లేదు అని ఆయన ప్రశ్నించారు తల్లికి వందనం ఒక సంవత్సరం ఎగ్గొట్టారని ఎటువంటి కోతలు లేకుండా 15000 ఇస్తానని 13000 ఇచ్చారన్నారు అన్నదాత సుఖీభవ అనే పథకం పై ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదని ఆయన విమర్శించారు అనంతరం మహిళలకు సూపర్ సిక్స్ లో భాగంగా వాళ్ళు ఇచ్చిన హామీలలో ఒక సంవత్సర కాలంలోనే ఎంత నష్టపోయారు అనే విషయాన్ని ఆయన వారికి వివరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల ఆదాం ఎంపీపీ వనజ వైస్ ఎంపీపీలు సుబ్బారావు బుల్లియ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీతారామరెడ్డి మండల కన్వీనర్ ఏడుకొండలు మైనార్టీ కార్యదర్శి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జయ భారత రెడ్డి మండల యూత్ కన్వీనర్ సాగర్ సర్పంచ్ భాను ప్రసాద్, సర్పంచ్ నాని, నాయకులు గిరి, శ్రీనివాస్ రెడ్డి ఆట్ల నాగేశ్వర్ రెడ్డి, ధర్మేంద్ర అర్జున్ రెడ్డి. వైసీపీ కొండలు, ప్యార్లీ ఇమాన్యుల్. జోగి బెనర్జీ. మార్పు బెనర్జీ .మార్పు రత్నం తదితరులు పాల్గొన్నారు

# అక్రమ లావాదేవీలకు నిలువెత్తు సాక్ష్యం "కుబేరా" కుంభకోణం

**గుంటూరు కల్చరల్,జులై 25,ప్రభాతవార్త :** నిరుపేదలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి బ్యాంకు నుంచి కోట్లు కొల్లగొట్టిన కుబేరా చిత్రం తరహా మోసం నిజంగానే జరగటం,దానికి ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు కేంద్రం కావడం దిగ్భ్రాంతికరమని నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో బ్యాంకులను దోచుకొనే స్కీమ్‌లు,సా ్కమ్‌లు వెల్లువెత్తుతున్నాయన్న దానికి ప్రత్యక్ష సాక్ష్యమే ఈ నెల్లూరు యాక్సి బ్యాంక్ కుంభకోణమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.కుబేరా చిత్రంలో బిచ్చగాళ్ళను మోసగించినట్లు చూపితేఉ ఈ స్కామ్‌లో దళితులు,గిరిజనులు,ఇతర అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్నారని అధికారంలోఉన్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు,కొందరు పెద్దలు అందిస్తున్న అండదండలు ఈ తరహా ఆర్థిక నేరాలకు కారణమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.

# తెర

## కూలీ చాలా స్పెషల్



సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న కూలీ చిత్రంపై అంచనాలు పెరిగిపోయాయి. ఈ సినిమాలో నాగార్జున మెయిన్ విలన్‌గా నటిస్తున్నారు. ఆయన పాత్ర చాలా అద్భుతంగా ఉంటుందని శ్రుతి హాసన్ తెలిపారు. నాగార్జున నెగెటివ్ రోల్‌లో ఫెంటాస్టిక్‌గా నటించారని, ఆయనకు అందరూ సూపర్ ఫ్యాన్స్ అయిపోతారని ఆమె అన్నారు. ఈ మూవీలో నాగ్ చాలా కూల్‌గా కనిపిస్తారని శ్రుతి పేర్కొన్నారు.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, షౌబిన్ సాహిర్, సత్యరాజ్, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ క్యామియో చేయగా.. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారు. తాజాగా శ్రుతి హాసన్ ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. నాగ్ పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. కూలీ సినిమాలో నాగార్జున మెయిన్ విలన్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని లోకేష్ కనగరాజ్ ఇదివరకే కన్ఫార్మ్ చేశారు. ఇప్పుడు శ్రుతి హాసన్ దీనిపై మాట్లాడుతూ.. ఆ పాత్రలో నాగ్ అద్భుతంగా నటించారని తెలిపారు. ఈ సినిమాతో ఆయనకు అందరూ సూపర్ ఫ్యాన్స్‌గా మారిపోయామని చెప్పారు. ఖీనాగార్జున గారితో నాకు ఈ సినిమా కంటే ముందు నుంచే పరిచయముంది. ఆయన ఎల్లప్పుడూ ఛార్మింగ్ గా, వండర్ ఫుల్ గా ఉంటారు. ఈ మూవీలో ఆయనతో వర్క్ చేయడం ఎక్స్ట్రా స్పెషల్. ఎందుకంటే నాగ్ సార్ కి ఇది ఫస్ట్ నెగెటివ్ క్యారక్టర్. ఆయన ఆ పాత్రలో ఫెంటాస్టిక్‌గా నటించారు. నేను ఎప్పుడూ ఆయనకి అభిమానినే. కానీ ఇప్పుడు మేము సూపర్ ఫ్యాన్స్ అయిపోయాం. మీరు కనీసం ఊహించను కూడా ఊహించలేరు. అది మాత్రం చెప్పగలను. సినిమాలో ఆయన చాలా కూల్ గా కనిపిస్తారు అని శ్రుతి అన్నారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## బాలీవుడ్ బ్యూటీతో బాస్ డ్యాన్స్

మెగా కంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ విశ్వంభరఅప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మేకర్స్ మూవీ నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ పంచుకున్నారు. షూటింగ్ చివరి షెడ్యూల్ ప్రారంభమైనట్లు తెలిపారు. అంతేకాదు ఈ షెడ్యూల్‌లో బాస్ ఫ్యాన్స్‌కి కిక్కెకించే ఒక స్పెషల్ సాంగ్ షూట్ చేస్తున్నట్లు తెలియజేస్తూ ఫొటోను షేర్ చేశారు. ఈ ఫొటోలో లేడీ డాన్సర్స్ అంతా కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్‌లో కనిపిస్తుండగా.. కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్, డైరెక్టర్ వశిష్ఠ మానిటర్‌లో చూస్తూ ఉన్నారు. మెగాస్టార్ బ్యాక్ సైడ్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. అయితే విశ్వంభరలో ఒక స్పెషల్ నెంబర్ ఉండబోతుందని ఇప్పటికే వార్తలు వినిపించారు. ఇప్పుడు ఈ ఫొటోలతో అది నిజమేనని అర్థమవుతోంది. ఈ సాంగ్‌లో బాలీవుడ్ బ్యూటీ మోనీ రాయ్ మెగాస్టార్ జోడీగా స్టెప్పులేయనున్నట్లు తెలుస్తోంది. మోని రాయ్ స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, ఆమెకున్న క్రేజ్ సినిమాకు ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు.

సోషియో ఫాంటసీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో వీఎఫెక్స్ ప్రధాన ఆకర్షణగా నిల్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే విడుదలైన టీజర్‌లో గ్రాఫిక్స్ నాసిరకంగా ఉన్నాయని విమర్శలు రావడంతో.. నిర్మాతలు వీఎఫెక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహిస్తున్నారు. ప్రేక్షకులకు మంచి అనుభవాన్ని అందించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో కలిసి పనిచేస్తున్నారు. దీని కారణంగానే విడుదల కూడా ఆలస్యమవుతూ వస్తుందని టాక్. ఈ సినిమాలో మెగాస్టార్ సరసన



త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తోంది. దాదాపు 18 ఏళ్ల గ్యాప్ తర్వాత మళ్ళీ చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ పై కనిపించబోతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విశ్వంభరను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఒకేరోజు 15 సినిమాలు



మూవీ మొఘల్ డాక్టర్ డి.రామానాయుడు తర్వాత అత్యధిక చిత్రాలు నిర్మించిన వ్యక్తిగా, శతాధిక చిత్ర నిర్మాతల్లో రెండవ వాడిగా ఘనతకెక్కిన భీమవరం టాకీస్ అధినేత తుమ్మలపల్లి రామసత్యనారాయణ... ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 15 చిత్రాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రపంచ రికార్డుగా నమోదు కానున్న ఈ చారిత్రక ఘట్టానికి హైద్రాబాద్ లోని సారధి స్టూడియో వేదిక కానుంది. సినిమా రంగంతోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ప్రపంచ రికార్డుకు ప్రత్యక్ష సాక్షులు కానున్నారు. మన భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఈ అరుదైన ఘట్టం శ్రీకారం చుట్టుకోనుంది.

## ఆయన వల్లే నేను ఈ స్థానంలో ఉన్నా



యంగ్ హీరో నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ఖీమేఘాలు చెప్పిన ప్రేమ కథఖీలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. చిత్రంలో రబియా ఖతూన్ కథానాయిక. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రం ఆగస్ట్ 22న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నరేష్ అగస్త్య మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చిడం ఆనందంగా వుంది. ఆగస్టు 22న సినిమా రిలీజ్ అవుతుంది. హీరో కంటే అందంగా ఉండే కామియో కావాలి. అందుకే వెతికి వెతికి రాజాని పట్టుకున్నారు(నవ్వుతూ). తను నాకు మంచి స్నేహితుడు. రబియా చాలా అద్భుతంగా నటించింది. వెరీ బ్యూటీఫుల్ క్లీన్ ఫిలిం ఇది. ప్రొడ్యూసర్ ఉమాదేవి కోట మాట్లాడుతూ.. మీరందరూ ఆదరిస్తే మరిన్ని సినిమాలు చేయాలని ఉంది అన్నారు. హీరోయిన్ రబియా మాట్లాడుతూ.. నా ఫస్ట్ డైరెక్టర్ ధనుష్. ఆయన వల్లే నేను ఇప్పుడు ఈ స్థానంలో నిలుచున్నాను అన్నారు. డైరెక్టర్ విపిన్ మాట్లాడుతూ సినామా కోసం చాలా ఎఫర్ట్ పెట్టామన్నారు. యాక్టర్ రాజా మాట్లాడుతూ చాలా క్లియర్ విజన్‌తో డైరెక్టర్ మోహన్ కృష్ణ మా అందరిని చాలా డిఫరెంట్‌గా చూపించారు అన్నారు.


## అభినయ కృష్ణ దర్శకత్వంలో కామాఖ్య



సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో ఓ థ్రిల్లింగ్ మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి కామాఖ్య అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. డివైన్ వైబ్‌తో వున్న టైటిల్ పోస్టర్ అదిరిపోయింది.

డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్. ఈచిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

## కంటెంట్‌పై ఫోకస్



వరసగా సినిమాలైతే చేస్తున్నారు కానీ ఎందుకు చేస్తున్నారో కూడా శ్రీలీలకు కూడా అర్థం కావట్లేదు. అసలెప్పుడు వస్తున్నాయో.. ఎప్పుడెళ్తున్నాయో కూడా తెలియట్లేదు ఆమె సినిమాలు. ఈ ఏడాది రాబిన్ హుడ్, జూనియర్ సినిమాలతో వచ్చినా ఫలితం లేదు. కంటెంట్‌పై ఫోకస్ పెట్టమ్మా.. గ్యాప్ తీసుకున్నా పర్లేదంటున్నారు ఫ్యాన్స్. స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ కోసం చూస్తున్నారు శ్రీలీల. రవితేజ మాస్ జాతర, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలతో పాటు తమిళంలో శివకార్తికేయన్ పరాశక్తి.. హిందీలో కార్తిక్ ఆర్యన్ సినిమాల్లో నటిస్తున్నారు ఈ బ్యూటీ. వీటిలో శ్రీలీలకు కమ్ బ్యాక్ ఇచ్చే సినిమా ఏదవుతుందనేది ఆసక్తికరంగా మారింది. మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్య శ్రీ బోర్సే సైతం మాంచి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. విజయ్ దేవరకొండ కింగ్డమ్ జూలై




31న రానుంది.. అలాగే దుల్కర్ సల్మాన్ కాంతా, రామ్ ఆంధ్రాకింగ్ తాలూక సినిమాలు 2025లోనే రానున్నాయి. వీటితో కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు ఈ బ్యూటీ. ఇక రష్మిక మందన్నకు హిట్స్ ఉన్నాయి కానీ గ్యాప్ ఎక్కువగా ఇస్తున్నారు. పుష్ప 2 తర్వాత మొన్న



కుబేరాతో వచ్చారు. త్వరలోనే రెయిన్ బో, గాళ్ ఫ్రెండ్ అంటూ గ్యాప్ లేకుండా వస్తున్నారు. హిట్ 3 బానే ఆడినా శ్రీనిధి శెట్టి పేరు పెద్దగా వినిపించట్లేదు. అక్టోబర్ 17న తెలుసు కదా అంటూ మరోసారి పలకరించబోతున్నారు ఈ బ్యూటీ. అలాగే మంచి కథ దొరికితే తెలుగులో నటిస్తానంటున్నారు సమంత. ఖుషీ తర్వాత ఈమె కనబడలేదు. త్రిష సినిమాలు చేస్తున్నా.. విజయాల్లేవు. ఈమె ఆశలన్నీ విశ్వంభరపైనే ఉన్నాయి. మరి వీళ్లలో ఎంతమందికి కోరుకున్న కమ్ బ్యాక్ వస్తుందో చూడాలిక.



## షారుక్‌కు గాయాలు



ఇండియన్ సినిమాలో మోస్ట్ హార్డ్ వర్కింగ్ యాక్టర్స్‌లో షారుక్ ఖాన్ ఒకరు. ఎలాంటి సినీ బ్యాగ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన కింగ్ ఖాన్.. తన సినిమాలతో గత మూడు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. 60 ఏళ్ల వయసులోనూ రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు. సినీ ప్రియులను ఆకట్టుకోడానికి యంగ్ హీరోలకు పోటీగా రిస్క్ స్టంట్స్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు బాలీవుడ్ బాద్ షా తన అప్ కమింగ్ సినిమా కోసం ఓ ఇంటెన్స్ యాక్షన్ సీన్ షూటింగ్ చేస్తుండగా, ప్రమాదం జరిగి గాయాలపాలైనట్లుగా వార్తలు వస్తున్నాయి. షారుక్ ఖాన్ ప్రస్తుతం ఖీకింగ్ఖీ అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ యాక్షన్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమా సెట్స్ లోనే షారుక్ గాయపడినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ముంబైలోని గోల్డెన్ టొబాకో స్టూడియోలో ఓ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేయగా.. షారుక్ డూప్ లేకుండా ఆ స్టంట్ చేశారట. ఈ సందర్భంగా ఆయనకు గాయాలైనట్లు కథనాలు పేర్కొన్నాయి. కింగ్ షూటింగ్‌లో ప్రమాదం జరగడంతో, అత్యవసర చికిత్స కోసం షారుక్ తన టీంతో కలిసి అమెరికా వెళ్లినట్లు ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే అది తీవ్రమైన గాయం కాదని, కండరాల గాయం అని చిత్ర వర్గాలు తెలిపాయి. వైద్యులు ఒక నెల రోజుల పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. దీంతో కింగ్ షూటింగ్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేసినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

## నన్ను సూపర్ స్టార్‌గా చూశారు

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ కింగ్డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మరో ఆరు రోజుల్లో ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మూవీ ప్రమోషన్స్‌లో సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కూడా భాగమయ్యారు. కింగ్డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్ పేరుతో సందీప్‌రెడ్డి వంగాతో కలిసి విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి స్పెషల్ చిట్ చాట్ నిర్వహించారు. సినిమాకి సంబంధించిన సంగతులతో పాటుగా పలు ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకున్నారు. శ్రీలంకలోని 200 ఏళ్ల క్రితం నాటి జైల్లో కింగ్డమ్ సినిమా షూటింగ్ జరిగిందని, పూర్తిగా వర్షంలో తీసిన 13 నిమిషాల కీలకమైన సీక్వెన్స్ ఉంటుందని డైరెక్టర్ గౌతమ్ చెప్పారు. సెకండాఫ్‌లో వైలెన్స్ చాలా ఎక్కువగా ఉంటుందని చెప్పిన విజయ్.. ఇటీవలే కింగ్డమ్ గంట సినిమా చూశానని, ఆర్ఆర్ లేకుండా చూసినా అద్భుతంగా అనిపించిందని సందీప్ రెడ్డి చెప్పారు. ప్రమోషనల్ కంటెంట్ చాలా బాగుందని, తప్పకుండా సక్సెస్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెళ్లి చూపులు రిలీజైన రోజే విజయ్ దేవరకొండకి ఓ కథ చెప్పానని, రెండు సమోసాలు తిని స్టోరీ తనకు ఎక్కలేదని చెప్పి వెళ్లిపోయాడని గౌతమ్ చెప్పారు. కింగ్డమ్ అనేది గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ మూవీ అని, అన్నదమ్ముల సెంటిమెంట్ ప్రధానంగా ఉంటుందని దేవరకొండ విజయ్ వెల్లడించారు. తానే స్వయంగా గౌతమ్‌కి ఫోన్ చేసి సినిమా చేద్దామని



అడిగినట్లుగా చెప్పారు.

అర్జున్ రెడ్డి మూవీ టైంలోనే సందీప్ రెడ్డి వంగా తనలో సూపర్ స్టార్‌ని చూశాడని విజయ్ దేవరకొండ చెప్పారు. అప్పట్లోనే తనని యాక్టర్‌గా కాకుండా, సూపర్ స్టార్‌లా ట్రీట్ చేసేవాడని తెలిపారు. యానిమల సినిమా ఫైనల్ కట్ 3 గంటల 30 నిమిషాలు వచ్చిందని, చివరకు మరో 7 నిమిషాలు ట్రిమ్ చేసానని సందీప్ వెల్లడించారు. అయితే చాలా మంచి సీన్స్ లేపేసానని, ఆ విషయంలో చాలా రిగ్రెట్ అవుతున్నానని పేర్కొన్నారు. విజయ్, సందీప్, గౌతమ్‌లు కింగ్డమ్ బాయ్స్ పాడ్‌కాస్ట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## మహారాజుల విడిదిలో నిద్రలేని రాత్రులు




హారర్ సినిమాలు ఆద్యంతం ఎంతో ఎంగేజింగ్‌గా సాగుతాయి.. భయపెట్టే స్టోరీలు, సస్పెన్స్‌కు గురిచేసే సీన్స్ ఆడియెన్స్‌కు మంచి థ్రిల్‌ను అందిస్తాయి. ఇప్పుడు మనం చర్చించుకోబోయే సినిమా ఇదే జానర్ లో నెక్స్ట్ లెవెల్ అని చెప్పుకోవచ్చు. ఈ మూవీ హారర్ జానర్‌లో ఒక సరికొత్త ట్రెండ్ ను క్రియేట్ చేసింది. ఈ సినిమా కేవలం ఆడియెన్స్‌ను మాత్రమే కాదు.. ఇందులో నటించిన యాక్టర్స్‌ను కూడా భయ పెట్టింది. వారు చాలా రోజులు నిద్రలేని రాత్రులు గడిపారు. ఈ సినిమా షూటింగ్ ఊటీలోని ఫెర్న్‌హిల్ హోటల్, పైన్ ఫారెస్ట్, లారెన్స్ స్కూల్‌లో జరిగింది. ఈ ప్రాంతాల్లో నిజంగానే దెయ్యాలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఇందులో ఫెర్న్ హిల్ హోటల్ ఒకప్పుడు మైసూర్ మహారాజుల విడిది. ఈ హోటల్‌లో దెయ్యాలు, ఆత్మలు సంచరిస్తున్నాయని ప్రచారంలో ఉంది. అందుకే షూటింగ్ టైమ్ లో సెట్‌లో జరిగిన కొన్ని సంఘటనలు నటీనటులను చాలా భయపెట్టాయట. ఒకసారి హోటల్‌లో పైఅంతస్తు లేనప్పటికీ ఫర్నీచర్ జరుపుతున్న సౌండ్స్ వినిపించాయని ఇందులో నటించిన హీరోయిన్ ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది. రాత్రి పూట డ్యాన్సర్లకు కూడా అలాంటి వింతైన, భయానక శబ్దాలు వినిపించాయట. అలాగే డాక్టర్ అంబేడ్కర్ ఫొటో జారిపడిందని.. అది కెమెరాలో రికార్డ్ అయ్యిందని కూడా సదరు హీరోయిన్ చెప్పింది. ఒక రాత్రి షూటింగ్ జరుగుతుండగా.. ఒక అమ్మాయి పాట పాడుతున్న గొంతు తనతో పాటు అందరికీ వినిపించిందని హీరోయిన్ చెప్పుకొచ్చింది.

ఇలా షూటింగ్ జరుగుతుండగానే యాక్టర్లను భయ పెట్టిన ఆ హారర్ సినిమాపేరు రాజ్. 2002లో రిలీజైన ఈ సినిమాలో బిపాషా బసు, డీనో మోరియా, మాలిని శర్మ, అశుతోష్ రాణా, విశ్వజీత్ ప్రధాన్ లీడ్ రోల్స్ చేశారు. విక్రమ్ భట్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సంజన (బిపాషా బసు), ఆదిత్య (డీనో మోరియా) దంపతులు ఊటీలోని ఒక బంగ్లాకు వెళతారు. అక్కడ వారికి కొన్ని భయంకరమైన అనుభవాలు ఎదురవుతాయి. ఒక శక్తి వారిని వెంటాడటం మొదలుపెడుతుంది? మరి అది వారి జీవితాలను ఎలా ప్రభావితం చేసింది. సంజన, ఆదిత్యలు బయటపడ్డారా? అన్నదే రాజ్ సినిమా కథ. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది.

## వార్ వన్ సైడ్ ఎవరికి ?

ఆర్ఆర్ఆర్ తరువాత అంతే హైప్‌తో వస్తున్న మరో మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ గ్రీకు వీరుడు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మల్టీస్టారర్‌గా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న వార్ 2 పైనే ప్రస్తుతం ఇండస్ట్రీ కళ్లన్నీ ఉన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు సినిమాపై అంచనాలను పెంచేసాయి. ఇక ఇప్పుడు ట్రైలర్ చూశాకా.. అందరికీ ఒక క్లారిటీ వచ్చింది. జక్కన్న చేసిన తప్పు అయాన్ చేయలేదనిపిస్తుంది. ఇద్దరు హీరోలు ఉంటే.. వారిద్దరికీ సరిసమానమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటు డైలాగ్స్‌ను కూడా పెట్టి కట్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది.



ఇక వార్ 2 ను అనౌన్స్ చేసిన దగ్గరనుంచి హృతిక్ వర్సెస్ ఎన్టీఆర్ ట్రోల్స్ నడుస్తూనే ఉన్నాయి. ట్రైలర్ రిలీజ్ తరువాత లెక్కలు తారుమారు అయ్యాయి అని చెప్పొచ్చు. మొదట హృతిక్.. ఎన్టీఆర్ ను డామినేట్ చేస్తాడు అని ట్రోల్ చేసినవారే ట్రైలర్ చూసాక ఎన్టీఆరే హృతిక్ ను డామినేట్ చేసేలా కనిపిస్తున్నాడే అని చెప్పుకొస్తున్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ యాక్టింగ్.. హృతిక్‌తో కనిపించిన ప్రతి సన్నివేశంలో ఎన్టీఆర్ తానేంటో నిరూపించుకోవడానికే ఎంతో కసితో చేసినట్లు కనిపించాడు. కొన్ని సీన్స్‌లో ఫ్యాన్స్ చెప్పినట్లే హృతిక్‌ను డామినేట్ చేసినట్లే కనిపించాడు. మొత్తానికి వార్ 2.. ఇద్దరు సైనికుల మధ్య యుద్ధం అని అనడం కన్నా ఇద్దరు స్టార్ హీరోల మధ్య యుద్ధం అని చెప్పొచ్చు. లుక్ పరంగా హృతిక్‌ను కొట్టేవారు లేరు. వార్ 2లో కూడా అలాగే కనిపించాడు. ఎన్టీఆర్ లుక్‌లో కొన్ని లోపాలున్నా.. నటనలో అతడిని కొట్టేవారు లేరు. ఇక ఇద్దరికీ సమ ప్రాధాన్యత ఇచ్చి.. అయాన్ తెలుగు అభిమానుల ఆగ్రహం నుంచి తప్పించుకున్నాడు. ట్రైలర్ వరకు ఇది ఓకే.. సినిమాలో ఏ చిన్న తేడా వచ్చినా.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఉగ్రరూపం దాలుస్తారు అని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. మరి వార్ 2.. ఎవరికి వార్ వన్ సైడ్ అయ్యేలా చేస్తుంది.

## వినాయక చవితి కానుకగా సుందరకాండ

ప్రముఖ నటుడు నారా రోహిత్ బర్త్ డే జూలై 25. ఈ సందర్భంగా అతని తాజా చిత్రం సుందరకాండ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఆగస్ట్ 27న ఈ సినిమా వినాయక చవితి కానుకగా విడుదల కాబోతోంది. ఈ విషయాన్ని ఓ స్పెషల్ వీడియో ద్వారా తెలియచేశారు. ఆగస్ట్ 27 అంటే బుధవారం. లాంగ్ వీకెండ్ ఈ మూవీకి కలిసివస్తుందని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.



ఇప్పటికే వెంకటేశ్ హీరోగా కె. రాఘవేంద్రరావు సుందర కాండ మూవీని తెరకెక్కించారు. అలానే అల్లరిఖీ నరేశ్ హీరోగా బాపు ఓ సుందరకాండను రూపొందించారు. వెంకీ సుందరకాండ సూపర్ హిట్ అయితే నరేశ్ సుందర కాండ భారీ పరాజయాన్ని పొందింది. అయితే సుందరకాండ పేరుతోనే ఇప్పుడు నారా రోహిత్ హీరోగా ఓ సినిమా రూపుదిద్దుకుంది. ఇది నారా రోహిత్ కు 20వ చిత్రం కాగా, ఈ సినిమా ద్వారా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి దీనిని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీదేవి విజయ్ కుమార్‌తో పాటు వృతి వాఘాని హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీనికి లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చారు. సిద్ శ్రీరామ్ పాడిన ఫస్ట్ సింగిల్ బహుసా బహుసా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి ప్రదీప్ ఎం వర్మ సినిమాటోగ్రఫీ అందించారు.

26-7Pg5.qxd:26-7Pg5.qxd 01/01/01 8:51 AM Page 1



# గాజాలో మరణరోదన..

## ఆకలితో పిట్టల్లా రాలుతున్న పిల్లలు



**గాజాసిటీ, జూలై 25:** గాజాలో పరిస్థితులు రోజురోజుకు దారుణంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా ఆకలి కేకలే. ఏడిస్తే కన్నీరు కూడా రాని పరిస్థితి. తిండి లేక అల్లాడుతున్న చిన్నారులు పిట్టల్లా రాలిపోతున్నారు. పోషకాహార లోపంతో నిత్యం వందలాది మంది పసి పిల్లలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఆహారం, ఔషధాలు లేక వైద్యులు చేతులెత్తేస్తున్నారు. ఇలా గడిచిన నాలుగు రోజులుగా గాజాలో అనేకమంది చిన్నారులు ఆకలికి బలయ్యారు. 'ఉత్తర గాజాలో ఉన్న పేషెంట్స్ ఫ్రెండ్స్ ఆస్పత్రిలో ఎన్నడూ లేని విధంగా చిన్నారుల చేరికలు ఉన్నాయి. నిత్యం 200 నుంచి 300 మంది చేరుతున్నారు. ఈ విపత్తును చూస్తుంటే మాటలు రావడం లేదు. శరీరం బక్కచిక్కి ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయి. పిల్లలు నడవడం, కనీసం ఏడవడానికీ ఓపిక లేదు. వారి పొత్తికడుపులు ముడుచుకుపోయాయి. వీరికి ఇవ్వడానికి ఆస్పత్రిలో సరైన పోషకాహారం కూడా లేదు. కొందరికి ఐసియులో చికిత్స అందిస్తున్నా ప్రాణాలను కాపాడలేకపోతున్నాం. ఇంతకంటే దారుణ, భయంకరమైన పరిస్థితి మరొకటి లేదు. మే కూడా అలసిపోయాం' అని అమెరికా స్వచ్ఛంద సంస్థ తరఫున డాక్టర్ రానా సోహోబ్ పేర్కొన్నారు. చిన్నారులకు పౌష్టిక ఆహారం ఎంతో కీలకమని, కానీ, అది అందుబాటులో లేకపోవడంతో రానున్న రోజుల్లో మరిన్ని మరణాలు చూడక తప్పని దుస్థితి నెలకొందని వాపోయారు.

**లక్ష మందికి తక్షణ అవసరం:** లక్ష మంది మహిళలు, చిన్నారులకు అత్యవసర చికిత్స అవసరమని ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమం విభాగం పేర్కొంది. చాలా కీలక చికిత్సలు ఆగిపోయాయని, అవసరమైన ఔషధాలు అయిపోనట్లు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకలి చావులకు ఇది ఆరంభం మాత్రమే నని మెడ్‌గ్లోబల్ సహవ్యవస్థాపకుడు, గాజాలో వాలంటీర్‌గా పనిచేసిన డాక్టర్ జాన్ కహలెర్ పేర్కొన్నారు. గత మూడు వారాల్లో 48 పోషకాహార లోపం సంబంధిత మరణాలు చోటుచేసుకున్నాయని, వారిలో 28 మంది పెద్దలు, 20మంది చిన్నారులు ఉన్నారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత ఐదు నెలల్లో 10 మంది చనిపోగా ఇప్పుడది వేగంగా పెరుగుతోందని తెలిపింది. మరోవైపు ఐదేళ్ల లోపు 21 మంది చిన్నారులు ఆకలి కారణంగా ప్రాణాలు కోల్పోయారని, జూలైలోనే 13 మంది చనిపోయినట్లు గుర్తించామని ఐరాస మానవతా సంస్థ ఒసిహెచ్‌ఎ తెలిపింది.

**ట్రక్కుల లూటీ:** ఐరాస అంచనా ప్రకారం గాజా వాసులకు నిత్యం 500-600 ట్రక్కు ఆహార పదార్థాలు అవసరం. కానీ, ప్రస్తుతం సరాసరి 69 ట్రక్కుల్లో మాత్రమే సరఫరా అవుతున్నట్లు ఐరాస చెబుతోంది. అయితే, వీటిని పంపిణీ చేయకముందే.. ఆహారం కోసం అల్లాడుతున్న పాలస్తీనా వాసులు ఆ ట్రక్కులపై దాడి చేసి లూటీ చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రానున్న రోజుల్లో భారీగా ఆకలి చావులు నమోదయ్యే ప్రమాదం ఉందని, ఆయా దేశాలు తక్షణమే స్పందించి ఆహార పదార్థాలు సరఫరా చేయాలని 115 అంతర్జాతీయ మానవ హక్కుల, స్వచ్ఛంద సంస్థలు ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.



# అటవీ అధికారి ఇంట్లో రూ.1.4 కోట్ల నగదు

### విజిలెన్స్ సోదాల్లో మరింతగా నగదు లభ్యం

**కోరాపుట్,జూలై 25:** ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఉన్న జేయ్‌పోర్ డిప్యూటీ రేంజర్ రామచంద్ర నేపాక్ ఇండ్లపై ఇవాళ విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. ఆ తనిఖీల్లో ఆ ఆఫీసర్ ఇంట్లో సుమారు 1.4 కోట్ల నగదు దొరికింది. అతని అపార్ట్‌మెంట్‌లోని ఓ రహస్య ట్రెజరీలో ఆ నగదును దాచిపెట్టాడు. ఫారెస్ట్ ఆఫీసర్ రామచంద్ర నుంచి నగదుతో పాటు నాలుగు బంగారు బిస్కెట్లు, 16 బంగారు నాణాలు రికవరీ చేశారు. మొత్తం ఆరు ప్రదేశాల్లో ఇవాళ ఒడిశా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించినట్లు ఆ ఆఫీసర్‌పై ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ శాఖ స్పెషల్ జడ్జి ఇచ్చిన సెర్చ్ వారెంట్‌తో అధికారులు ఆ ఆఫీసర్ ఇండ్లల్లో తనిఖీలు చేశారు. ఆరుగురు డీఎస్పీలు, అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు. అన్ని చోట్ల నుంచి సుమారు 1.4 కోట్ల నగదును సీజ్ చేశారు. ప్రస్తుతం ఇంకా తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. సోదాలు ముగిసిన తర్వాత సమగ్రమైన ఇన్ఫర్మేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. 'జేయ్‌పోర్ పట్టణంలోని గోల్డెన్ హైట్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ లో ఉన్న ఫ్లాట్ నెంబర్ 510లోని ఓ సీక్రెట్ లాకర్‌లో 1.4 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఒడిశా విజిలెన్స్ అధికారులు చెప్పారు.

### పూంచ్‌లో మందుపాతర పేలి

# అగ్నివీర్ మృతి



**పూంచ్, జూలై 25:** జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఎల్ఒసి వెంబడి మందుపాతర పేలడంతో ఒక ఆర్మీ జవాన్ శుక్రవారం ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఇండియన్ ఆర్మీకి చెందిన వైట్‌నైట్ కార్ప్స్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. 'కృష్ణ ఘాటి బ్రిగేడ్ జనరల్ ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా మందుపాతర పేలి 7-జాట్ రెజిమెంట్‌కు చెందిన అగ్నివీర్ లలిత్‌కుమార్ వీరమరణం పొందారు. ఆయన కుటుంబసభ్యులకు మేము అండగా నిలుస్తాం' అని వైట్‌నైట్స్ కార్ప్స్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ మిలటరీ చర్యలకు దిగుతూ ఎల్ఒసి వెంబడి పెద్దఎత్తున క్రాస్-బోర్డర్ షెల్లింగ్ జరిపింది. గత నెలలో రాజౌరి జిల్లా ఎల్ఒసి సమీపంలోని ఫార్వార్డ్ ఏరియాలో అనుమానాస్పద కదలికలు గుర్తించడంతో ఆర్మీకాల్పులు జరిపింది. పూంచ్, సాంబ, కథువా జిల్లాలతో సహా దజనుకుపైగా ఏరియాల్లో గాలింపు చర్యలు చేపట్టింది.

## విమానంలో సాంకేతిక లోపం

### వెనక్కి మళ్లించిన పైలట్లు!

**జైపూర్, జులై 25:** గగనతలంలోఉండగా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. జైపూర్ నుంచి ముంబయి వెళుతున్న విమానం టేకాఫ్ అయిన 18 నిమిషాలకే సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు దాన్ని వెనక్కి మళ్లించారు. దాంతో అది బయల్దేరిన చోటే ల్యాండ్ కావాల్సి వచ్చిందని విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ఇటీవలి కాలంలో ఎయిరిండియా విమానాలు తరచూ వార్తల్లో నిలుస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులు భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 188మంది ప్రయాణికులు, సిబ్బందితో ఉన్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో ఘటనలో హాంకాంగ్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చిన ఎయిరిండియా ల్యాండింగ్ అయిన కాసే పటికే పవర్ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైనసిబ్బంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేయడంతో పెనుప్రమాదం తప్పింది.

# కుప్పకూలిన స్కూలు భవనం పైకప్పు

## ఏడుగురు చిన్నారులు మృతి, 28 మందికి తీవ్రగాయాలు

**జైపూర్,జూలై 25:** రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఝులావర్‌లోని పీప్లోడీ ప్రాథమిక పాఠశాల పైకప్పు ఒక్కసారిగా శుక్రవారం ఉదయం కుప్పకూలింది. దీంతో శిథిలాల కింద అనేక మంది విద్యార్థులు చిక్కుకుపోయారు. ఘటనలో ఏడుగురు చిన్నారులు చనిపోయారు. 28 మంది విద్యార్థులు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉదయం పిల్లలు తరగ తులకు హాజరువుతుండగా ఘటన జరిగినట్లు తెలిపారు. అయితే ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించి, చిన్నారులను బయటకు తీశారు. ఆ విషయంలో స్థానికులు కూడా సహాయపడ్డారు. అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనలో ఏడుగురు పిల్లలు మరణించగా, మరో 28 మంది గాయ పడ్డారని పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ మీడియాకు తెలిపారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను ప్రత్యేక ఆరోగ్య కేంద్రంలో చేర్పించామని, కొందరు ఆసుపత్రిలో చికిత్స



పొందుతున్నారని చెప్పారు. పాఠశాల పైకప్పు కూలిన ఘటనలో ప్రాణనష్టం సంభ వించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సం తాపం వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లోని ఝులావర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన ప్రమాదం విషాదకరం. తీవ్ర బాధాకరం. ఈ క్లిష్ట సమ యంలో బాధిత విద్యార్థులు, వారి కుటుంబా లతో నా ఆలోచనలు ఉన్నాయని మోదీ తెలి పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. అధికారులు బాధిత వారికి అన్ని విధాలుగా సహాయం అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు, పాఠశాల పైకప్పు కూలిన ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడంపై సంతాపం తెలిపారు. గాయపడిన పిల్లలకు సరైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఖిఖిమరణించిన వారికి దేవుని పాదాల వద్ద స్థానం దొరకాలి. అపారమైన దుఃఖాన్ని భరించే శక్తిని వారి కుటుంబాలకు దేవుడు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ కూడా స్పందించారు. ఈ విషాద ఘటన తనను ఎంతో బాధించిందని తెలిపారు. గాయపడిన చిన్నా రులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. వారి చికిత్సకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. భవనం పైకప్పు ఎలా కూలిపోయిందో తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామన్నామని వెల్లడించారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ఆకాం క్షించారు. శిథిలాల కింద మరికొందరు విద్యా ర్థులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, దీనిపై గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటు న్నారు. ఇప్పుడు కూలిపోయి విషాదానికి దారి తీసిందని చెబుతున్నారు.

# రెండుదేశాలమధ్య రాజుకుంటున్న శివాలయాల వివాదం

## పరస్పర దాడులకు దిగుతున్న థాయిలాండ్, కాంబోడియా



**బ్యాంకాక్,జూలై 25:** ఆసియా దేశాలైన థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య ఘర్షణలు యుద్ధం అంచుకు చేరుకున్నాయి. ఉద్రిక్తతలు తార స్థాయికి చేరుకోవడంతో ఇరుదేశాల బలగాలు ఫిరంగులు, రాకెట్లతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఘర్షణలకు సరిహద్దు వివాదాలే కారణమని చెబుతున్నా ఆ సరిహద్దుల్లోని హిందూ దేవాలయాల కోసం ఇరుదేశాలు ఎన్నో ఏళ్లుగా కొట్టుకుంటున్నాయి. ప్రధానంగా ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం దశాబ్దలుగా ఇరుదేశాల మధ్య తీవ్ర పోరాటం జరుగుతోంది. ఈ ఆలయాల్లో శివలింగం, సంస్కృత లిపిలో శాసనాలు, హిందూ దేవతల చిత్రాలు ఉన్నాయి. థాయిలాండ్, కంబోడియా మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది. దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. రెండు దేశాలు శాంతియుతంగా కలిసి ఉంటున్నప్పటికీ, సరిహద్దుల్లో మాత్రం తరచూ ఘర్షణలతో రగులుతున్నాయి. వీటిల్లో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. ఈ శివాలయాన్ని ఖెమర్ పాలకులు నిర్మించారు. డాంగ్రెక్ పర్వతాల శిఖరం థాయ్‌లాండ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌లాండ్ అంగీకరించింది. కంబోడియా విజ్ఞప్తి మేరకు 2008లో ఈ ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. దీనిని థాయ్‌లాండ్ తీవ్రంగా వ్యతిరేకించింది. కంబోడియానాడు చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లను ఆక్రమించుకొన్నట్లు ఆరోపించింది. అటు థాయ్‌లాండ్ దేశ పరిధిలోని సురిన్ ప్రావిన్స్‌లోని ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ప్రాంతాలు కూడా ఇరుదేశాల మధ్య వివాదాస్పద ప్రదేశాలుగా ఉన్నాయి. థాయ్‌లాండ్ సురిన్ ప్రావిన్సులోని ప్రసాత్ ట మోన్ థోమ్ అనే మరో శివాలయం కోసం కూడా రెండు దేశాలు గొడవ పడుతున్నాయి. చారిత్రక ఆధారాల ప్రకారం ఈ శివాలయం తమకే చెందుతుందని కంబోడియా వాదిస్తోంది. అందుకు థాయ్‌లాండ్ అంగీకరించట్లేదు. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయాలు రెండు దేశాల మధ్య వివాదంతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన వేళ కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు థాయ్‌లాండ్‌లోని భారతీయులకు అడ్వైజరీ జారీ చేసింది. భారతీయ పౌరులు థాయ్‌లాండ్‌లోని ఏడు ప్రావిన్సులవైపు ప్రయాణాలు చేయద్దొని అక్కడి భారతీయ రాయాబార కార్యాలయం ప్రకటనను విడుదల చేసింది. ప్రస్తుత అస్థిర పరిస్థితుల దృష్ట్యా థాయ్‌లాండ్‌లో పర్యటించే భారతీయులు స్థానిక అధికారులు ఇచ్చే అప్‌డేట్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎంబసీ సూచించింది. ఆ దేశ పర్యాటక శాఖ సూచించిన ప్రదేశాల్లో ప్రయాణాలకు దూరంగా ఉండాలని పేర్కొంది.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్


**న్యూఢిల్లీ,జూలై 25:** నూతన ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం, తాజాగా రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీని నియమించింది. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ సోమవారం సాయంత్రం పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఉప్పరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదించి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ సమ్మతితో 2025 ఉపరాష్ట్రపతి ఎన్నికలకు మోదీని రిటర్నింగ్ అధికారిగా నియమించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాజ్యసభ సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ గరిమా జైన్, సెక్రటేరియట్ డైరెక్టర్ విజయ్ కుమార్‌లను సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి కాగానే అతి త్వరలో షెడ్యూలు విడుదల చేస్తామని ఎన్నికల కమిషన్ బుధవారం తెలిపింది. నెల రోజుల్లో ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ పూర్తి కావొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీ కాలం ఉంది. కొత్త ఉప రాష్ట్రపతి మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు. అయితే దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగ్గా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది. మిగిలిన 12 సార్లు పోటీ జరిగింది. ఇందులో రెండు ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పోటీ చేశారు. 2022లో కాంగ్రెస్ అభ్యర్థి మార్గరెట్ ఆల్వాను ఓడించి జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి అయ్యారు. ఈసారి బీజేపీ సీనియర్ నేతనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే కూటమి ఖరారు చేస్తుందని తెలుస్తోంది. తొలుత బీహార్ సీఎం నీతీశ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు పేర్లు వినిపించినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరోవైపు, ఇండియా కూటమి



తమ తరఫున ఒక ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని యోచన చేస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో ఇండియా కూటమికి మెజారిటీ లేకపోయినప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటూ ఉండడం గమనార్హం. ఫలితంతో సంబంధం లేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశంతోనే ప్రతిపక్ష పార్టీల కూటమి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఐదో రోజూ ఉభయసభల్లో గందరగోళం

### సోమవారానికి వాయిదాపడిన పార్లమెంట్



**న్యూఢిల్లీ,జూలై 25:** పార్లమెంట్ ఉభయ సభల్లో ఐదో రోజైన శుక్రవారం కూడా గందరగోళ వాతావరణం కొనసాగింది. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ విపక్షాలు నినాదాలు చేయడంతో రభస ఏర్పడి సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. విపక్ష సభ్యుల నిరసనలతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఉభయ సభలు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశమయ్యాయి. సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళనకు దిగారు. వాయిదా తీర్మానాలపై చర్చకు ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టాయి. ముఖ్యంగా బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చించాలని డిమాండ్ చేశాయి. సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. విపక్షాల ఆందోళనతో ప్రారంభమైన నిమిషాల్లో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఎలాంటి చర్చా లేకుండానే మధ్యాహ్నం 2 గంటల వరకూ దిగువ సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఆతర్వాత సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. సభ ప్రారంభంకాగానే సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్ హాసన్ ఎంపీగా రాజ్యసభలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత విపక్ష ఎంపీల నిరసనలతో సభ వాయిదా పడింది.



# డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగం విజయవంతం

### ఎక్స్‌లో ఫొటోను పోస్టు చేసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**రాజంపేట, జూలై 25 ప్రభాతవార్త:** భారత్ సరికొత్త ఆయుధాలతో సత్తా చాటుతోంది. తాజాగా డ్రోన్ ద్వారా మిస్సైల్ ప్రయోగించే పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుజిల్లా ఓర్వకల్లు డిఆర్‌డిఓ కు కేటాయించిన టెస్ట్ సెంటర్‌లో డ్రోన్ నుంచి ప్రిసెషన్ గైడెడ్ క్షిపణిని విజయవంతంగా శుక్రవారం ప్రయోగించారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కర్నూలులో యుఏవి లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి (యు ఎల్ పి జి ఎం) వి3 పరీక్షలను నిర్వహించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్ష భారతదేశ క్షిపణి సామర్థ్యాన్ని మరింత పెంచిందన్నారు. యుఎల్‌పిజిఎంని డిఆర్డిఓ యొక్క టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీఓని అభినందించారు. ఈ మేరకుఎక్స్‌లో ఫొటోను రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్‌పోస్ట్‌చేశారు. క్షిపణి తయారీలో భాగస్వాములైనసంస్థలను రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

# భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండాలి



### సిడిఎస్ అనిల్‌చౌహాన్

**న్యూఢిల్లీ, జూలై 25:** భారత్ 365 రోజులూ, 24 గంటలూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిడిఎస్ అనిల్‌చౌహాన్ హెచ్చరించారు. ఆయుధాలు ఇతర పరిజ్ఞానం గురించి మిలిటరీ పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని అభిప్రాయపడ్డారు. యుద్ధాల గతి మారిపోతోందని సిడిఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో-టెక్ తోపాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటాయన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని గుర్తు చేశారు. సుబ్రతోపార్క్‌లో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. యుద్ధాల్లో రన్నరప్‌లు ఉండరని సిడిఎస్ అనిల్‌చౌహాన్ గుర్తు చేశారు. అందుకే సైన్యాలు అప్రమత్తంగా ఉంటూ ఏ క్షణమైనా ఆపరేషన్ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దీనికి ఆపరేషన్ సిందూర్‌నే ఆయన ఉదాహరణగాచూపారు. భారత మిలిటరీకి భవిష్యత్తులో ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ, స్కాలర్ వారియర్స్ అవసరం చాలా ఉందని చెప్పారు. మారుతున్న పరిణామాల ఆధారంగా భవిష్యత్తు సైనికులు ఈ మూడు నైపుణ్యాల కలబోతగా ఉంటారని పేర్కొన్నారు. సైనిక దళాల్లో జరుగుతున్న మార్పుల మూడో విప్లవం కీలక దశలో మనం ఉన్నట్లు వెల్లడించారు. దానిని తాను కన్వర్జెన్సీ యుద్ధంగా అభివర్ణిస్తానన్నారు. ఇది కైనటిక్, నాన్-కైనటిక్ మిశ్రమంగా ఉంటుందన్నారు.



# పాకిస్థాన్‌లో వరదల బీభత్సం 266 మంది మృతి

**ఇస్లామాబాద్, జూలై 25:** పాకిస్థాన్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాలు, వరదల కారణంగా జూన్ చివరి వారం నుంచి ఇప్పటి వరకు 266 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) శుక్రవారం తెలిపింది. మృతుల్లో 126 మంది చిన్నారులే కావడం గమనార్హం. గత 24 గంటల్లో భీకర వర్షానికి 14 మంది ప్రాణాలు కోల్పోగా 17 మందికి గాయాలయ్యాయని ఎన్‌డిఎంఎ తాజా నివేదికలో పేర్కొంది. భారీ వర్షాలు, వరదల కారణంగా వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. వందలకొద్దీ మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పాకిస్థాన్‌లోని పంజాబ్ గవర్నర్ సర్దార్ సలీమ్ హైదర్ పర్యటించి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కొండచరియలు విరిగిపడటంతో హరిపూర్‌లోని ఖాన్‌పూర్‌లో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. జూన్‌లో రుతుపవనాల తాకిడి మొదలైనప్పటి నుంచే వరదలు తీవ్రమయ్యాయని అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు ఎన్‌డిఎంఎ అధికారులు తెలిపారు.

## సంక్షిప్తంగా..

### వృద్ధ తల్లితండ్రులను చూసుకునేందుకు అదనపు సెలవులు

**కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి**



**న్యూఢిల్లీ,జూలై 25:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు శుభవార్త చెప్పింది. సంవత్సరంలో 30రోజులు అదనంగా సెలవులు తీసుకోవచ్చని చెప్పింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ రాజ్యసభలో ప్రకటించారు. ఉద్యోగులు ఆయా సెలవులను తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇందులో 20రోజుల హాఫ్ పే లీవ్, ఎనిమిది రోజుల క్యాజువల్ లీవ్, 2 రోజుల పరిమిత సెలవులు ఉన్నాయి. రాజ్యసభలో ఎంపీ సుమిత్రా బాల్మిక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర సహాయమంత్రి జితేంద్ర సింగ్ సమాధానం ఇచ్చారు. సర్వీస్ రూల్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 30 రోజులు సెలవు తీసుకు నేందుకు అర్హులని ఈ సెలవులను వృద్ధ తల్లిదండ్రులను చూసుకునేందుకు, ఇతర వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించవచ్చన్నారు.

## విమానం గాల్లో ఉండగానే ప్రయాణికుడి మృతి

### అత్యవసర లాండింగ్ తర్వాత మృతదేహం అదృశ్యం

**కాలిఫోర్నియా,జూలై 25:** విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురైక్షణాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. అయితే పైలెట్లు విమానాన్ని అత్యసవరంగా ల్యాండింగ్ చేయాలనుకున్నా కుదరకపోవడం గమ్యస్థానానికి చేరాకే మృతదేహాన్ని కిందకు దించారు. కానీ ఆ తర్వాత నుంచి మృతదేహం కనిపించకుండా పోయింది. కాలిఫోర్నియాకు వెళ్తున్న టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో చోటు చేసుకుంది. ముఖ్యంగా ఈనెల 13వ తేదీన టర్కిష్ ఎయిర్ లైన్స్‌కు చెందిన టూకే79 విమానం ఇస్తాంబుల్ నుంచిశాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరింది. అయితే ఈ విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అప్రమత్తమైన సిబ్బంది అతడి దగ్గరకు వెళ్లేలోపే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈక్రమంలోనే విమానాన్ని ఇస్‌లాండ్‌లోని కెఫాలావిక్ విమానాశ్రయానికి మళ్లించేందుకు పైలెట్లు ప్రయత్నించారు. కానీ అది కుదరకపోవడంతో చికాగో ఎయిర్ పోర్టుకు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఆపై మృతదేహాన్ని కుక్ కౌంటీ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలుస్తోంది. కానీ ఎగ్జామినర్ కార్యాలయ ప్రతినిధి నటాలియా డెరెవ్యానీ టర్కిష్ ఎయిర్ లైన్స్ నుంచి తమకుఎలాంటి మృతదేహం లభించలేదని చెప్పారు. దీంతో విమానం ల్యాండింగ్ తర్వాత ఏంజరిగింది, అసలా మృతదేహం ఏమైందనే దానిపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## యూట్యూబ్ చూసి బరువుతగ్గే ప్రయత్నంలో విద్యార్థి మృతి

**చెన్నై,జూలై 25:** యూట్యూబ్ చూసి బరువు తగ్గడానికి ప్రయత్నించిన ఒక విద్యార్థి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. గత మూడు నెలలుగా బరువు తగ్గడానికి కేవలం పండ్ల రసం తాగుతూ వ్యాయామం చేస్తున్న ఆ విద్యార్థి ఊపిరాడక కుప్పకూలిపోయి విషాదకరంగా మరణించాడు. కన్యాకుమారిలోని బర్నత్విలైకి చెందిన శక్తిశ్వర్ అనే 17 ఏళ్ల యువకుడు స్థానికంగా ఉన్న ఇంటర్ కాలేజ్‌లో సెకండ్ ఇయర్‌లో ఉత్తీర్ణత సాధించి ఇంజనీరింగ్ కళాశాలలో చేరడానికి సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో శక్తిశ్వర్ ఇంట్లో అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే స్థానికి హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు చనిపోయినట్టు నిర్ధారించారు.

## సరిహద్దు సమస్యలపై సమగ్ర దౌత్య చర్చలు

**న్యూఢిల్లీ,జూలై 25:** భారత్, చైనా మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై నిజాయితీగా దౌత్య చర్చలు జరిగాయని చైనా పేర్కొంది. ఇరుదేశాలు తమ మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై ఢిల్లీలో వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్టేషన్ అండ్ కోఆర్డినేషన్ చట్రం కింద చర్చలు జరిపాయి. దీని తర్వాత చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అందులో భారత్‌చైనా మధ్య జరిగిన చర్చలు ఎలాంటి కపటం లేకుండా నిజాయితీగా జరిగాయని పేర్కొంది. భారత్‌చైనా సరిహద్దు అంశాలపై ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు వీటి అమలుపై ఇరుపక్షాలు దృష్టిసారించాయి. అంతేకాదు త్వరలో 24వ ప్రత్యేక ప్రతినిధుల సమావేశానికి సంయుక్తంగా సిద్ధం కావడానికి అంగీకరించాయని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. డబ్ల్యూఎంసీసీ చర్చల తరువాత భారత విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా స్పందించింది. సరిహద్దుప్రాంతాల్లో ప్రశాంతతల వ్యాప్తిపై ఇరుపక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను క్రమంగా సాధారణీకరించడానికి దారితీస్తుందని తెలిపింది. అంతేకాదు ఈఏడాది చివర్లో భారత్‌లో జరగనున్న తదుపరి ఎడిషన్ ప్రత్యేక ప్రతినిధుల చర్చలకుకూడా రంగంసిద్ధం చేసినట్లు పేర్కొంది.

# ఎంపి మిథున్‌రెడ్డికి సహాయకుడినివ్వలేం

## ఎసిబి కోర్టుకు జైలు సూపరింటెండెంట్

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి సహాయకుడిని ఏర్పాటు చేయాలంటూ ఇటీవల ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఇప్పుడు రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. జైలులో ఖైదీలకు సహాయకుల్ని ఏర్పాటు చేసే నిబంధనలు లేవని, కోర్టు ఆదేశాల్లో ఉన్న మార్గదర్శకాలను పునః పరిశీలించాలని ఆయన కోరారు. జైలు నిబంధనల ప్రకారం ఒక ఖైదీ తన పనులు తాను చేసుకోలేని స్థితిలో ఉన్నా, లేదా తీవ్రమైన అనారోగ్యానికి లోనైతే తప్ప ప్రత్యేక సహాయకుడిని నియమించే అవకాశం లేదని, అటువంటి పరిస్థితుల్లో జైలులో ఉన్న ఎంఎన్వో, ఎఫ్ఎన్వో సహాయ సిబ్బందిని ఉపయోగిస్తామని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో పక్క ఏపీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి మరోసారి నిరాశ మిగిలింది. ఈ కేసులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను 29కి కోర్టు వాయిదా వేసింది. దీంతో మిథున్ రెడ్డి మరో నాలుగు రోజులు జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ఎవెన్యూలో ఘనంగా నారా రోహిత్ జన్మదిన వేడుకలు

**గుంటూరు,జులై25,ప్రభాతవార్త ప్రతినిధి :** సినీ హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలను రోహిత్ అభిమాన సంఘం మరియు టిఎన్ఎస్ఎఫ్ టిఎన్టియుసిల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముందుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటుచేసిన భారీ కేక్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నిర్మాత మరియు ఎన్టీఆర్ శతజయంతి లిటరేచర్ సావునీర్ కమిటీ కన్వీనర్ అట్లూరి నారాయణరావు గారు చేతులమీదుగా కేక్ కట్ చేయడం జరిగింది అలాగే అనంతరం వర్సిటీ ఎదురుగా గల జె.ఎం.జె ఉజ్వల హోమ్స్ లో బాలికలకు ఒకరోజు భోజనం సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే వసతి గృహంలో ఉండే విద్యార్థులకు ఆపిల్ మరియు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది.

# కాన్సర్ విస్తృతి అంచనాకు ఎన్‌సిడి 4.0 సర్వే

## -వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్‌సీడీ 3.0 సర్వే ఫలితాల ప్రకారం క్యాన్సర్ తీవ్రత తక్కువగా ఉన్నట్లు తేలడంతో...మరింత లోతుగా అధ్యయనానికి సెప్టెంబరు నుంచి ఎన్‌సీడీ 4.0 సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) సర్వే నిర్వహణపై గుంటూరు జిల్లా చినకాకానిలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి కార్యశాలను మంత్రి గురువారం ప్రారంభించారు. ఎన్‌సీడీ 3.0 సర్వేలో 4.10 కోట్ల మందని స్క్రీనింగ్ చేయాలని లక్ష్యంగా నిర్ణయిస్తే..ఇప్పటి వరకు 3 కోట్ల మందిని పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఈ స్క్రీనింగ్‌లలో దాదాపు 0.35శాతం మేరకే వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. దేశ వ్యాప్త క్యాన్సర్ ఉధృతితో పోలిస్తే ఈ ఫలితాలు తక్కువగా ఉన్నట్లు తేలడంతో మరోసారి సర్వేకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

# సోనియాజీ కన్న కలలకు కార్యరూపం

## సామాజిక ఆర్థిక సర్వే భావితరాలకు మార్గదర్శకం

## సిఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ రాహుల్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి** హైదరాబాద్,జూలై 25: తెలగాణలో సామాజిక ఆర్థిక కులసర్వే నిర్వహించడంలోకాంగ్రెస్ ప్రభుత్వంచేసిన అద్భుత కృషి ఎంతో గర్వంగా ఉందని, సోనియాజీ కన్న కలలు సాకారం చేసినట్లయిందని కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ శుక్రవారం ట్వీట్ చేసారు. ఈ సర్వే ఇపుడు దేశవ్యాప్తంగా భవిష్యత్తులో నిర్వహించనున్న జనాభా గణన, కులసర్వే కసరత్తులకు మార్గనిర్దేశం చేస్తునందనే తాను విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేతోనే తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో 42శాతం ఒబిసి రిజర్వేషన్ల సిఫారసు చేసి చరిత్రాత్మక అడుగు ముందుకు వేసిందన్నారు. ఈ బిల్లు ఇపుడు రాష్ట్రపతి ఆమోదం పొందడం కోసం వేచి ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశవ్యాప్త నమూనాగా నిలిచిందని, 21వ శతాబ్దపు డేటా ఆధారంగా రూపొందించిన ఈ సర్వే సామాజిక న్యాయంలో 2.0 అని భారత్ ఎలా ముందుకు సాగుతున్నదీ నిర్వచించిందని అన్నారు. తెలంగాణ ప్రజలు, భాష, సంస్కృతితో ముడిపడిన మా భావోద్వేగ సంబంధాన్ని ఈ సర్వేతో మరింత సుస్థిరంచేసినట్ల యిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసేందుకు సోనియాజీ నిర్వహించిన పోరాటం.

# కాంగ్రెస్‌తోనే కాపులకు న్యాయం

## - పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల..

### - పిసిసి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల కు కాపు జెఎసి వినతి పత్రం..



**విజయవాడ, జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** కాపుల సమస్యలపై ఇటీవల ప్రతిపాదించిన 12 తీర్మానాలను కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్ధన్ పిసిసి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు శుక్రవారం నాడు ఉదయం 11 గంటలకు విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ వైయస్ షర్మిల కు కాపుల సమస్యలను వివరించి చెప్పగా వైయస్ షర్మిల సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాపులను హక్కును చేర్చుకున్న చరిత్ర కాంగ్రెస్ దేనని.. కాపులకు పూర్తి న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని ఆమె అన్నారు. కాపు జేఏసీ బలపరిచిన 12 తీర్మానాలకు వైఎస్ షర్మిల సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వినతిపత్రంలో కాపు తెలగ బలిజ ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని, సమస్యల పరిష్కారంకోసం దశలవారి ఉద్యమం జిల్లా,డివిజన్,మండల స్థాయి సమావేశాలు అనంతరం విజయవాడ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో బహిరంగ సభలు.రాష్ట్రం లో కాపు వర్గాలపై జరిగే దాడులను అరికట్టాలన్నారు.కృష్ణా జిల్లాకు,ఐకాన్ బ్రిడ్జ్ కు స్వర్గీయ వంగవీటి మోహనరంగా గారిపేరు నామకరణం చెయ్యాలి, కృష్ణదేవారాయలు జయంతిని ప్రభుత్వం ఆదికారికంగా నిర్వహించాలన్నారు.కాపు కార్పొరేషన్ కు ప్రతి సంవత్సరం 3000 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలన్నారు.

# నానో ఎరువుల వినియోగం తప్పనిసరి అవసరం : వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు

**విజయవాడ, జూలై 25, ప్రభాతవార్త ప్రతినిధి :** పంటల సాగులో నానో ఎరువులు వాడటం తప్పనిసరి అని ఏపీ వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు స్పష్టం చేశారు. విజయవాడలోలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యములో "వ్యవసాయ వనరుల రంగములో నూతనముగా ఎదుగుతున్న నానో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులకు జరిగిన వర్క్ షాప్ లో ముఖ్య అతిథి గా రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిల్లీ రావు మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువుల తయారీకి అవసరమైన భాస్వరం ,పొటాష్ ,గంధకం తదితర ముడిసరకుల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తున్నదని ,పాశ్చాత్య దేశాల్లో తరచుగా యుద్ధ వాతావరణం ఏర్పడుతుండటం ,తద్వారా డాలర్ విలువ పెరిగి మన దేశానికి విదేశీ మారక ద్రవ్య వ్యయం ఎక్కువగా పెరగటం జరుగుతున్నాయని తెలిపారు .గత నాలుగేళ్లలో కరోనా తర్వాత ఎరువులకు సబ్సిడీ రూపములో 95000/ కోట్ల రూపాయల నుండి ప్రస్తుతం 1,70,000/ కోట్ల రూపాయల వరకు వ్యయం పెరిగిందని చెప్పారు .అంతేకాకుండా మన దేశం ఎరువుల ముడిసరుకు కోసం విదేశాలపై తప్పనిసరిగా ఆధారపడాల్సి వస్తున్నదని తెలిపారు. నేలలను జీవమున్న పదార్థంగా బావించి ,నేలలు బలోపేతం అవ్వటానికి తగినంత సేంద్రీయ పదార్థాలను అందించాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు . నేలలలో తగినంత సేంద్రీయ పదార్థం లేకపోవడం ,పంట దిగుబడుల కోసం రైతులు మితిమీరి రసాయనిక ఎరువులను వాడటం వల్ల నేల భూ భౌతిక పరిస్థితి దెబ్బతింటున్నదని ,కాబట్టి రైతులు ఇప్పటినుండే రసాయనిక ఎరువుల వినియోగం లో కొంతమేర పాక్షికంగా తగ్గించి వాటి స్థానములో నానో ఎరువులను వాడటం వల్ల నేల ఆరోగ్యం బాగా అభివృద్ధి చెంది ముందుతరాలకు సారవంతమైన భూముల అందించిన వారం అవు తామని తెలిపారు .

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబిసి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి: ఇబిసి జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

**హైదరాబాద్,జులై 25,ప్రభాతవార్త :**ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని,ఈబీసీ కార్పొరేషన్,ఈబీసీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఈబిసి జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఈబీసీ కార్యాలయంలో జరిగిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రవర్ణాల నిరుపేదలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయకుండా అగ్రవర్ణాల వారంతా సంపన్నులనే భావనతో విద్య,ఉద్యోగ రంగాలు, అభివృద్ధి,సంక్షేమ పథకాలను వర్తింప చేయకుండా వివక్ష చూపిస్తున్నారని, వేళ్లపై లెక్కించకలిగిన కొంతమంది అగ్రవర్ణాలలోని సంపన్నులను చూపించి అగ్రవర్ణాలలోని మెజారిటీ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు.ఇటువంటి పరిస్థితుల నుండి అగ్రవర్ణాలకు న్యాయం జరిగేందుకు పోరాటం చేయాలని అందుకు అందరూ ఏకం కావాలని రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. అగ్రవర్ణాల నిరుపేదల హక్కుల సాధనకోసం ఇటు తెలుగు రాష్ట్రాల్లో అటు దేశవ్యాప్తంగా అగ్రవర్ణాల నిరుపేదలను ఏకంచేసి ఉద్యమిద్దామని రవీందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రవిశంకర్, ఉపాధ్యక్షులుగా ఉన్నం సుబ్బారావు, నీలగిరి దయాకర్ రావు, గట్టు శ్రీనివాసా చార్యులు, నూకల పద్మారెడ్డి, ప్రచార కార్యదర్శిగా యూసుఫ్ బాబు, జాయింట్ సెక్రటరీ పోచంపల్లి రమణారావు, కోశాధి కారి ఒలం యాదగిరి గుప్త. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆరుగురు, కార్యవర్గ సభ్యులుగా 18మంది.



మీడియా సమావేశంలో మంత్రి నారాయణ, అధికారులు

# విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తాం

## - విజయవాడ మెట్రోరైల్‌కు టెండర్లు పిలుస్తాం: మంత్రి నారాయణ

**విజయవాడ.జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** మెట్రో రైల్ ప్రాజెక్ట్ ను రానున్న మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. శుక్రవారం లెనిన్ సెంటర్ లోని సీఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ 2014 ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం విశాఖపట్టణం, విజయవాడలలో మెట్రో రైల్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందన్నారు. ఫీజుబుల్టీ రిపోర్టు స్టడీ చేయడానికి ఆరు నెలలు సమయం పట్టిందన్నారు. కేంద్రం అనుమతించిన మేరకు మెట్రో రైల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ముందుగా విశాఖపట్టణంలో మెట్రో రైల్ కు టెండర్లు ఇవ్వడం జరిగిందని, నేడో, రేపో విజయవాడ మెట్రోకు టెండర్లు పిలవటం జరుగుతుందన్నారు. కేంద్రం మెట్రో రైల్ నిర్మాణానికి పాలసీ మార్చిందని మారిన పాలసీ ప్రకారం మెట్రో నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. అందుకనుగుణంగా నిన్న జరిగిన కేబినెట్ భేటీలో మెట్రో రైల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా 20 శాతం, కేంద్రం వాటాగా 20, మిగతాది కేంద్రం అనుమతితో సాఫ్ట్ లోన్ ను 30 సంవత్సరాల కాలపరిమితితో తక్కువ వడ్డీ రేటుకు అంతర్జాతీయ సంస్థల నుంచి కేంద్రం అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పీజుబులిటీ చేపట్టి మెట్రో రైల్ నిర్మాణాన్ని చేపట్టకుండా పక్కన పడేసిందన్నారు. మా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతుందన్నారు. ఇవాళ ప్రపంచవాక్షప్తంగా ట్రాఫిక్ సమస్య ఉందని దానికి పరిష్కారంగా మెట్రో రైళ్ల నిర్మాణాలను బెంగళూరు, హైదరాబాద్, నాగపూర్ తదితర ప్రాంతాల్లో చేపట్టడం జరిగిందన్నారు. మిక్స్ డ్ డబుల్డ్ పర్మిషన్స్ ను ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని క్రింది అంతుపులో పార్కింగ్, మొదటి అంతస్తులో కమర్షియల్ నిర్మాణాలు, రెండో అంతస్తులో రెసిడెన్షియల్ గా ఉండేలా పర్మిషన్స్ ఇవ్వడంతో వాక్ టూ వర్క్ లా పరిస్థితులు మారిపోతున్నాయన్నారు. జంక్షన్స్ వద్ద ట్రాఫిక్ కు ఏవిధమైన ఆటంకాలు ఏర్పడకుండా మొదటి ఫ్లైఓవర్ పై ట్రాఫిక్ వాహనాలు, రెండో ఫ్లైఓవర్ పై మెట్రో ట్రైన్ వెళ్లేలా నిర్మాణాలు ఉంటాయని దీనివల్ల వాహనాదారులకు ఏ విదమైన ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ప్రయాణించవచ్చన్నారు.

# కనకదుర్గమ్మకు శ్రావణమాసం పూజలు



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక నందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూలై 25, ప్రభాతవార్త** దుర్గమ్మవారికి శ్రావణమాసం ప్రారంభమైన తరుణంలో భక్తులు ప్రత్యేక కుంకుమార్చనల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ వికె శీనా నాయక్ భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా దుర్గమ్మవారికి రు.1000 రుసుముతో ప్రత్యేక కుంకుమార్చనను ఆర్జిత సేవగా జరుపుతామని ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు భక్తులు పాల్గొనాలన్నారు. - నిత్యాన్నదానానికి విరాళం: దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116 ల విరాళాన్ని విజయవాడకు చెందిన యలమంచిలి నాగశ్రీను శుక్రవారం అందించారు. అలాగే వీరులపాడుకు చెందిన జొన్నలగడ్డ కృష్ణవేణి తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1,01,116ల విరాళాన్ని నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. - అలరించిన నృత్యార్చన: దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం అమలాపురంకు చెందిన శ్రీ రామాంజనేయ డాన్స్ అకాడమి నాట్యాచార్యులు ఎన్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఆయన శిష్యబృందం 20 మంది నృత్యనీరాజనార్పించి భక్తులను అలరించారు.

# రాష్ట్రంలో ఆగస్టు29న ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తాం :శాప్ చైర్మన్ రవినాయుడు



సమీక్షలో శాప్ చైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ అజయ్ జైన్, శాప్ ఉన్నతాధికారులు

**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఆగస్టు29వ తేదిన క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు.నేషనల్ స్పోర్ట్స్ డే నిర్వహణపై శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ అజయ్ జైన్, శాప్ ఉన్నతాధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా సమన్వయంతో సమర్థ వంతంగా స్పోర్ట్స్ డేను నిర్వహించాలి శాప్ ఎండీ అజయ్ జైన్ కోరారు... క్రీడాసదుపాయాల కల్పన, ఏర్పాట్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు... స్పోర్ట్స్ డే విజయవంతానికి ముందస్తు సమాచారంతోపాటు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.ఈ సమావేశం అనంతరం శాప్ ఛైర్మన్ రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ క్రీడాశాఖామంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచనల మేరకు ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ డేను నిర్వహించనున్నాం ప్రత్యేక ఆకర్షణగా ఏడాది పాలనలో సాధించిన క్రీడా విజయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రీడాప్రోత్సాహకాల పంపిణీతోపాటు ఏపీలోని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.డిస్ట్రిక్ట్, జోనల్, రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణకు కసరత్తు చేస్తున్నాని శాప్ ఛైర్మన్ తెలిపారు.

# జెసి ప్రభాకర్‌రెడ్డిపై ఉన్న కేసులపై చంద్రబాబు, లోకేష్‌లు ఆలోచనలు చేయాలి

## - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**అనంతపురం, జులై 25 ప్రభాతవార్త బ్యూరో** తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తరచూ నాకు అన్యాయం జరిగిందని, నాపై అక్రమ కేసులు పెట్టారని, నాకు న్యాయం చేయాలని తరచూ చెబుతుంటారు. జెసి ప్రభాకర్‌రెడ్డిపై ఉన్న కేసులు గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఆలోచన చేయాలని ఆయనపై ఉన్న కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు తెప్పించుకుని తగిన చర్యలు తీసుకోవాలని వైసిపి నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అనంతపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో పెద్దారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేసిన వన్నీ అక్రమాలని బిఎస్-3, బిఎస్-4 వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేశాడని, అందుకు సంబంధించే కేసులు నమోదు అయ్యాయని, తప్పుడు సర్టిఫికెట్లతో వాహనాలు కొనుగోలు చేసినట్లు అధికారులు నివేదికలు ఉండటంతో కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ విధంగా చేసిన తప్పుడు పనులపై కేసులు ఉంటే నాకు చంద్రబాబు, లోకేష్ న్యాయం చేయాలని జెసి ప్రభాకర్‌రెడ్డి అడగడంలో అర్థం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు ఒక వేల నేనే తప్పు చేశానని భావిస్తే మీ వద్ద ఆధారాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవచ్చని సంబంధిత ఆధారాలను పోలీసు అధికారులకు ఇచ్చి కేసులు పెట్టుకోవచ్చని కేతిరెడ్డి పెద్దారెడ్డి వెల్లడించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి, చేసేదంతా నేరాలేనని, తాను తప్పులు చేస్తూ ఇతరులపై నిందలు వేస్తుంటారని ఆయన ఆరోపించారు.

# ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీస్‌లో రూ2.86 కోట్ల స్కాం

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూలై 25, ప్రభాతవార్త** శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ ద్వారా 2.86 కోట్ల రూపాయల మేర మోసం జరిగినట్లు సోంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ శుక్రవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. 33 మంది ఖాతాదారుల డిపాజిట్లు నుండి 2.86 కోట్ల రూపాయలు నిధులు ఆన్‌లైన్ ద్వారా గల్లంతయినట్లు వివరించారు. ఈ మేరకు ఖాతాదారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. ఈ నెల 6న పోస్టల్ వెబ్సైట్లో పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు అందిందని సంబంధించిన వ్యక్తితో ఫోన్ చేసిన తర్వాత పూర్తి ఆధారాలతో సమాచారం రావడంతో రంగంలోకి దిగిపోస్టుల ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టారని చెప్పారు. గత పది రోజులుగా చేస్తున్న విచారణలో 33 మంది ఖాతాదారుల కెవిపి బాండ్‌ల నుండి ఆన్లైన్ ద్వారా మోసం జరిగినట్లు గుర్తించామని, సిబిఐ ఈడీలకు కేసును అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 14 మందిని అనుమానితులుగా గుర్తించినట్లు చెప్పారు. వీరిలో 5 గురు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

# సింహాద్రినాథుని క్షేత్రంలో 500 కోట్లతో దేవాలయల పునర్నిర్మాణం

## :దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**సింహాచలంప్రభాత వార్త జూలై 25...**శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దేవస్థానం శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. మంత్రి కి దేవస్థాన కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, ఆలయ అధికారులు మరియు దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.మంత్రి ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసి, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితుల వేద ఆశీర్వచనము పొందారు.ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర సమాచారం కోరారు, ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని హామీ ఇచ్చారు. భక్తుల భద్రత, ఆలయ పరిసరాలలో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలను సమీకించారు. అన్నదాన పథక నాణ్యత, క్యూలైన్ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలంటూ అధికారులకు సూచనలు చేశారు. ప్రత్యేక పూజల సమయంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, దర్శనంలో సౌలభ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. భక్తుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు.ఆలయ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి ఖచ్చితమైన నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానంతో ఆలయ అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ఆలయ సేవలో ఉన్న సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, దేవాలయాల భద్రత కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఉత్సవాల సమయంలో భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.!! ఐ వి ఆర్ ఎస్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయ అని, గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది అన్నారు. దేవాలయాల్లో ఉన్నత ప్రమాణాలు నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దేవాదాయ శాఖ కమిషనర్ పరిధిలోని ఆలయ పాలకవర్గాల నియామక ప్రక్రియ ప్రారంభమైంది" అని మంత్రి స్పష్టంచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల్లో 500 కోట్ల రూపాయల వ్యయంతో పునర్నిర్మాణ పనులు చేపట్టామని, ఆలయ పరిమాణం బట్టి కాలాన్ని నిర్ణయించి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. దేవాలయాలకు పాలక మండల నియామకం ప్రారంభించమన్నారు. కొన్ని దేవాలయాల్లో ఇంకా పాత మండల కొనసాగుతున్నాయి. వాటిని తొలగించి కొత్త పాలకవర్గాలను నియమిస్తామని స్పష్టం చేశారు. ధూప, దీప నైవేద్యాలు కింద 10 వేల రూపాయలు చొప్పున ఇప్పటికే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉత్సవాలు జరిగే ఆలయాలకు ముందుగానే ప్రత్యేకమైన టీం పంపించి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సింహగిరి ప్రదక్షణ చాలా బాగా జరిగిందని భవిష్యత్తులోగిరి ప్రదక్షణకు ప్రత్యేకమైన స్థానం కల్పించేలా చర్యలు తీసుకుంటామని, దేవాలయాల్లో జరిగే ప్రధాన ఉత్సవాలన్నీ రాష్ట్ర పండగలేనని అన్నారు. క్యాడర్ స్ట్రాంగ్ సర్వీస్ రూల్స్ ని పరిగణలోకి ఖాళీలను భర్తీ చేస్తూ దేవాలయాలకు స్వాసత ఈఓ లను నియామకం చేయడం జరుగుతుంది అని అన్నారు. ఇప్పటికే కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు ధార్మిక పరిషత్ ద్వారా ఈవోల నియామకం ప్రక్రియ జరిపించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖలో ఎన్ ఎమ్ ఆర్ ఉద్యోగులు ఉన్నారని వారిని క్రమబద్ధీకరించాలంటే ప్రభుత్వంలో కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయ అని దాటవేశారు. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం అవుతుందని 12149 నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందని మంత్రి వెల్లడించారు.మంత్రికి అర్చక పెద్దల విజ్ఞాపప్రధాన ఉత్సవాల కోసం సింహాద్రి నాథుడు కొండ దిగివకు వెళ్లే మార్గాన్ని సుగమం చేయాలని సింహాచలం దేవాలయ వైదిక పెద్దలు దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డికి విజ్ఞాపన చేశారు. రానున్న విజయదశమి సందర్భంగా కొండ దిగువ ప్రత్యేక ఉత్సవం నిర్వహించవలసి ఉందని ఈ మేరకు అధికారులు మూసివేసిన మార్గం లో మెట్ల నిర్మాణం చేయవలసి ఉందని ఆర్చక పెద్దలు మంత్రి దృష్టికి తీసికొని వెళ్లారు. సాంకేతకమైన పరమైన అడ్డంకులను వీలైనంత త్వరగా తొలగించి స్వామివారి ఉత్సవానికి తీసుకొని వెళ్లలా చొరవ తీసుకోవాలని అర్చక పెద్దలు మంత్రి ని కోరారు. ఆర్చక పెద్దల వినతి పై స్పందించన మంత్రి అధికారులు తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

# ఒబిసి హక్కుల పరిరక్షణకే దేశవ్యాప్త కులగణన: రాహుల్ గాంధీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై25:**కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పదమేనని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన భాగిదారి న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఒకసారి వెనక్కి తిరిగి చూసినప్పుడు తాను ఓ తప్పు చేశానని అర్థమవుతోందని అన్నారు.ఓబీసీల హక్కులను రక్షించాల్సిన విధంగా రక్షించలేదని, అప్పట్లో ఓబీసీల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయానని పేర్కన్నారు. ఓబీసీ చరిత్ర, సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పుకాదు, ముమ్మాటికీ నా తప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాంఖి అని రాహుల్ అన్నారు. తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. ఇది తన శపథమని అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకునే సామర్థ్యం అందరికీ రావాలని,తమ శక్తిని తాము తెలుసుకోకపోవడమే కొందరి సమస్యని చెప్పుకొచ్చారు.దేశంలో దళితుల చరిత్రను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అర్థం చేసుకున్నారని చెప్పారు. చరిత్రలో ఓబీసీలు ఉన్నా,వారి గురించి ఎవరూ పట్టించుకోలేదని, ఓబీసీల చరిత్ర ఎక్కడుంది? ఎవరు రాశారు? అని రాహుల్ ప్రశ్నించారు. ఓబీసీల చరిత్ర రాయకపోవడం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర ఉందని ఆరోపించారు. బిజెపి,ఆర్ఎస్ఎస్ కలిసి ఉద్దేశపూర్వకంగా ఓబీసీల చరిత్రను తుడిచిపెట్టేశాయని ఆరోపించారు. ఓబీసీలు అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారని రాహుల్ ప్రశ్నించారు. అదానీ ఓబీసీనా, మీడియా రంగంలో ఓబీసీలకు స్థానం ఎక్కడుంది? అని ప్రశ్నించారు. అభివృద్ధిలో విద్యదే కీలకపాత్ర అని,ఇంగ్లీషు నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయని అన్నారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని బిజెపి నేతలను ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాలని రాహుల్ డిమాండ్ చేశారు. దేశంలో ప్రతి ఒక్కరికీ కలలు సాకారం చేసుకొనే హక్కు ఉందని, రైతు కుమారుడు వ్యాపారవేత్త కావొచ్చని పేర్కొన్నారు. అవకాశాలు అందిపుచ్చుకొనే సామర్థ్యం అందరికీ రావాలన్నారు. తమ శక్తిని తెలుసుకోలేకపోవడమే కొందరి సమస్యగా చెప్పుకొచ్చారు. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తెలంగాణలో పకడ్బందీగా కులగణన చేపట్టారని పేర్కొన్నారు.ప్రాంతీయ భాషలు ముఖ్యమే, అలాగే ఇంగ్లీషు కూడా కీలకమైన అని రాహుల్ అన్నారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రధాని మోదీని కొన్ని సార్లు కలిశానని, ఆయనలో అంతగా విషయం లేదని అంతా షోనేనని వ్యాఖ్యానించారు. ప్రధానిపై భారీగా హైప్ పెంచింది మీడియానేనని, ఆయనలో పెద్దగా విషయం లేదనే విషయం తనకు అప్పుడే అర్థమైందన్నారు. "ఇంతకుముందు ఎప్పుడు నేను ఆయనను కలవలేదు, కానీ ఈ మధ్యలో ఆయనను 23 సార్లు కలిశాను. అప్పుడే నాకు అర్థమైంది.

# డెలివరీబాయ్స్ దుస్తుల్లో వచ్చి నగల షాపులో చోరీ

**ఘజియాబాద్,జూలై 25:** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఫుడ్ డెలివరీ బాయ్స్ దుస్తుల్లో ఇద్దరు దొంగతనం చేశారు. సిటీలో ఉన్న జ్యువెలరీ షాపులోకి చొరబడ్డారు. గురువారం సాయంత్రం 3.30 నిమిషాలకు ఈ చోరీ జరిగింది. ఫుడ్ డెలివరీ ఏజెంట్ల తరహాలో ఎంట్రీ ఇచ్చిన ఇద్దరు ఆ తర్వాత చోరీకి పాల్పడ్డారు. నిందితులు ఇద్దరు హెల్మెట్లు ధరించారు. బ్లింకిట్, స్విగ్గీ దుస్తులు వేసుకుని వచ్చారు. మన్ని జ్యువెలరీ షాపులోకి చొరబడ్డ ఆ ఇద్దరు అక్కడ ఉన్న ఉద్యోగిని నెట్టివేసి సిల్వర్ ఐటమ్స్ ఎత్తుకెళ్లారు. డిస్‌ప్లే కేసుల్లో ఉన్న ఆభరణాలను తీసి తమ బ్యాగుల్లో కుక్కేశారు. షాపులో ఉన్న కుర్చీ తీసి అద్దాల కేజ్‌లను పగులగొట్టి వాటిల్లో ఉన్న ఐటమ్స్ దోచేశారు. టూ వీలర్ బైక్‌పై ఆ ఇద్దరూ పరారీ అయ్యారు. దొంగలు 20కిలోల సిల్వర్, 125 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. కేవలం అయిదారు నిమిషాల్లోనే ఈ తతంగం పూర్తి చేశారు. చోరీ మొత్తం సీసీటీవీ కెమెరాలకు చిక్కింది. నేను వాష్‌రూమ్‌లో ఉన్నానని, దొంగ దొంగ అని మా ఉద్యోగి అరిచాడని, పోలీసులకు ఫోన్ చేసినట్లు ఆ షాపు ఓనర్ తెలిపాడు. పోలీసులు 15 నిమిషాల్లో అక్కడకు చేరుకున్నారన్నారు.

# ఫోటోగ్రాఫర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ,జులై25,ప్రభాతవార్త:** నియోజకవర్గ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అభివృద్ధి,సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ



ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వీఎల్ఎస్ ఫంక్షన్‌హాలు నందు జరిగిన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశానికి చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని జీ.వీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. యూనియర్ భవన నిర్మాణం కొరకు స్థలం కేటాయించి అసోసియేషన్ అభివృద్ధికి అండగా ఉంటామన్నారు. భవన నిర్మాణానికి వ్యక్తిగతంగా రూ.1లక్ష విరాళం ప్రకటించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వైకాపా కార్యకర్తను పరామర్శించిన దొంతి రెడ్డి వేమారెడ్డి

**మంగళగిరి, జూలై 25, ప్రభాతవార్త:** పెదవడ్లపూడి గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ కార్యకర్త షేక్ కరీముల్లా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకొని మంగళగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దొంతి రెడ్డి వేమ రెడ్డి శుక్రవారం స్వయంగా కరీముల్లా ఇంటికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యం చెప్పి మేమున్నాం నీకేం భయం లేదని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి మండలం వైసిపి అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ యాదవ్, గ్రామ అధ్యక్షులు గుర్రం భరత్ , గుంటూరు జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షులు బొక్కా ఆగస్టిన్, మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి సద్దాం హుస్సేన్, మంగళగిరి మండల కార్యదర్శి షేక్ బాజీ షాహిద్ , మంగళగిరి మండల ఎస్టీసెల్ అధ్యక్షులు దుర్గా నాయక్ గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో 10మంది బైక్ దొంగలు అరెస్టు

**గుంటూరు తూర్పు, జులై 25 (ప్రభాతవార్త)** : వ్యసనాలకు అలవాటు పడిన నిందితులు ఇళ్ళ బయట, మార్కెట్ ప్రదేశాల్లో, ఆసుపత్రులు, ప్రార్ధన స్థలాలు, పార్కింగ్ చేస్తున్న వాహనాలను చోరీలకు పాల్పడుతున్నట్లు వారిని పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు సంబంధించి ఫిర్యాదులు ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు, పాత నేరస్తులు, సాంకేతిక ఆధారాలతో కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని



అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న 9మందిని అదుపులోకి వారి వద్ద నుండి షుమారు రూ.25లక్షలు విలువైన 34ద్విచక్ర వాహనాలను రికవరీ చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. నగరంలో కంత కాలంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనాలుకు గురవుతున్నాయని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించి ద్విచక్ర వాహనాల దొంగతనాలపై దృష్టి సారించారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడానికి ద్విచక్ర వాహనాల రికవరీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా తూర్పు, పశ్చిమ పోలీస్ సబ్ డివిజన్లలోని పట్టాభిపురం, పాత గుంటూరు, నగరంపాలెం, తాడికొండ విచారించి, వారు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ద్విచక్ర వాహనాలను ఈస్ట్, వెస్ట్, నల్లపాడు, తాడికొండ మరియు క్రైమ్ విభాగం పోలీస్ వారు రికవరీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో చోరీల నియంత్రణకు నిఘాను మరింత పటిష్టం చేస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. వాహనదారులు తమ వాహనాలను సరైన ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. పార్కింగ్ చేసే సమయంలో హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్‌లాక్ మరియు పిజిఎస్ సిస్టమ్ అమర్చుకోవాలని ఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహనాల రికవరీలో విశేష కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ కె.సుప్రజని, సిసిఎస్ డిఎస్పీ శివాజీరాజు, ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డిఎస్పీ అరవింద్, నగరపాలెం, పాత గుంటూరు, తాడికొండ పోలీస్ స్టేషన్ల సిఐలు, సీసీఎస్, సిఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీ అభినందించారు.


# అన్ని మేనేజ్‌మెంట్లలో తక్షణమే అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి

## -బొనిగల హైమారావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నోబుల్ టీచర్స్ అసోసియేషన్

**గుంటూరు విద్య,జూలై 25,ప్రభాతవార్త :** చాలా సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంతర్ జిల్లా బదిలీలు జరగకపోవడం వల్ల తల్లిదండ్రులు,భార్యాభర్తలు,పిల్లలకు దూరంగా సుదూర ప్రాంతాల్లో కుటుంబాలకు దూరంగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అందుచేత తక్షణమే అంతర్ జిల్లా బదిలీలు అన్ని మేనేజ్‌మెంట్లలో చేపట్టి మానవతా దృష్టితో ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పక్షాన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు కె.శ్రీనివాసరావు,బి.హైమారావులు కమీషనర్ ఆఫ్ స్కూల్ ఎడు య్కేషన్ జాయింట్ డైరెక్టర్ ఏ.సుబ్బారావును కలసి విజ్ఞప్తి చేశారు.అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని చోట అక డమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాలని చిత్తూరు.కర్నూలు జిల్లాల్లో బదిలీల్లో జరిగిన లోపాలను సవరించాలని,యాప్‌ల భారం తగ్గించాలని మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.ఫేషియల్ అటెండెన్స్ విషయంలో పది నిమిషాల గ్రేస్ పిరియడ్‌ను కొంతమంది డిఈవోలు పరిగణించకుండా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకురాగా,వెంటనే తగిన ఆదేశాలు ఇస్తామని వారు తెలిపారు.ఇంకా ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్ నిధులు విడుదల చేయకపోవడంపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయగా డిఈవోలకు పంపామని త్వరలో క్రెడిట్ అవుతాయని తెలిపారు.విజయవాడలో స్కూల్ ఎడు య్కేషన్ అధికారులతో ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరిగిన నేపధ్యంలో అసోసియేషన్ నాయకులు జాయింట్ డైరెక్టర్లను కలసి వినతి పత్రం అందజేశారు.

# వర్సిటీలో అలరించిన ప్రాతిగ్య

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై25, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో సంగీత నాటక అకాడమీ శుక్రవారం నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ప్రాతిగ్య కార్యక్రమం అలరించింది. బాలమోహన్ దాస్ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ (న్యూఢిల్లీ) నుంచి పాల్గొన్న డాక్టర్ యస్.పి.భారతి, దీపక్ జోషిలు ప్రాతిగ్య( ఫీల్డ్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్) ను అత్యద్భుతంగా నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన కర్ణాటక సంగీత విద్వాంసులు మండా సుధారాణి సంగీతం యొక్క ప్రాధాన్యతను వివరించారు. వేదాంతం రాధేశ్యామ్ కూచిపూడి నృత్య ప్రదర్శనను అందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య



జి.సింహాచలం, విజయవాడకు చెందిన విద్వాంసులు దుర్గాభవాని, సుధాకర్, సరస్వతీ, గుంటూరు మహిళ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పి.నందకుమార్, సురేష్‌బాబు, ప్రభాకర్‌లు పాల్గొన్నారు. వర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజిక్ అధ్యాపకులు ఆచార్య మంజుల, పావనిలు ప్రాతిగ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# శ్రావణ మాసం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**కొల్లిపర, జులై 25 (ప్రభాతవార్త) :** శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కావటంతో మండలంలోని దేవాలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు మహిళల చేత



పూజలు చేయించి శ్రావహనాసం వృత్తాంతం గురించి తెలియజేశారు. మండల కేంద్రం కొల్లిపర శ్రీ గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో, శ్రీ షిర్డిసాయిబాబా మందిరంలో పండితులు జగన్నాధాచార్యులు, కుమారస్వామి, పిచ్చియ్యశర్మలు దేవతా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు.

# వాసవి అమ్మవారికి విశేష అలంకరణ

**సత్తెనపల్లి, జూలై 25 ప్రభాతవార్త :** పట్టణంలో వేంచేసియున్న శ్రీ వాసవి అమ్మవారికి శుక్రవారం విశేష అలంకరణలు జరిగాయి. శ్రావణమాసం కావడం తో శుక్రవారం ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. విశేష కైకార్యం అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# కోటప్పనగర్‌లో సమగ్ర ఆరోగ్య ప్రచారం

**ఫిరంగిపురం,జూలై 25 ప్రభాతవార్త :** కోటప్పనగర్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ వారి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహించారు. 104 వైద్య సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రచారంలో భాగంగా సాధారణ ప్రజలకు హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సురేష్, ఆషా, జయలక్ష్మి, ప్రమీలారాణి, శైలజా, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు వైద్యపరమైనటువంటి అనేక విషయాలపై వారు అవగాహన కల్పించారు. అదే విధంగా జబ్బులు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

# కవికోకిల గుర్రం జాషువా సాహిత్యం చిరస్మరణీయం

**గుంటూరు కల్చరల్,జూలై 25,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళాస్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ ఆధ్వర్యంలో కవికోకిల గుర్రం జాషువా 54వ వర్ధంతి సందర్భంగా సాహిత్య సభ జరిగింది.సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తాళ్ళూరి వెంకటరత్నారావు సభా పరిచయం



చేశారు.సభాధ్యక్షులుగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్,ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్,తెలుగుశాఖ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆచార్య ఇరవని మాధవి,ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు.సభానంతరం గవర్నర్ అవార్డు గ్రహీత డాక్టర్ పెద్దిటీ యాహును,జాతీయ అవార్డు గ్రహీత,తెనాలి డాక్టర్ ఐనాల మల్లేశ్వరరావు,విశ్రాంత ఎంఈఓ,వినుకొండ సిహెచ్ జాన్ సుందరరావులను ముఖ్యఅతిధి,మరియు అతిధులు,సంస్థ వారు కలసి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిధులను కళాస్రవంతి అధ్యక్షులు డాక్టర్ ప్రభుదాస్ మరియు కార్యవర్గం వారు సత్కరించారు. ముఖ్యఅతిధి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కవికోకిల గుర్రం జాషువా సాహిత్యం చిరస్మరణీయం,అత్యంత సరళమైన రీతిలో ప్రతి ఒక్కరి మనస్సుకు హత్తుకునేలా ఉంటాయన్నారు.

# తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు

**సంతమాగులూరు, జులై 25 ప్రభాతవార్త,** మండలంలోని మక్కెనవారి పాలెం - కొమ్మాలపాడు మధ్యలో ఉన్నటువంటి వేస్ట్ పదార్థాల ఫ్యాక్టరీ ద్వారా వాసన వస్తుందని ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని శుక్రవారం మకర పర్యటనకు వచ్చిన మంత్రి దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లగా వెంటనే అది పరిశీలించాలని తాసిల్దార్ కు ఆదేశాలు జారీ చేయటంతో తహసీల్దార్ రవిబాబు ఫ్యాక్టరీ వద్దకు వచ్చి పరిశీలించి వెంటనే ఈ ఫ్యాక్టరీని మూసివేయాలని అలాగే ఈ ఫ్యాక్టరీ విద్యుత్ కట్ చేయాలని విద్యుత్ ఏఇ దీపక్ రెడ్డి స్థానిక అధికారులకు సూచించారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా ఎంతో మంది విద్యార్థులు గ్రామస్తులు పశువులు చాలా ఇబ్బందులకు గురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

# వీఆర్వో ఉన్నట్టా..? లేనట్టా..?

**ప్రత్తిపాడు జులై 25 (ప్రభాతవార్త):** పౌర సేవలు సకాలంలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సంఘటన ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో చోటుచేసుకుంది.ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వారి సేవలకు ఎక్కడా విఘాతం కలగకుండా ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామనే అధికారుల ప్రగల్భాలు నీటిపై రాతల్లా మారుతున్నాయి.రేషన్ కార్డులో పేర్లు మార్పులు చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగింది.ఈ అవకాశాన్ని అందుపుచ్చుకొని రేషన్ కార్డులో పేర్లు మార్పులు చేర్పులకు అర్జీ పెట్టుకున్న బాధితులకు అక్కడి స్థానిక సచివాలయం వద్దకు వెళితే చేదు అనుభవాలు ఎదురు అలవుతున్నాయి.పెద్ద గొట్టిపాడు గ్రామ సచివాలయంలో వీఆర్వోగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగి సకాలంలో అందుబాటులో లేకపోవడంతో అర్జీదారులు ఉసూరమంటూ వెనుతిరిగి వెళ్ళిపోవాల్సి వస్తుంది.అయితే ఇటీవల కాలంలో అక్కడ విధులు నిర్వహించే వీఆర్వో లేకపోవడంతో మరో విఆర్ఓని అక్కడ సచివాలయానికి బదిలీ చేసినట్లు తెలుస్తోంది.కాగా కొన్ని రోజులుగా ఆ వీఆర్వో ఉద్యోగ బాధ్యతలు అక్కడి సచివాలయంలో నిర్వహిస్తున్నారా లేదా అనే అనుమానాలు వస్తున్నాయి. స్థానికంగా ఉంటూ ఉద్యోగ బాధ్యత నిర్వహించాల్సిన వీఆర్వో తన ఫోన్ నంబరును అర్జీదారులకు ఇచ్చి వెళ్లినట్లు విశ్వాసనీయవర్గాల సమాచారం.దీంతో సదర ఉద్యోగి సచివాలయానికి వచ్చాడేమో అనుకొని అక్కడికి వెళ్లిన అర్జీదారులు వీఆర్వోకు ఫోన్ చేసినప్పటికీ అతని వద్ద ఉండే అసిస్టెంట్ కు ఫోన్ ఇచ్చి మాట్లాడిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు.వీఆర్వో వచ్చాడని ఒకసారి రాలేదని మరోసారి వచ్చాక ఫోన్ చేసి రమ్మంటామంటూ మరో మాట చెప్పటం సేవలు పొందే స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.గ్రామ స్థాయి అధికారులు ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే దానిపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వలన గ్రామస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు అన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇప్పటికైనా స్పందించి జిల్లా ఉన్నతాధికారులు గ్రామస్థాయి అధికారుల సేవలు సకాలంలో అందు బాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

# ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలి

## -కెఎల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగాధికారి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్

**తాడేపల్లి,జూలై 25,ప్రభాతవార్త :** ప్రకృతి మనకందించిన సహజ వనరులను పరిరక్షించాల్సి బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని,అందుకు ప్రజల్లో చైతన్యం రావాలని కెఎల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగాధికారి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ సూచించారు.నూతక్కి గ్రామంలో యూనివర్సిటీ సీఎస్ఈ,ఏఐ అండ్ డిఎస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి వనరుల రక్షణపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే గాలి,నీరు,భూమి, అడవులు,వన్యప్రాణులు,ఇంధన వనరులు, ఖనిజాలు లో కొన్ని వనరులను దుర్వినియోగం చేస్తే పునరుత్పత్తి చేయలేమని తద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రమాదం ఉందని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. మొక్కలు నాటడం,నీటిని పున: వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం,పునర్వినియోగశీల ఇంధనాలను వాడటం,గాలి కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని సీఎస్ఈ మరియు ఏఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎ.సింథిల్ అథితన్,డాక్టర్ విఎస్‌వి ప్రభాకర్



పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను, ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్‌లను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

# సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శిగా చిన్ని తిరుపతయ్య మరోసారి నియామకం

**తాడేపల్లి,జూలై 25,ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శిగా చిన్ని తిరుపతయ్య మరోసారి ఎన్నికయ్యారు.మంగళగిరి పట్టణంలోని మార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ మహాసభ సందర్భంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశానికి సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అధ్యక్షత వహించారు.సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శిగా మరోసారి చిన్ని తిరుపతయ్య ను నియమిస్తూ కౌన్సిల్ సమావేశం



ఏకగ్రీవంగా తీర్మానించింది.సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులుగా యార్లగడ్డ వెంకటేశ్వరరావు,కంచర్ల కాశయ్యలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యపు విధానాలపై అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ,వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.నియోజకవర్గ కౌన్సిలింగ్ సభ్యులుగా 43మందిని ఎన్నుకున్నారు.నియోజకవర్గ కమిటి సభ్యులుగా 11మందిని ఎన్నుకున్నారు.కమిటీ సభ్యులుగా యార్లగడ్డ వెంకటేశ్వరరావు,కంచర్ల కాశయ్య,జాలాది జాన్‌బాబు,అన్నవరపు ప్రభాకర్,నందం బ్రహ్మేశ్వరరావు,బత్తూరి మోహనరావు,చిన్ని సత్యనారాయణ,మునునూరి సుహాస్,జాలాది నవీన్,గుడిమెట్ల శివకుమారి లను ఎన్నుకున్నారు.

# క్వాంటం టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

## - ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై25, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక విప్లవం నిత్య నూతనంగా కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇచ్చేలా పాఠ్యప్రణాళిక రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి కొత్త పాఠ్య ప్రణాళిక ప్రకారం పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియకు సంబంధించి ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నాగార్జున వర్సిటీలో 3రోజుల వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆచార్య మధుమూర్తి మాట్లాడారు. నూతనంగా అమల్లోకి రానున్న పాఠ్య ప్రణాళిక చట్రంలో 11 కోర్ పేపర్లతో మేజర్, 4 ఎలక్టివ్ పేపర్‌లు, 6 మైనర్ ఉంటాయన్నారు. మొత్తం 12 సబ్జెక్టులకు సంప్రదాయ డిగ్రీప్రోగ్రామ్‌ల మోడల్ సిలబస్ తయారీ కమిటీలు ఏర్పాటు చేసి పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియను వర్క్‌షాపు ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా సిద్ధమవ్వాలని సూచించారు. నేటితరం విద్యార్థులు ఆ టెక్నాలజీకి



అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన చేయాలని అన్నారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగానే మిగిలిపోకుండ పారిశ్రామికవేత్తలుగా, సంపద సృష్టికర్తలుగా ఎదగాలంటే సాంకేతిక శోభతో కూడిన విద్యావిధానం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి టి.వి.కృష్ణమూర్తి, కోఆర్డినేటర్ ఆచార్య జి.రోశయ్య, జి.శ్రీరంగం మాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రావణ మాసం పూజలు ఆరంభం

**బల్లికురవ, జులై 25, ప్రభాతవార్త :** వేదాధ్యాయ మాసంగా పేరుపొందిన శ్రావణ మాసం వస్తూ వస్తూనే ప్రజల అందరిలో ఆనందాన్ని తీసుకువస్తుంది. నూతన వధువులకు, గృహిణులకు, బ్రహ్మచారులకు, గృహస్తులకు, లౌకిక ఆనందాన్ని, పంచటమే కాక, ఆధ్యాత్మిక ఆనందాన్ని సమకూర్చేదే శ్రావణం. పచ్చని పల్లె సీమలలో లోగిలి పసుపు, కుంకుమలతో, పచ్చని మామిడాకుల తోరణాలతో ఏర్పడిన లక్ష్మీ శోభతో ఉజ్వలంగా ప్రకాశిస్తుంటాయి. ఈ సందర్భంగా గ్రామ దేవతలైన పోలేరమ్మ తల్లి, అంకమ్మ తల్లి, రేణుకమ్మ తల్లి, దేవాలయాలలో అమ్మవారి మూలవిరాట్లను సర్వాంగ సుందరంగా అలంకరిస్తుంటారు. ఈ మాసంలోనే పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. పూర్ణిమనాడు ఆడ పిల్లలందరూ తమ సోదరులకు రాఖీ కట్టి సోదర ప్రేమను పంచుకుంటూ ఆనందం పొందుతుంటారు. లక్ష్మీదేవికి, శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసంగా శ్రావణమాసాన్ని, వేదాలలో సైతం అభివర్ణించారు. ఈ సందర్భంగా పల్లె సీమలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తి భావంతో పులకించిపోతున్నాయి. తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారి దేవాలయాలలో సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

# వైఎస్ షర్మిలరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వెంకటకృష్ణారెడ్డి

**దర్శి, జులై 25, ప్రభాతవార్త :** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని విజయవాడలోని పార్టీకార్యాలయంలో రాష్ట్ర అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల చైర్మన్ దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ కైపు వెంకట కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ నిధుల రాకపోవడం విషయం అలాగే గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు జీతాలు లేక వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యల మీద అలాగే చీమకుర్తి గ్రానైట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి దర్శి నియోజకవర్గంలో రైతుల సమస్యలపై వైఎస్ షర్మిలారెడ్డితో నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కైపు వెంకటకృష్ణారెడ్డి చర్చించారు. ముఖ్యంగా దర్శి నియోజకవర్గ దొనకొండ ప్రభుత్వ భూముల, దర్శి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్, మొగిలిగుండ ఆగిపోయిన నిర్మాణ పనులతో పాటు తదితర వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆమె పలు సూచనలు చేసినట్లు తెలిసింది.

# విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

**సీఎస్‌పురం, జులై 25, ప్రభాతవార్త :** ఆనికాలపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామాగ్రి నోట్ పుస్తకాలు, కాపీ రైటింగ్ బుక్స్ ఎక్కాల పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, ఆనికాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చింతలపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దాత గుంటిమడుగు శ్రీనివాసవర్మ సహకారంతో పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనికాలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జే.భారతి, ఉపాధ్యాయురాలు ఎన్‌వీఎస్‌వీ అలేఖ్య, ఎస్కే చైర్‌పర్సన్ ఎస్కే అఫ్రోజ్, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించిన అధికారులు


**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై25, ప్రభాతవార్త:** వర్సిటీలోని డాక్టర్ వైయస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరుగుతున్న బిటెక్ ప్రవేశాల ప్రక్రియను తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు పరిశీలించారు. సివిల్ అండ్ మెకానికల్ బ్లాక్‌లో విద్యార్థులతో, వారి తలిదండ్రులతో మాట్లాడారు. అడ్మిషన్ల కోసం వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ గోపీ కృష్ణ, డాక్టర్ చంద్రమౌళిలు ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లుపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 70శాతం మంది విద్యార్థులు రిపోర్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ యం.డి.తౌసిఫ్. విభాగాధిపతులు, అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

**సజావుగా యోగా పరీక్షలు**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై25, ప్రభాతవార్త: వర్సిటీ పరిధిలో యంఎస్సీ యోగా కోర్సు నాల్గవ సెమిస్టర్ పరీఓలు శుక్రవారం సజావుగా ప్రారంభమయ్యాయని పీజీ పరీక్షల తాత్కాలిక కోఆర్డినేటర్ ఆచార్య మన్నవ సుబ్బారావు తెలిపారు. పలు విభాగాల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లు, బుక్‌లెట్‌లు, గ్యాలీలు తనిఖీచేశారు.

# ఎమ్మెల్యే నరేంద్రను కలిసిన వర్సిటీ ఉద్యోగులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై25, ప్రభాతవార్త:** వర్సిటీలోని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల సంఘం శుక్రవారం పొన్నూరు యంఎల్ఏ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను



కలిశారు. వర్సిటీలో ఎన్నో ఏళ్ళుగా దినసరి ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న తమకు టైంస్కేల్ వర్తింప చేయాలని కోరారు. తెలుగు అకాడమీలో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులకు హైకోర్టు ఆదేశాలతో టైంస్కేల్ అమలు జరుగుతున్నదని ఆయనదృష్టికి తీసుకెళ్ళారు. మాకు కూడా టైంస్కేల్ విధానం వర్తింప చేసేలా చొరవ చూపాలని కోరారు. యంఎల్ఏను కలిసిన వారిలో టిఎన్‌టియుసి వర్సిటీ అధ్యక్షుడు వి.విష్ణుప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# వచ్చే ఐపిఎల్ సీజన్‌కు..
# పాత జట్లకు ముగ్గురు గుడ్ బై

**• ఫ్రాంచైజీలు మారనున్న ప్లేయర్లు • ఆల్‌రౌండర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ వేట**


సంజూ శాంసన్


ఇషాన్ కిషన్


వెంకటేష్ అయ్యర్

**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని ఫ్రాంచైజీలు కొత్త సీజన్ కోసం సిద్ధమవుతున్నాయి. ఐపిఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ఇంకో ఎనిమిది నెలల సమయం ఉంది. అయితే గత సీజన్ ముగిసిన వెంటనే ట్రేడ్ విండో ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆటగాళ్లను ట్రేడ్ విండోద్వారా భర్తీ చేసుకునేందుకు ఫ్రాంచైజీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ముగ్గురు కీలక ప్లేయర్లు ఫ్రాంచైజీలు మారేందుకు సిద్ధమవుతున్నారు. సంజూశాంసన్‌తో పాటు మరో ఇద్దరు భారత ఆటగాళ్లు వచ్చే సీజన్‌లో ఫ్రాంచైజీ మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఐపిఎల్‌లో గత కొన్నాళ్లుగా సంజూ శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఆ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ వికెట్ కీపర్ బ్యాటర్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అతడిని ట్రేడ్ ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తోంది.ఎంఎస్ ధోని వచ్చే సీజన్‌లో ఆడడం అనుమానం అని, అందుకనే అనుభవజ్ఞుడైన,నమ్మకమైన వికెట్ కీపర్‌కోసం చెన్నై వెతుకుతున్నట్లు ఫ్రాంచైజీవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సంజూపై దృష్టి సారించినట్లు సమాచారం. అలాగే ఐపిఎల్ 2025 సీజన్‌లో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 14 మ్యాచ్‌ల్లో 354 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం కూడా ఉంది. అయితే నివేదికల ప్రకారం వచ్చే సీజన్‌లో అతడు కోల్‌కతా నైట్ రైడర్స్ తరుపున ఆడొచ్చు. నైట్ రైడర్స్ వారి బ్యాటింగ్ లైనప్ బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన వికెట్ కీపర్ కోసం వెతుకుతోంది. ఈ క్రమంలోనే కిషన్‌ను ట్రేడ్ విండో ద్వారా కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక ఐపిఎల్ 2025 మెగా వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.23.75 కోట్లు వెచ్చించి మరీ వెంకటేష్ అయ్యర్‌ను సొంతం చేసుకుంది. అయితే ఈ సీజన్‌లో వెంకటేష్ అయ్యర్ పెద్దగా రాణించలేదు. 21 సగటుతో 142 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో అతడిని వదులుకునేందుకు కోల్‌కతా సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బ్యాట్, బంతితో రాణించే భారత ఆల్‌రౌండర్ కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలో ట్రేడ్ విండో ద్వారా కెకెఆర్, హైదరాబాద్ జట్లు వెంకటేష్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను మార్చుకోనున్నట్లు సమాచారం. అయితే మరికొద్ది రోజుల్లోనే దీనిపై స్పష్టత రానుందని అంటున్నారు.



## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో..
# వైష్ణవికి కాంస్యం
## పరుగులో అనిమేష్ విఫలం

**న్యూఢిల్లీ:** 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో భారతదేశానికి మిశ్రమ ఫలితాలు చోటు చేసుకున్నాయి. వైష్ణవి అడ్కర్ మహిళల సింగిల్స్ టెన్నిస్‌లో కాంస్య పతకాన్ని సాధించడం ద్వారా చరిత్ర సృష్టించగా, 200 మీటర్ల పురుషుల పరుగులో అనిమేష్ పతకానికి దూరమయ్యాడు. శుక్రవారం జరిగిన మహిళల టెన్నిస్‌లో వైష్టవి పతకాన్ని సాధించడం ద్వారా 46 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికింది. స్లోవేకియాకు చెందిన ఎస్జెర్ మెరీతో జరిగిన వీరోచిత పోరాటం తర్వాత పుణేకు చెందిన 21 ఏళ్ల వైష్టవి సెమీఫైనల్లో 6-2, 4-6, 4-6 తేడాతో అధిగమించింది. అడ్కర్ మొదటి సెట్‌ను 6-2తో సాధించింది. కానీ మెరీ తిరిగి పుంజుకుని తరువాతి రెండు సెట్‌లను ఆధిక్యం కనపరచింది. సెమీఫైనల్ ఓటమి ఉన్నప్పటికీ, చివరి నాలుగు స్థానాలకు అడ్కర్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేసింది. ఆమె నాలుగు రౌండ్లలో ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ప్రతి మ్యాచ్‌లోనూ ఆధిపత్యాన్ని సంపాదించింది. 64వ రౌండ్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన జోలియన్ మరియా జెనియా గీల్స్‌పై 2-0 తేడాతో ఆమె ప్రచారం ప్రారంభమైంది. తదుపరి రెండు రౌండ్లలో ఫిన్లాండ్‌కు చెందిన వెన్లా ఎలిసా అహ్తో, కెన్యాకు చెందిన ఏంజెల్లా ఒకుటోయిపై వరుస సెట్ల విజయాలతో ముందుకు సాగింది. క్వార్టర్ ఫైనల్లో, అడ్కర్ జర్మనీకి చెందిన సినా హెర్మాన్‌ను ఎదుర్కొని మరోసారి 2-0 తేడాతో క్లీన్ విజయంతో ఫైనల్ ఫోర్‌లో స్థానం సంపాదించి, కనీసం కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాగా 200 మీటర్ల పురుషుల ఫైనల్‌లో 20.85 సెకన్ల స్వల్ప సమయం నమోదుతో 4వ స్థానంలో నిలిచి భారత ఏస్ స్ప్రింటర్, జాతీయ రికార్డు హోల్డర్ అనిమేష్ కుజుర్ పతకాన్ని కోల్పోయాడు.

## మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ..
# భారత జట్టుకు టైటిల్

**న్యూఢిల్లీ:** యూనివర్సిటీ గేమ్స్‌లో టీమ్ ఈవెంట్లలో భారత మిక్స్‌డ్ కాంపౌండ్ జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. టీమ్ ఈవెంట్లలో భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక స్వర్ణం, ఒక రజతం, మరియు ఒక కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. శుక్రవారం జర్మనీలోని ఎస్సెన్‌లో జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కుశాల్ దలాల్ మరియు పర్నీత్ కౌర్‌ద్వయం బంగారు పతకాన్ని సాధించడంతో భారత కాంపౌండ్ మిక్స్‌డ్ జట్టు తమ ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్ టైటిల్‌ను నిలుపుకుంది. ఈ జంట 160 పాయింట్లకు గాను 157 పాయింట్లు సాధించి, ఫైనల్‌లో దక్షిణ కొరియా జంటను మూడు పాయింట్ల తేడాతో ఓడించింది. 2025 ఎఫ్ఐఎస్‌యు వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారతదేశానికి తొలి బంగారు పతకాన్నిసాధించింది. అంతకుముందు, భారత పురుషులు మరియు మహిళల కాంపౌండ్‌జట్లుకూడా రజత మరియు కాంస్యపతకాలను గెలుచుకున్నాయి. ఈ క్రీడలలో భారత్ ఖాతాలో మొత్తం పతకాల సంఖ్యను 5కు చేరాయి. 1 స్వర్ణం, 1 రజతం, 3 కాంస్య పతకాలు. పర్నీత్, అవనీత్ కౌర్ మరియు మధుర ధమన్‌గోంకర్‌లతో కూడిన మహిళల జట్టు గ్రేట్ బ్రిటన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరోపక్క కుశాల్, సాహిల్ జాదవ్ మరియు హృతిక్ శర్మలతో కూడిన భారత్ పురుషుల జట్టు ఫైనల్‌లో తుర్కియే చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయింది. కుశాల్, పర్నీత్ రేపు వ్యక్తి గత కాంపౌండ్ ఈవెంట్ సెమీఫైనల్స్‌లో కూడా పోటీ పడనున్నారు. దేవ్ మీనా జాతీయ రికార్డు మరోవైపు, ఈ వర్ధమాన భారత పోల్ వాల్టర్ పురుషులపోల్‌వాల్ట్ ఈవెంట్‌అర్హతరౌండ్‌లో తనసొంతజాతీయ రికార్డును మెరుగుపరుచుకున్నాడు.

# మరోసారి ఇంగ్లాండ్‌కు టీమిండియా

**వన్డే, టి20 సిరీస్ షెడ్యూల్ విడుదల**

**వన్డేలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎంట్రీ**

**న్యూఢిల్లీ:** భారత జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. అక్కడ ఆతిథ్య జట్టుతో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. టెస్ట్ సిరీస్ ఉత్కంఠ మధ్య మరో వన్డే, టి20 షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ నియంత్రణ బోర్డు విడుదల చేసింది. దీంతో టీమిండియా మరోసారి ఇంగ్లాండ్‌లో పర్యటించనున్నది. ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు, భారత క్రికెట్ బోర్డు వచ్చే ఏడాది భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు టి20, మూడు ఓడీఐ మ్యాచ్‌లు ఆడనున్నట్లు ప్రకటించాయి. ఓడీఐ, టి20 సిరీస్‌లు రెండూ జూలై 2026లో ఇంగ్లాండ్‌లో జరగనున్నాయి. ఇక ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ జూలై 1న ప్రారంభంకానుండగా, వన్డే సిరీస్ అదే నెల 14న ప్రారంభమవుతుంది.ఆతర్వాత మిగిలినటి20 మ్యాచ్‌లు జూలై 4, 7, 9, 11 తేదీల్లో జరుగుతాయి. దీని తర్వాత మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఉంటుంది. వన్డే సిరీస్‌లో మొదటి మ్యాచ్ జూలై 14న జరుగుతుంది. మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూలై 16, 19 తేదీల్లో జరుగుతాయి. వచ్చే ఏడాది ఇంగ్లాడ్‌తో జరిగే వన్డే సిరీస్లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడనున్నారు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు తొలిసారి ఇంగ్లాండ్‌లో ఆడనున్నారు. కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న టి20 ప్రపంచ కప్ తర్వాత భారత్‌ఆడే తొలిటీ20 సిరీస్ ఇదే కావచ్చు. భారతజట్టు ఇంగ్లాండ్‌పర్యటన షెడ్యూల్ టి20 సిరీస్‌కు సంబంధించి జూలై 1న మొదటి టి20, డర్హమ్‌లో రాత్రి 11.00గంటలకు, 4న 2వ టి20, మాంచెస్టర్‌లో రాత్రి 7 గంటలకు, 7న 3వ టి20 నాటింగ్హామ్‌లో రాత్రి 11.00 గంటలకు, 9న నాలుగవ టి20 బ్రిస్టల్‌లో రాత్రి 11.00 గంటలకు, 11న 5వ టి20 సౌతాంప్టన్‌లో రాత్రి 11.00గంటలకు, వన్డే సిరీస్‌కు సంబంధించి 14 జూలైన మొదటివన్డే బర్మింగ్హామ్‌లో సాయంత్రం 5.30 గంటలకు 16న 2 వన్డే కార్డిఫ్‌లో సాయంత్రం 5.30గంటలకు, 19న 3వవన్డే లండన్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరగనున్నాయి.

## వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో..
# సెమీఫైనల్స్‌కు అనహత్



**న్యూఢిల్లీ:** అనాహత్ సెమీస్‌కు అర్హత సాధించింది. 2025 ప్రపంచ స్క్వాష్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశపు అగ్రశ్రేణి మహిళా స్క్వాష్ క్రీడాకారిణి అనహత్ సింగ్ ఒక పురోగతిని నమోదు చేసింది. అనూహ్యంగా సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో తన తొలి పతకాన్ని నిర్ధారించు కుంది. ఢిల్లీకి చెందిన 17 ఏళ్ల, రెండవ సీడ్, క్వార్టర్ ఫైనల్స్‌లో ఈజిప్ట్‌కు చెందిన మలికా ఎల్కరాక్సీని 11-6, 13-11, 11-5 తేడాతో ఓడించి, ఆమె చివరి ఎనిమిది నిష్క్రమణల పరంపరను బద్దలు కొట్టింది. కైరోలోని బ్లాక్ బాల్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన పక్షపాత స్వదేశీ ప్రేక్షకుల ముందు జరిగిన ప్రారంభ గేమ్‌లో 5-6తో వెనుకబడిన తర్వాత, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి మొదటి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండవ గేమ్‌లో ఎల్కరాక్సీ రెండు గేమ్ బంతులను పట్టుకుంది, కానీ అనాహత్ ధైర్యంగా 13-11 తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థి బలహీనతను అవకాశంగా తీసుకున్న అనాహత్ త్వరగా మూడవ గేమ్‌ను ముగించింది.2022, 2023, 2024లో వరుసగా మూడు సంవత్సరాలు జూనియర్ వరల్డ్స్‌లో అనాహత్ క్వార్టర్ ఫైనల్ దశలోనే నిలిపివేయబడింది. ఆమె ఇప్పుడు సెమీఫైనల్‌లో ఈజిప్ట్‌కు చెందిన నదియన్ ఎల్హమ్మమితో తలపడనుంది.

# వాణిజ్యం

# రూ.9లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

**ముంబై, జూలై 25:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఫైనాన్షియల్ స్టాక్స్, అధిక వెయిటేజీ కలిగిన స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. ముఖ్యంగా ఎఫ్ఐఐల అమ్మకాలు, భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌పై అనిశ్చితి, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు ఇందుకు కారణంగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఈ రెండు సెషన్లలోనే సెన్సెక్స్ 1264 పాయింట్లు కోల్పోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9 లక్షల కోట్లు క్షీణించి రూ.451 లక్షల కోట్లకు చేరింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 82,065.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,184.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,397.69 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 721.08 పాయింట్ల నష్టంతో 81,463.09 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.10 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.52గా ఉంది. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.33 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ అమెరికా మధ్య ట్రేడ్ డీల్ విషయంలో గత కొన్ని రోజులుగా అదిగో, ఇదిగో అనే మాటలు వినిపిస్తున్నాయే తప్ప చర్చలు మాత్రం ఓ కొలిక్కి రాలేదు. అగ్రికల్చరల్, డెయిరీ ప్రొడక్టుల విషయంలో ఇరు దేశాల మధ్య సయోధ్య కుదరడం లేదని తెలుస్తోంది. అదే సమయంలో జపాన్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, వియత్నాం వంటి దేశాలతో అమెరికా ఇప్పటికే ట్రేడ్ డీల్స్ కుదుర్చు కుంది. మరోవైపు ఆగస్టు 1 డెడ్‌లైన్ సమీపిస్తుండడంతో మదుపర్ల అప్రమత్తత కారణమని తెలుస్తోంది.విదేశీ సంస్థాగత మదుపర్లు కొన్నాళ్లుగా మన ఈక్విటీల్లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. జులైలో ఇప్పటి వరకు రూ.28,528 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా.. గడిచిన నాలుగు రోజుల్లో రూ.11,527 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు డేటా చెబుతోంది.



# కృత్రిమ మేధతో అంతా గందరగోళం: మైక్రోసాఫ్ట్ సిఇఒ

**వాషింగ్టన్, జూలై 25:** మైక్రోసాఫ్ట్‌లో భారీగా ఉద్యోగాల కోత విధించడం సీఈవో సత్యనాదెళ్లను కూడా భావోద్వేగపరంగా కదిలించింది. అదే సమయంలో కృత్రిమ మేధతో చోటుచేసుకొంటున్న మార్పులు గందరగోళంగా ఉన్నాయన్నారు. ఆయన ఉద్యోగులకు వీడ్కోలు పలుకుతూ ఎమోషనల్ మెసేజ్‌ను పంపారు. దీనిలో ఆయన చాలా సూటిగా రాసుకొచ్చారు. అన్ని విషయాల కంటే ముందు భావోద్వేగపరంగా నాపై ప్రభావం చూపుతున్న అంశాలపై మాట్లాడాలనుకుంటున్నాను. అదే సమయంలో మీరు దేనిగురించి ఆలోచిస్తున్నారో కూడా నేను అర్థం చేసుకోగలను. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టం. అవి మా తోటి ఉద్యోగులపైనా ప్రభావం చూపుతాయి. మన టీమ్‌మేట్స్, కొలీగ్స్, ఫ్రెండ్స్‌తో మనకు ఎన్నో అనుభవాలు, అనుబంధాలు, జ్ఞాపకాలు ఉంటాయి. ఇది ఓ పరిశ్రమ విజయరహస్యమే అయినా దానికి ఎలాంటి విలువ లేదు. అభివృద్ధి గీత గీసినట్లు సూటిగా ఉండదు.. ఎగుడుదిగుడులు ఉంటాయి. కొన్నిసార్లు వైవిధ్యంగా కూడా ఉంటుంది. కానీ, ఎప్పుడూ పురోగతిని కోరుకుంటుంది. కానీ, మార్పునకు ఇది మనకిచ్చే సరికొత్త అవకాశం. భవిష్యత్తులో మరింత ముందుకుసాగండి అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. అంతేకాదు.. మైక్రోసాఫ్ట్ భవిష్యత్తు దార్శనికతలో ఏఐ కీలక భాగమనే సందేశాన్ని ఆయన ఈ మెమోలో పేర్కొన్నారు.భూమిపై ప్రతి వ్యక్తి, సంస్థ మరింత అభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా కృత్రిమేధ సంస్కృతికి అలవాటుపడాల్సిందేనన్నారు. కొత్తతరం ఏఐ అంటే కేవలం కొన్నింటికి అవసరమైన టూల్స్‌ను అభివృద్ధి చేయడం కాదన్నారు. ప్రతి ఒక్కరూ సొంతంగా తమకు అవసరమైన టూల్స్‌ను తయారు చేసుకునేందుకు కావాల్సిన టూల్స్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఈ క్రమంలో భవిష్యత్తులో మరిన్ని లేఆఫ్‌లు ఉండవన్న హామీ మాత్రం ఆయన నుంచి రాలేదు. మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల సంఖ్యలో మాత్రం పెద్దగా మార్పులు లేవని ఆ నోట్‌లో పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు, వ్యాపారాల్లో కృత్రిమమేధతో మార్పులు చోటుచేసుకొంటున్న వేళ.. ఉద్యోగులు గ్రోత్ మైండ్‌సెట్‌తో ఉండాలని కోరారు. ప్రస్తుతం తాను గందరగోళానికి గురవుతున్నాను. కానీ, మార్పులు చోటుచేసు కొనే సమయంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితి తప్పదు. మా టీమ్‌లను పునర్ వ్యవస్థీకరిస్తున్నాం.. దీంతో పరిధులు పెరుగుతున్నాయి. సరికొత్త అవకాశాలు అన్ని చోట్లా ఉన్నాయన్నారు.



# ఎంజి నుంచి సైబర్‌స్టర్ 'ఇవి'

**ముంబై, జూలై 25:** జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా దేశీయ మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును లాంచ్ చేసింది. ఈ కారు ధరను రూ.74.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) నిర్ణయించింది. ప్రీరిజర్వేషన్ చేసుకున్న వారికి రూ.72.49 లక్షలకే అందిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో దీన్ని తొలుత ప్రదర్శించారు. తాజాగా దేశీయంగా లాంచ్ చేశారు. ఎంజీ సెలక్ట్ ప్రీమియం డీలర్‌షిప్ కేంద్రాల్లో లభిస్తుంది. ఎంజీ సైబర్‌స్టర్ ఫోల్డింగ్ సాఫ్ట్ టాప్ రూఫ్, సిజర్ డోర్స్‌తో 2 సీటింగ్‌తో వస్తోంది. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, ఎల్‌ఈడీ డీఆర్‌ఎల్స్, యారో షేప్డ్ ఎల్‌ఈడీ టెయిల్ లైట్స్ ఉన్నాయి. 20 అంగుశాల లైట్ వెయిట్ అల్లాయ్ వీల్స్‌తో వస్తోంది. కారు లోపలి భాగంలో 10.25 అంగుళాల సెంట్రల్ టచ్‌స్క్రీన్, 7 అంగుళాల డిజిటల్ ప్యానెల్ ఇచ్చారు. వీటి సాయంతో రియల్‌టైమ్ వెహికల్ డేటా, ఎటర్‌టైన్‌మెంట్, సెట్టింగ్స్‌ను యాక్సెస్ చేయొచ్చు. పీఎం 2.5 ఫిల్టరేషన్‌తో డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్‌తో వస్తోంది.



# బ్రిటన్ ఒప్పందంతో భారత్‌కు ప్రయోజనం: ఆర్‌బిఐ గవర్నర్

**న్యూఢిల్లీ, జూలై 25:** భారత్, బ్రిటన్ మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్వాగతించారు. ఇరుదేశాలు చేసుకున్న ఈ ఒప్పందం భారత ఆర్థికవ్యవస్థలోని బహుళ రంగాల అభివృద్ధికి సహాయపడుతుందని తెలిపారు. ఇతర దేశాలతోనూ భారత్ ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అనేక దేశాలు కలిసి పనిచేసే విధానం తగ్గిపోతున్న నేపథ్యంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు చేకూరుస్తాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. బీఎఫ్ఎస్ఐ సమ్మిట్‌లో మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ అమెరికాతో సహా పలు దేశాలతో వాణిజ్య చర్చలు కొనసాగిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. అగ్రరాజ్య ఆర్థికాభివృద్ధికి అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ తీసుకుంటున్న చర్యలను సంజయ్ సమర్థించారు. ఆయన తన పనిని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. కాగా పావెల్ నిర్ణయాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న సమయంలో ఫెడరల్ రిజర్వ్ స్వయంప్రతిపత్తితో పనిచేస్తుండడాన్ని సంజయ్ మల్హోత్రా ప్రశంసించడం గమనార్హం. విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ బ్రిటన్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ఇరుదేశాల మధ్య బంధాలను మరింత పెంచుకునే చర్యల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో ఇరుదేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం కానుంది. బ్రిటన్‌కు భారత ఎగుమతుల్లో 99శాతం ఉత్పత్తులపై సుంకాల భారం తగ్గనుంది. దుస్తులు సహా చాలా వ్యవసాయ రంగ, ఆహారశుద్ధి ఉత్పత్తులకు టారిఫ్‌ను లండన్ పూర్తిగా మినహాయించనుంది. బ్రిటన్(యూకే) నుంచి దిగుమతయ్యే స్కాచ్ విస్కీ, జిన్‌లపై సుంకాన్ని మన దేశం సగానికి తగ్గించనుంది. తాజా ఎఫ్‌టీఏతో ఇరుదేశాల్లోనూ పలు రంగాల్లో వేలకొద్దీ ఉద్యోగావకాశాలు రానున్నాయి.



# ఎగుమతుల్లో 'మారుతి కాంపాక్ట్ ఎస్‌యువి' రికార్డు

**ముంబై, జూలై 25:** భారత ఆటోమొబైల్ తయారీలో మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తన కాంపాక్ట్ ఎస్‌యువి ఫ్రాంక్స్ ఎగుమతుల్లో రికార్డు నెలకొల్పింది. భారతదేశం నుంచి వేగంగా ఒక లక్షల ఎగుమతులను అధిగమించిన ఎస్‌యువిగా నిలిచిందని కంపెనీ ప్రకటించింది.2023 జూన్‌లో ప్రపంచ ఎగుమతి కార్యకలాపాలు ప్రారంభమైన కేవలం 25 నెలల్లోనే ఈ మైలురాయిని చేరుకుందని చెప్పింది. గుజరాత్‌లోని మారుతి సుజుకి ప్లాంట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్రాంక్స్ లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా విదేశీ మార్కెట్లలో బలమైన పనితీరును కనబరుస్తోందని కంపెనీ తెలిపింది. జపాన్‌లో దీనికి పెరుగుతున్న ప్రజాదరణ ఎగుమతి వృద్ధికి దోహదం చేసిందని చెప్పింది. మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ హిసాషి టేకుచి మాట్లాడుతూ, ప్రపంచ మార్కెట్ల ప్రభావం స్థాయి వాహనాలను తయారు చేయగల సామర్థ్యం కంపెనీకి ఉంది. మేక్ ఇన్ ఇండియా చొరవకు కంపెనీ సాధించిన విజయమే నిదర్శనం. ప్యాసింజర్ వాహన ఎగుమతులు, అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టిసారిస్తున్నాం అని అన్నారు. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే మారుతి సుజుకి 96వేల వాహనాలను ఎగుమతి చేయడం విశేషం. భారతదేశ ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో రికార్డు స్థాయిలో 47శాతం వాటాను ఆక్రమించింది. వరుసగా నాలుగో యేడాది భారతదేశపు టాప్ ప్యాసింజర్ వాహన ఎగుమతిదారుగా కంపెనీ తన స్థానాన్ని నిలుపుకుంది.



# ఇంటెల్‌లో 25వేల మందికి ఉద్వాసన

**ముంబై, జూలై 25:** ప్రపంచ చిప్ దిగ్గజం ఇంటెల్ తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 25,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించనున్నట్టు నివేదించింది. ప్రస్తుతం 1,08,900 మంది ఉద్యోగులున్న ఈ సంస్థ.. 2025 చివరి నాటికి ఉద్యోగుల సంఖ్యను 75,000కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉద్యోగ కోతలు లేఆఫ్‌లు, సహజ విరమణలు, ఇతర చర్యల ద్వారా జరుగుతాయని కంపెనీ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంటెల్ ఇప్పటికే సుమారు 15 శాతం (సుమారు 15,000) ఉద్యోగాలను తగ్గించింది. గత ఏడాది కూడా 15,000 కంటే ఎక్కువ ఉద్యోగాలను తొలగించడం గమనార్హం. 2024 రెండవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తూ ఇంటెల్ ఈ లేఆఫ్‌లను ధ్రువీకరించింది. కంపెనీ 2.9 బిలియన్ డాలర్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇందులో తాజా తగ్గింపులకు సంబం ధించిన పునర్వ్యవస్థీకరణ ఖర్చులు కూడా ఉన్నాయి.



అయినప్పటికీ, త్రైమాసికఆదాయం 12.9బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. ఇది మార్కెట్ అంచనాలను అధిగమించడం విశేషం. ప్రస్తుత త్రైమాసికంలో ఆదాయం 12.6 బిలియన్ డాలర్ల నుంచి 13.6 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని, సగటు న 13.1 బిలియన్ డాలర్లుగా ఉంటుందని ఇంటెల్ అంచనా వేస్తోంది. ఇది విశ్లేషకుల అంచనాల కంటే ఎక్కువ కావడం కొంత సానుకూల అంశం. ఒకప్పుడు ప్రపంచ చిప్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న ఇంటెల్ ఇటీవలి సంవత్సరాలలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. 1990లలో పర్సనల్ కంప్యూటర్ బూమ్ సమయంలో మైక్రో ప్రాసెసర్ వ్యాపారంలో ఆధిపత్యం వహించినప్పటికీ ఆ తర్వాత వెనుకబడిపోయింది. ప్రస్తుతం ఎన్‌విడియా వంటి కంపెనీలు నాయకత్వం వహిస్తున్న, వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమమేధస్సు (ఏఐ)చిప్ విభాగంలో ఇంటెల్ వెనుకబడి ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14